www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



8 బంతుల్లో 8 సిక్సర్లు

11 బంతుల్లో హాఫ్ సెంచరీ

మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

అరుణాచల్‌తో రంజీ ప్లేట్ మ్యాచ్

ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదితే అద్భుతమనుకున్నాం. కానీ మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ చౌధరి అంతకు మించి అన్నట్టుగా.. వరుసగా 8 బంతుల్లోనూ సిక్సర్లు బాది వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అతడి దూకుడైన ఆటతీరుకు 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకేసారి రెండు రికార్డులను నమోదు చేసిన బ్యాటరయ్యాడు. 9

సోమవారం | 10-11-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 244 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి రా.12:08 తదుపరి సప్తమి, నక్షత్రం: పునర్వసు రా.6:48 తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.7:26-8:56, రా.2:38-4:12, దుర్ముహూర్తం: మ.12:21-1:06, మ.2:36-3:21, అమృతఘడియలు: సా.4:31-6:02, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:21, సూర్యాస్తమయం: 5:36

కనీసం పదో తరగతి కూడా పాస్‌కాని నిరుద్యోగ యువకులు ఉన్నత విద్యావంతుల్ని బురిడీ కొట్టిస్తున్నారు. ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీర్లు, పెన్షనర్లు, వృద్ధులు, ఆఖరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే పేదలను సైతం నిలువునా దోచుకుంటున్నారు. బాధితులు తేరుకునే లోపు లక్షలు కాజేస్తున్నారు. లాటరీ పేరుతో నైజీరియన్లు మొదలు పెట్టిన సైబర్ నేరాలు.. బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్డేట్, కొరియర్ మోసాలు దాటి ఇప్పుడు డిజిటల్ అరెస్టుల వరకు చేరాయి. రోజుకో కొత్త ఎత్తుగడతో ప్రజల్ని, సంపన్నుల్ని దోచుకొంటున్నారు.

క్లిక్ నుంచి క్రిప్టో దాకా

సైబర్ నేరగాళ్ల నయా దందా.. వృద్ధులు, సంపన్నులే టార్గెట్



డిజిటల్ అరెస్టులంటూ బెదిరింపులు

పెట్టుబడి పేరుతో మోసాలు

ఏపీకే ఫైళ్లు పంపి ఆండ్రాయిడ్ ఫోన్ స్వాధీనంలోకి.. డబ్బు లూటీ

ఎక్కడెక్కడి నుంచో బెదిరింపు కాల్స్

కాంబోడియా నుంచి వీడియో కాల్స్

సొమ్ము మ్యూల్ ఖాతాల్లో పడగానే చైనీస్ గేట్‌వేస్ ద్వారా క్రిప్టోలోకి

అక్కడి నుంచి ఇతర ఖాతాలకు మళ్లించి విత్ డ్రా



కష్టంగా మారుతున్న సొమ్ము రికవరీ

అప్రమత్తతే ముఖ్యమంటున్న పోలీసులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటికి కన్నాలు వెయ్యరు.. తలుపులు బద్దలు కొట్టరు.. కనీసం జేబులో చెయ్యి పెట్టరు.. కంటికి కూడా కనిపించరు.. కానీ జీవితకాలం దాచుకున్న సొమ్మును కొట్టేస్తున్నారు. జీవిత చరమాంకంలో ఆసరా కోసం దాచుకున్న సొమ్మును పెద్దల నుంచి.. జీవితంలో స్థిరపడేందుకు సేకరించుకున్న సొమ్మును యువత నుంచి పెట్టుబడి రూపంలో కాజేస్తున్నారు. మధ్య తరగతిపై ఆశల వల విసిరి బురిడీ కొట్టిస్తున్నారు. అలా దోచుకున్న సొమ్మును వందలాది మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించి అక్కడి నుంచి క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేస్తున్నారు. అంతిమంగా వందలాది చిన్న చిన్న ఖాతాల్లోకి చేర్చి విత్ డ్రా చేసుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల కొత్త పంథా ఇది! ఒకప్పుడు సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోని సొమ్మును పోలీసులు ఎంతో కొంత రికవరీ చేసేవారు. 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు మొదటి గంటలో ఫోన్ చేస్తే కేంద్ర హోంశాఖ మ్యూల్ ఖాతాలను స్తంభింపజేసేది. ఇప్పుడు బాధితులు ఫోన్ చేసేలోపే చైనీస్ గేట్ వే ద్వారా క్రిప్టో కొనుగోలు చేసి, కనీస రికవరీ కాకుండా సైబర్ నేరగాళ్లు జాగ్రత్త పడుతున్నారు. దర్యాప్తులో నాలుగైదు దశలు దాటి అంతిమదశకు చేరుకున్నా రికవరీ లేకపోవడంతో తమ శ్రమ అంతా వృథా

మిగతా 12వ పేజీలో...

సైబర్ నేరగాళ్లు కొట్టేసిన సొమ్మును ఖాతాల్లో నుంచి విత్ డ్రా చేయాలంటే కనీసం గంట పడుతుంది. ఆ గంటలోపే బాధితులు కాల్ చేస్తే డబ్బులు విత్ డ్రా చేయకుండా కేంద్ర హోంశాఖ స్తంభింపజేస్తుంది. ఈ విషయాన్ని పసిగట్టిన నేరగాళ్లు కొట్టేసిన సొమ్మును నిమిషాల్లోనే మ్యూల్ ఖాతాలకు మళ్లించి.. వెంటనే చైనా గేట్‌వేస్ ద్వారా రికవరీ చేయలేని క్రిప్టో కరెన్సీ కొనుగోలు చేస్తున్నారు.

- ఏలూరు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్

అంతకంతకూ పెరుగుతున్న వ్యయం! ఆ మేరకు పెరగని ప్రభుత్వ ఆదాయం! దీని ఫలితం... రెవెన్యూ లోటు పోటెత్తుతోంది! ఐదేళ్ల జగన్ హయాంతో పోల్చితే... గణనీయమైన మార్పు కనిపించినప్పటికీ, ఇంకా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. జగన్ హయాంలో రెవెన్యూ లోటు ఒక దశలో 280 శాతానికి చేరింది. ఇప్పుడు అది 140 శాతమని లెక్క తేలింది.



పోటెత్తుతున్న లోటు

ప్రమాదంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి!

కట్టలు తెంచుకుంటున్న రెవెన్యూ లోటు

2025-26లో 33,185 కోట్లుంటుందని అంచనా

ఆరు నెలలకే రూ.46,652 కోట్లకు చేరిన వైనం

అంచనాలకు తగినట్లు పెరగని రాబడులు

అంతకంతకూ పెరుగుతున్న రెవెన్యూ వ్యయం

తొలి 6 నెలల్లో రూ.63,052 కోట్ల అప్పు

అనవసర వ్యయాలను తగ్గించుకోవాల్సిందే!

జగన్ హయాంలో...

వైసీపీ హయాంలోనూ రెవెన్యూ లోటు హద్దులు దాటి డేంజర్ జోన్‌లోనే ఉండేది. ఉదాహరణకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాల్లో రెవెన్యూ లోటు రూ.17,036 కోట్లు ఉంటుందని లెక్కించారు. కానీ, 10 నెలల్లో లోటు రూ.47,958 కోట్లకు చేరుకుంది. అంచనాలతో పోలిస్తే ఇది 281 శాతానికి చేరినట్టు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.33,185 కోట్ల రెవెన్యూ లోటు ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఏప్రిల్- సెప్టెంబరు నాటికే ఇది రూ.46,652 కోట్లకు చేరింది. అంటే 140 శాతం పెరిగింది. రెవెన్యూ రాబడి కంటే రెవెన్యూ ఖర్చులు ఎక్కువైతే అదే... రెవెన్యూలోటు! రెవెన్యూ రాబడి అంటే... అప్పులను మినహాయించగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం. రాష్ట్రంలో సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, పన్నేతర ఆదాయం, కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ కలిపి రెవెన్యూ రాబడి అవుతుంది. సొంతపన్నుల్లో జీఎస్టీ వసూళ్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం, భూమి శిస్తు, అమ్మకపు పన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్రపన్నుల్లో వాటాలు, ఇతర పన్నులు-సుంకాల ద్వారా వచ్చే ఆదాయం ఇందులో ఉంటుంది. రెవెన్యూ ఖర్చు అంటే... అభివృద్ధి పనులు, తిరిగి ప్రతిఫలాన్ని ఇచ్చే పద్దులపై పెట్టే ఖర్చులను మినహాయించగా పెట్టే ఇతర వ్యయం! జీతాలు, పింఛన్లు, రాయితీలు, వడ్డీల చెల్లింపులతో పాటు ప్రభుత్వ నిర్వహణ, ఇతర ప్రభుత్వ పథకాలకు వెచ్చించే మొత్తాలను రెవెన్యూ ఖర్చులుగా లెక్కిస్తారు. వీటిపై పెట్టిన ఖర్చులో పైసా తిరిగిరాదు. లోటును హద్దుల్లో ఉంచడమే అసలైన ఆర్థిక నిర్వహణ.


అంతకంతకూ పెరుగుతూ...

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెవెన్యూ లోటును తగ్గిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. బడ్జెట్ అంచనాల్లో కూడా రెవెన్యూ లోటును చాలా తక్కువగా చూపిస్తోంది. కానీ... అసలు వాస్తవాలు

మిగతా 11వ పేజీలో...

ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం

ప్రజలందరి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్



శంకర కంటి ఆస్పత్రిలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. వేదికపై శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి, కేంద్ర మంత్రి పెమ్మసాని, ప్రతినిధులు ఆర్ వి రమణి, మురళీ కృష్ణ మూర్తి

రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా: ముఖ్యమంత్రి

పేదలకు రూ.25 లక్షల వరకు వైద్యసాయం

కృత్రిమ మేధతో అన్ని రకాల వైద్యసేవలు

టాటా సంస్థ సహకారంతో సంజీవని కేంద్రాలు

ఏఎన్ఎం నుంచి స్పెషలిస్టు వైద్యుల వరకు ఆన్‌లైన్‌లో అందుబాటులో

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా అమలు

రాబోయే రోజుల్లో రాష్ట్రమంతటా: సీఎం

పెదకాకాని శంకర నేత్రాలయలో సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌కు శ్రీకారం

త్వరలో శంకర పాఠశాలలు: విజయేంద్ర

ఆరోగ్యం, సంపద, ఆనందకర మైన సమాజ స్థాపనే మా ప్రభుత్వ ఆలోచన. పేదరికం లేని సమాజం చూడాలన్నదే జగద్గురు ఆదిశంకరుల కల. ఇది అసాధ్యం కాదు. అందరం అనుకుంటే తప్పకుండా సాధిస్తాం.

ఎన్ని ఆస్పత్రులున్నా కంచి పీఠం లాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు అవసరం. అవే మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తాయి.

- సీఎం చంద్రబాబు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డబ్బు, హోదా, కార్లు, బంగ్లాలు ఎన్ని ఉన్నా ఆరోగ్యం బాగా లేకుంటే ఆ కుటుంబాన్ని పేదరికంలోకి నెట్టినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే తమ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ రూ. 2.50 లక్షల యూనివర్సల్ హెల్త్ కవరేజీని త్వరలోనే తీసుకురాబోతున్నామని ప్రకటించారు. పేదవాళ్లకు రూ. 25 లక్షల వరకు

మిగతా 11వ పేజీలో...



శ్రీవారి ఆలయంలో ముఖేశ్ అంబానీకి ప్రసాదం అందజేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి 2

వెంకన్న వంటశాలలకు వంద కోట్లు

ముఖేశ్ అంబానీ భూరి విరాళం

రోజూ 2లక్షల మందికి పైగా అన్నప్రసాదం వడ్డించే సామర్థ్యం

సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ అధినేత

గురువాయూర్‌లో ఆస్పత్రి నిర్మాణానికి రూ.15 కోట్లకు చెక్కు

నాథ్‌ద్వారాలో రూ. 50 కోట్లతో వసతి సముదాయం

తొలి విడత కింద 15 కోట్లు విరాళంగా అందించిన అంబానీ



పట్నాలో మంత్రి లోకేశ్‌తో స్థానిక నేతలు, కార్యకర్తల సెల్ఫీ

'ఒక్క చాన్స్' తప్పు మీరు చేయొద్దు

ఆచరణ సాధ్యం కాని హామీలు నమ్మి మోసపోవద్దు

బిహార్ ఓటర్లకు లోకేశ్ పిలుపు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎన్‌డీఏ గెలవాలి

జంగిల్‌రాజ్ పోయి నితీశ్ వచ్చాకే అభివృద్ధి

డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్లతో ప్రయోజనాలెన్నో

బిహార్ గడ్డపై టీడీపీ యువనేత రెండ్రోజులు ప్రచారం

హిందీ ప్రసంగాలతో ఆకట్టుకున్న లోకేశ్

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బిహార్ పాత్ర చాలా కీలకమని.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి యువత ఎన్‌డీఏను మరోమారు గెలిపించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పిలుపిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019లో ఒక్క చాన్స్ అంటూ వచ్చిన వైసీపీకి అవకాశం ఇవ్వడం వల్ల.. శాంతిభద్రతలు క్షీణించి, పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. దానివల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయిందని.. అలాంటి పరిస్థితులు తెచ్చుకోవద్దని బిహార్ యువతకు విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. బిహార్లో

మిగతా 11వ పేజీలో...

బిహార్‌లో ప్రచారం

పరిసమాప్తం

రేపు 122 చోట్ల ఓటింగ్

ఐదో దశ పర్యాయంపై

సీఎం నితీశ్ దృష్టి



ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో

గెలుపు మాదే..!

దేశాన్ని విభజించడానికి యత్నిస్తున్న బీజేపీ, ఆరెస్సెస్: రాహుల్ 2

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్

ఒకరు హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు

గ్రామీణుల చేతికి ఆస్తి హక్కు

ఆబాదీ, అనాధీన, ఆక్రమణ భూములపై సర్వే.. హక్కుల కల్పన

స్థిరాస్తి కార్డుల పంపిణీకి సిద్ధం

'స్వామిత్వ'తో తొలగనున్న ఇక్కట్లు

సాంకేతికతతో ఆస్తి విలువ గణన

వాటి ఆధారంగా రుణాలు, పన్నులు

క్రయ విక్రయాలకూ అనుకూలం 11

5,847 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి

నేటి నుంచి 2,344 గ్రామాల్లో సభలు

మార్చిలోపు హక్కుదారుల చేతికి కార్డులు



ప్రభుత్వం అందజేయనున్న ఆస్తి యాజమాన్య ధ్రువీకరణ పత్రం

ఏనుగుకు మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్ పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్



ఏనుగుల దాడుల నివారణకు

'హనుమాన్'

ఈ ప్రాజెక్టును పకడ్బందీగా అమలు చేయాలి 11

ఏనుగుల సంచారంపై ఎప్పటికప్పుడు సమాచారం

మార్చి 3లోగా అధునాతన టెక్నాలజీతో యాప్: డిప్యూటీ సీఎం



యువ వైద్యులు, విద్యార్థుల శిక్షణ కోసం రూపొందించిన బస్సు.. లోపల శిక్షణ ఏర్పాట్లు

కదిలొచ్చే వైద్య విద్యాలయం!

ల్యాప్రోస్కోపిక్ చికిత్సలపై ఉచిత శిక్షణ

రాష్ట్రంలో 32 రోజులపాటు అందుబాటులో బస్సు 12

యువ వైద్యులు, విద్యార్థులకు వరం

తిరుమల అన్నప్రసాదం అద్భుతం!

ఎంతో రుచి, మరెంతో శుచిగా ఉంది

వేలాది మందికి ఇంత రుచిగా ఎలా చేస్తున్నారో ఆశ్చర్యంగా ఉంది

శ్రీవారి దర్శనానికి వెళ్లిన ప్రతి ఒక్కరూ తప్పకుండా తినాలి: అంబటి రాంబాబు

తిరుమల పర్యటనపై మాజీ మంత్రి వీడియో 2



ఆ చిన్నారిది ఆత్మహత్య కాదు.. హత్య!

తెలిసిన ఎలక్ట్రీషియనే చంపేశాడు.. చోరీకి వచ్చి ఘాతుకం

ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం.. వీడిన మిస్టరీ

దర్యాప్తు సమయంలోనూ నిందితుడు అక్కడే

క్లూస్ టీం వద్ద అతిగా ప్రవర్తించి దొరికేశాడు

ఐదు రోజుల్లో ఛేదించిన రామచంద్రాపురం పోలీసులు 11



సిద్ర రంజిత

రాకెట్‌లాంటి యుద్ధ విమానం.. ఎక్స్-బ్యాట్

- నిట్టనిలువునా టేకాఫ్ అయ్యే సత్తా.. ల్యాండింగ్ కూడా అలాగే!
- జీపీఎస్ లేని చోట్లా.. 'హైవ్‌మైండ్ ఏఐ' సాయంతో ప్రయాణం
- అమెరికన్ డిఫెన్స్ టెక్నాలజీ దిగ్గజం షీల్డ్ ఏఐ అద్భుత ఆవిష్కరణ



న్యూయార్క్, నవంబరు 9: వైమానికరంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది! చోదకుడు లేకుండా.. రన్‌వే అవసరమే లేకుండా.. ఏఐ సాయంతో నిట్టనిలువునా రాకెట్‌లాగా గాల్లోకి లేచి లక్ష్యం దిశగా దూసుకుపోయే ఫైటర్‌జెట్‌ను అమెరికన్ డిఫెన్స్ టెక్నాలజీ దిగ్గజం షీల్డ్ ఏఐ అభివృద్ధి చేసింది. టేకాఫే కాదు.. ఈ విమానం ల్యాండింగ్ కూడా నిలువుగానే అవుతుంది. ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుల్లీ అటానమస్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (వీటీవోఎల్) యుద్ధవిమానం ఇది. ఈ విమానానికి 'ఎక్స్-బ్యాట్' అని పేరు పెట్టింది. ఈ విమానం తయారీలో ఆ సంస్థ తాను సొంతంగా అభివృద్ధి చేసుకున్న 'హైవ్‌మైండ్' అనే కృత్రిమ మేధ వ్యవస్థను ఉపయోగించింది. దీనివల్ల.. జీపీఎస్, ఇతర సమాచార వ్యవస్థలేవీ పనిచేయని చోట కూడా ఎక్స్-బ్యాట్లు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని పనిచేయగలుగుతాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. 50 వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఎగరగలదు. గణనీయమైన పేలోడ్ భారాన్ని మోసుకుంటూ 3,700 కిలోమీటర్ల దాకా వెళ్లగలదు. దీని తయారీకి ఒక్కో యూనిట్‌కూ రూ.239 కోట్లు ఖర్చవుతుంది. ఇది సంప్రదాయ యుద్ధవిమానాల తయారీకి అయ్యే ఖర్చుకన్నా చాలా తక్కువ. ఎఫ్-35 ఫైటర్ జెట్ ఒక్కో యూనిట్‌కూ అయ్యే ఖర్చు రూ.886 కోట్లకు పైమాటే. ఈ విమానం లద్దాఖ్, అరుణాచల్ వంటి ఎత్తైన ప్రదేశాల్లో ఎంతగానో ఉపకరిస్తాయని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వెంకన్న వంట శాలకు వంద కోట్లు

- ముఖేశ్ అంబానీ భూరి విరాళాలు

తిరుమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఆయన తిరుమలతో పాటు కేరళలోని గురువాయూర్, రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారా ఆలయాలను సందర్శించారు. భూరి విరాళాలను ప్రకటించారు. ఆదివారం వేకువజామున తిరుమల శ్రీవారి ఆలయంలోకి వెళ్లి ధ్వజస్తంభానికి మొక్కుకుని, సుప్రభాత సేవ అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. నాథ్‌ద్వారాలో భక్తుల సౌకర్యార్థం రూ.50 కోట్లకు పైగా వ్యయంతో యాత్రికుల సముదాయాన్ని వచ్చే మూడేళ్లలో నిర్మించనున్నట్లు ముఖేశ్ అంబానీ ప్రకటించారు. తొలి విడతలో భాగంగా రూ.15 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇక గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి గాను మొదటి విడతగా రూ.15 కోట్లు చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.

మాకు దక్కిన మహాభాగ్యం: రిలయన్స్

శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చే భక్తులందరికీ సకాలంలో అన్నప్రసాదాలు అందించేలా నూతన శాటిలైట్ కిచెన్(వంటశాల) నిర్మాణానికి టీటీడీ సిద్ధమైంది. నిత్యం 2లక్షల మందికి సరిపడేలా అన్నప్రసాదాలను తయారు చేసుకునేందుకు వీలుగా దాదాపు రూ.వంద కోట్లతో దీన్ని నిర్మించేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేశ్ అంబానీ ముందుకొచ్చారు. 'తిరుమలలో ఆధునిక సౌకర్యాలతో కూడిన 'కొత్త వంటశాల'ను అన్నప్రసాదం ట్రస్టుకు అంకితం చేస్తున్నాం. ఏపీ ప్రభుత్వ సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమాన్ని చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం మహాభాగ్యం. సీఎం చంద్రబాబు ఈ పుణ్యకార్య దృష్టిని ముందుకు తీసుకెళ్లడంలో మేమూ కలవడం గర్వకారణంగా భావిస్తున్నాం' అని ఆ సంస్థ పేర్కొంది.

తిరుమల అన్నప్రసాదం అద్భుతః!

- ఎంతో రుచి, మరెంతో శుచిగా ఉంది: అంబటి



గుంటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): "తిరుమలలో అన్నప్రసాదం అద్భుతంగా ఉంది. ఎంతో రుచితో పాటు మరెంతో శుచిగా ఉంది." అని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కితాబిచ్చారు. రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లిన ఆయన.. అక్కడి తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనం చేశారు. అనంతరం.. తిరుమల పర్యటనపై తన సొంత యూట్యూబ్ చానల్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. "తిరుమలలో అన్నప్రసాదం ఎంతో రుచితో పాటు శుచిగా ఉంది. వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో సాధారణ రోజుల్లో రోజుకు 90 వేల మంది అన్నప్రసాదం తీసుకుంటారు. ఇక ఉత్సవాలు జరిగే రోజుల్లో లక్షా 30 వేల మంది వరకు భోజన ప్రసాదం స్వీకరిస్తారు. ఇంత మందికి ఎంతో రుచితో పాటు శుచిగా భోజన ప్రసాదాన్ని అందించటం ఎలా సాధ్యపడుతోందో నాకు ఆశ్చర్యంగా ఉంది. తిరుమలకు వచ్చిన వారు ఈ ఉచిత అన్నప్రసాదాన్ని తప్పకుండా స్వీకరించాలని కోరుతున్నా." అని అంబటి వ్యాఖ్యానించారు. అంబటి ప్రశంసలపై టీడీపీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో కంటే ఇప్పుడు టీటీడీలో సమూలమార్పులు వచ్చాయంటూ అంబటి వీడియోను వైరల్ చేస్తున్నారు. అంబటి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపాయి. కూటమి ప్రభుత్వ పాలనలో టీటీడీలో మెరుగైన మార్పులు వచ్చాయని, దీనికి విపక్ష పార్టీ నేత వ్యాఖ్యలే నిదర్శమని కొందరు చెబుతున్నారు.

పాక్ రాజ్యాంగ సవరణపై దేశవ్యాప్త ఆందోళనలు

ఇస్లామాబాద్, నవంబరు 9: పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ పదవిలో కూర్చోబెట్టేందుకు ఏకంగా దేశ రాజ్యాంగంలో 27వ సవరణ తీసుకురావడంపై విపక్షాలు దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టాయి. ఈ నెల 28న రిటైర్ కానున్న మునీర్‌ను ఏకీకృత కమాండ్ వ్యవస్థ అధిపతిగా చేస్తే ఆయనకు త్రివిధ దళాలపై మరింత పట్టుపెరుగుతుందని, అపరిమిత అధికారాలు లభిస్తాయని విపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ ప్రతిపాదనలపై పార్లమెంట్‌లో ఓటింగ్ ఉండటంతో విపక్షాలన్నీ ఐక్యమై ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

అద్వాణీ సేవలను తక్కువగా చూడొద్దు: థరూర్

న్యూఢిల్లీ, నవంబరు 9: కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్.. బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వాణీపై ప్రశంసలు కురిపించారు. శనివారం అద్వాణీ 98వ జన్మదినం సందర్భంగా థరూర్ శుభాకాంక్షలు తెలుపుతూ చేసిన వ్యాఖ్యలను ఓ న్యాయవాది తప్పుబట్టడంపై తాజాగా స్పందించారు. ఒక్క సంఘటననే చూపిస్తూ దేశానికి అద్వాణీ చేసిన విశేషమైన సేవలను తక్కువ చేసి చూడడం సరికాదన్నారు. నెహ్రూ చేసిన సేవలను చైనా సంఘటనతో, ఇందిరాగాంధీ సేవలను ఎమర్జెన్సీతో ముడిపెట్టి తక్కువ చేసి చూడటం కూడా సమంజసం కాదని, ఇదే న్యాయం అద్వాణీకి వర్తిస్తుందని పేర్కొన్నారు. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచే విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ అణు సైరన్!



ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి తరహాలో మళ్లీ అణ్వాయుధాల పోటీ

- ఉక్రెయిన్ వేదికగా అగ్ర రాజ్యాల పోరు
- అణుశక్తితో నడిచే క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించిన రష్యా
- అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు ట్రంప్ ప్రకటన.. అణ్వస్త్రాల పెంపులో చైనా

(సెంట్రల్ డెస్క్)

మన ప్రపంచం మళ్లీ 'అణు'భయంలోకి వెళుతోంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తర్వాత తిరిగి అణ్వాయుధ పోటీ మొదలవుతోంది. ఒకప్పుడు అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధంతో ప్రపంచమంతా వణికిపోతే.. ఇప్పుడు ఉక్రెయిన్‌లో యుద్ధ పరిణామాలతో అమెరికా, రష్యా మధ్య ఉప్పూనిప్పుగా మారిన పరిస్థితి కలకలం రేపుతోంది. అణుశక్తితో నడుస్తూ, అణ్వస్త్రాలను ప్రయోగించే సామర్థ్యమున్న అత్యాధునిక క్షిపణి, టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల వెల్లడించగా.. తాము అణు పరీక్షలను పునః ప్రారంభిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అక్టోబరు 22న రష్యా అణ్వస్త్ర ప్రయోగానికి సంబంధించి డ్రిల్స్ కూడా నిర్వహించింది.

'స్టార్‌వార్స్' నుంచి నేటి 'పొసైడాన్' వరకు..

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా అగ్ర రాజ్యంగా అవతరించింది. జపాన్‌పై చేసిన అణుదాడితో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం అమెరికానే అనే అభిప్రాయం కలిగించింది. అమెరికాకు దీటుగా నిలిచేందుకు నాటి సోవియట్ యూనియన్ పెద్ద ఎత్తున అణ్వాయుధాలు, క్షిపణులను తయారు చేసింది. ఈ క్రమంలో సోవియట్ యూనియన్ నుంచి రక్షణ కోసమని 1983లో నాటి అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ 'స్ట్రాటజిక్ డిఫెన్స్ ఇనిషియేటివ్ (ఎస్‌డీఐ)'ను ప్రకటించారు. భూమితో పాటు అంతరిక్షంలోనూ రాడార్లు, క్షిపణులు, లేజర్ ఆయుధాలను మోహరిస్తామని ప్రకటించారు. ఈ ఎస్‌డీఐనే 'స్టార్‌వార్స్'గా కూడా పిలుస్తారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడంతో అమెరికా దూకుడు తగ్గించుకుంది. కానీ సోవియట్‌లో భాగమైన రష్యా పోటీగా నిలవడంతో మళ్లీ ఆయుధాల రేసు మొదలైంది. ఈ క్రమంలో 10 వేల కిలోమీటర్లకుపైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగల బాలిస్టిక్ క్షిపణి మినట్ మ్యాన్-3, జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ట్రైడెంట్-2 డీ5 బాలిస్టిక్ క్షిపణుల (7,300 కి.మీ. పరిధి)ను, బీ-2 వంటి అత్యాధునిక, స్టెల్త్, భారీ బాంబర్లను అమెరికా అభివృద్ధి చేసింది. మరోవైపు రష్యా కూడా 18వేల కిలోమీటర్ల పరిధి ఉన్న ఆర్ఎస్-28 సర్మత్ వంటి క్షిపణులను, క్షిపణుల నుంచి విడివడి గంటకు 24 వేల కిలోమీటర్ల వేగంతో లక్ష్యంపై దాడి చేయగల అవన్‌గార్డ్ వంటి గ్లైడ్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. తాజాగా అణుశక్తితో నడిచే, అణ్వాయుధ సామర్థ్యమున్న బురెవెస్ట్‌నిక్ క్రూయిజ్ క్షిపణి, పొసైడాన్ టార్పెడోలను విజయవంతంగా పరీక్షించినట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. బురెవెస్ట్‌నిక్ క్షిపణి అణుశక్తితో దూసుకెళ్తుంది కాబట్టి.. దానికి గరిష్ఠ పరిమితి ఏమీ లేదని, ప్రయోగ సమయంలో 15 గంటల్లో 14 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిందని రష్యా తెలిపింది. ఇక జలాంతర్గామి నుంచి ప్రయోగించే పొసైడాన్ టార్పెడో కూడా సముద్రంలో అడుగున ప్రయాణిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లి విధ్వంసం సృష్టించగలదని చెబుతున్నారు.

'అణు'తెరపై చైనా దూకుడు

ప్రపంచంలో ఆర్థిక పరంగా రెండో అతిపెద్ద దేశంగా ఎదిగిన చైనా కూడా అగ్రరాజ్యం అనిపించుకోవడానికి 'అణు'మార్గం పట్టింది. కొన్నేళ్లుగా అణ్వస్త్రాల తయారీ వేగాన్ని పెంచింది. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 2030 నాటికి ఈ సంఖ్య 1000 దాటుతుందని అంచనా. కానీ చైనా భారీ స్థాయిలో అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తోందని.. వచ్చే ఐదారేళ్లలో అమెరికా, రష్యాలతో సమానంగా చైనా వద్ద అణ్వస్త్రాలు ఉంటాయని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

ఏ దేశం వద్ద ఎన్ని అణ్వాయుధాలు

దేశం	అణ్వస్త్రాలు
రష్యా	5,449
అమెరికా	5,277
చైనా	600
ఫ్రాన్స్	290
యూకే	225
భారత్	180
పాకిస్థాన్	170
ఇజ్రాయెల్	90
ఉత్తరకొరియా	50

అణు పరీక్షలకు సిద్ధమవుతున్న పాక్?

పాకిస్థాన్ తమ సింధ్ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో రహస్యంగా సొరంగాల నిర్మాణం చేపట్టింది. అది అణు పరీక్షల కోసమేనని సింధు ప్రాంతంలోని పౌర సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ)లకు తాజాగా ఫిర్యాదు చేశాయి. పాకిస్థాన్ రహస్యంగా అణు పరీక్షలు నిర్వహిస్తోందని ఇటీవల ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

పోటాపోటీగా అణ్వస్త్రాలను సమకూర్చుకున్న తీరు ఇదీ..

ఏడాది	అమెరికా	సోవియట్
1948	50	0
1950	299	5
1960	18,638	1,627
1967	31,255	8,400
1977	25,542	24,281
1986	23,317	40,159
2000	10,577	12,188

ప్రపంచంపై ఆధిపత్యం కోసం..

ప్రపంచంలో తొలిసారిగా అమెరికా అణ్వాయుధాల తయారీ కోసం 1942లో మాన్‌హట్టన్ ప్రాజెక్టును చేపట్టింది. 1945లో జులైలో ట్రినిటీ పేరిట తొలి అణు పరీక్ష నిర్వహించింది. అదే ఏడాది ఆగస్టులో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై వేసిన అణు బాంబులు ప్రపంచ గతినే మార్చేశాయి. అగ్ర రాజ్యాల మధ్య అణ్వాయుధ పోటీ మొదలైంది. 1949 ఆగస్టులో సోవియట్ యూనియన్ 'ఫస్ట్ లైట్నింగ్' పేరిట తొలి అణుపరీక్ష నిర్వహించింది. ప్రపంచం రెండు ధ్రువాలుగా మారిపోయింది. ఈ క్రమంలో 1962లో ప్రపంచం ఒకసారి అణుయుద్ధం అంచుల వరకు వెళ్లింది. అమెరికాకు సమీపంలో ఉన్న కమ్యూనిస్టు దేశం క్యూబాలో సోవియట్ యూనియన్ క్షిపణులు మోహరించిన విషయం తెలిసి అమెరికా అగ్గిమీద గుగ్గిలమైంది. ఇరుదేశాల యుద్ధ నౌకలు, విమానాల మోహరింపుతో అణు యుద్ధం మొదలైనట్టేనన్న పరిస్థితి నెలకొంది. కానీ ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో అమెరికా, సోవియట్ వెనక్కి తగ్గాయి. 1963లో కొత్త అణుపరీక్షల నిషేధంపై మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. కానీ అణ్వాయుధాల తయారీ కొనసాగింది. కొత్తగా అణ్వాయుధాలు, బాలిస్టిక్ క్షిపణులు తయారు చేయకుండా 1972లో సాల్ట్-1 (వ్యూహాత్మక ఆయుధాల నియంత్రణ ఒప్పందం) చేసుకున్నాయి. తర్వాత 1979లో సాల్ట్-2 ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ అణ్వాయుధాల సంఖ్యను, ఒకే సమయంలో ఎక్కువ సంఖ్యలో లక్ష్యాలను ఛేదించగల క్షిపణుల (ఎంఐఆర్‌వీ) సంఖ్యను తగ్గించుకోవడానికి అంగీకరించాయి. కొన్నేళ్లు అంతా బాగానే ఉన్నా.. అఫ్ఘానిస్థాన్‌ను సోవియట్ ఆక్రమించుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

క్షిపణులు, సబ్‌మెరైన్ల సామర్థ్యం ఎంత?

రష్యా..

అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు రష్యా వద్ద 1,950 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేల మీది నుంచి ప్రయోగించే.. ఆర్ఎస్-28 సర్మత్-18,000 కి.మీ, ఆర్-36ఎం - 16,000 కి.మీ, ఆర్ఎస్-24 యార్స్ - 12,000 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ఆర్-29 ఆర్ఎంయూ2 సినేవా - 11,500 కి.మీ, ఆర్ఎస్ఎం-56 బులవా - 9,000 కి.మీ. సామర్థ్యం ఉన్నవి. ఇవన్నీ ఇప్పటికే వినియోగంలో ఉన్నవి. ఇటీవల పరీక్షలు చేసిన అణుచోదిత క్షిపణి, అణుచోదిత పొసైడాన్ టార్పెడోలు వీటికి అదనం. ఇక రష్యా వద్ద మొత్తం 79 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 16 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం.

యూఎస్ఏ

అమెరికా వద్ద అణ్వస్త్రాలను ప్రయోగించగల ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులు 1,200 వరకు ఉన్నట్టు అంచనా. అందులో నేలమీద నుంచి ప్రయోగించే.. మినట్‌మ్యాన్-3, సెంటినల్ క్షిపణుల పరిధి 13 వేల కి.మీ వరకు ఉంటే.. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే ట్రైడెంట్-2డీ5 పరిధి 12 వేల కి.మీ. ఇక అమెరికా వద్ద మొత్తం 68 జలాంతర్గాములు ఉన్నాయి. అందులో 14 అణుశక్తితో నడిచేవి. నీటి అడుగునే ఉండి ఖండాంతర్గత బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే సామర్థ్యం వాటి సొంతం. యూఎస్ వద్ద ఉన్నవాటిలో ఒహియో, కొలంబియా క్లాస్ సబ్‌మెరైన్లు ముఖ్యమైనవి.

ఓట్ల చోరీని అడ్డుకుంటే...

బిహార్‌లో విజయం మాదే!

దేశాన్ని విభజించడానికి యత్నిస్తున్న బీజేపీ, ఆరెస్సెస్: రాహుల్

కిషన్‌గంజ్, నవంబరు 9: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్కడికెళ్లినా కూడా ఓట్ల చోరీ విషయంలో దొరికిపోతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో నూటికి నూరు శాతం ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన కిషన్‌గంజ్, పూర్ణియా సభల్లో మాట్లాడారు. దేశాన్ని విభజించడానికి బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే ఇండియా కూటమి మాత్రం దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఓటు చోరీపై తాము చేసిన ఆరోపణలకు మోదీ, షా, ఈసీ వద్ద ఎలాంటి సమాధానం లేదని, ఇప్పుడు వాస్తవాలన్నీ ప్రజల ముందుకు వచ్చాయని అన్నారు. ఓటింగ్ రోజున(నవంబరు 11న) పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండి ఓట్ల చోరీని అడ్డుకోవాలని యువత, కార్మికులు, రైతులకు ఆయన పిలుపునిచ్చారు. చేపలు, మఖనా సమృద్ధిగా లభించే రాష్ట్రంలో 20ఏళ్లలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీశ్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు.

ఓటు చోరీని కప్పిపుచ్చే యత్నం.. 'సర్'

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చడానికి, వ్యవస్థను సంస్థాగతీకరించడానికి చేస్తున్న ప్రయత్నమని రాహుల్ గాంధీ ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి ఆయన ఆదివారం నర్మదాపురంలోని పంచ్‌మర్హికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హరియాణాలో 25 లక్షల ఓట్లను చోరీ చేశారని, ఇదే తరహాలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల్లోనూ జరిగి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై తమవద్ద మరిన్ని ఆధారాలతో పాటు వివరణాత్మక సమాచారం ఉందని, దాన్ని కూడా త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ చూపించింది చాలా స్వల్పమేనని చెప్పారు. అనంతరం సాత్పురా టైగర్ రిజర్వ్‌లోని పనార్పణిలో రాహుల్ జంగిల్ సఫారీకి వెళ్లారు. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. బిహార్ ఎన్నికల ప్రచారం చివరి రోజున ప్రజల నుంచి కాకుండా జంతువుల నుంచి ఓట్లు అడగడానికి రాహుల్ అడవికి వచ్చారా అని మధ్యప్రదేశ్ మంత్రి విశ్వాస్ సారంగ్ ప్రశ్నించారు.



శిక్షణ శిబిరానికి ఆలస్యంగా రాహుల్.. పది బస్కీలు శిక్ష

పంచమర్హిలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరానికి ఆలస్యంగా హాజరైన రాహుల్ గాంధీకి పది బస్కీలు శిక్ష లభించింది. ఆయనతో పాటు ఆలస్యంగా వచ్చిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూడా చెమటోడ్చాల్సి వచ్చింది. దీంతో పార్టీ సంస్థాగత సమావేశం కాస్తా వ్యాయామ శిబిరంగా మారింది.

బిహార్‌లో ముగిసిన ఎన్నికల ప్రచారం

వాడీవేడిగా నెల రోజుల పాటు సాగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆదివారం సాయంత్రం తెరపడింది. మంగళవారం చివరిది అయిన రెండో దశ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిబంధనల మేరకు ప్రచారాలను ముగించారు. ఈ దశలో 122 స్థానాలకు పోలింగ్ జరగనుంది. చివరి రోజున జరిగిన ప్రచారంలో కేంద్ర సీనియర్ మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు పాల్గొన్నారు. ఎన్నికల కోసం రాహుల్ మొత్తం 15 ప్రచార సభల్లో ప్రసంగించారు. ప్రధాని మోదీ 14 బహిరంగ సభలు, ఒక రోడ్ షోలో పాల్గొన్నారు. జేడీ(యూ) అధినేత నీతీశ్ అయిదోసారి సీఎం పదవిని చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకొని, ఎలాంటి హడావిడి లేకుండా నిరాడంబరంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఇండియా కూటమి తరపున ఉధృతంగా ప్రచారం చేశారు.

సంఘ్ శాఖకు ఎవరైనా రావచ్చు!

- ఏ పార్టీకీ ఆర్ఎస్ఎస్ మద్దతివ్వదు
- ఆర్ఎస్ఎస్ రిజిస్టర్ అయిన సంస్థ కాదు
- అయినా మాపై మూడు సార్లు నిషేధం
- తద్వారా ప్రభుత్వమే గుర్తించింది: భాగవత్



బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ శాఖలకు రావచ్చని, ముస్లింలు, క్రైస్తవులన్న బేధభావం లేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టంచేశారు. అయితే తాము ఫలానా అన్న ప్రత్యేకతను దూరం పెట్టి, భరతమాత పుత్రులుగా రావాలన్నారు. సమాజంలో అందరినీ కలిసికట్టుగా ఉంచాలన్నదే తమ ఉద్దేశమన్నారు. సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తినో, రాజకీయ పార్టీనో ఆర్ఎస్ఎస్ సమర్థించదని.. విధానాలకే మద్దతిస్తుందని స్పష్టంచేశారు. 'ఏ పార్టీకీ మద్దతివ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనం' అని పేర్కొన్నారు. 'రామాలయ నిర్మాణానికి కాంగ్రెస్ మద్దతిచ్చి ఉంటే సంఘ్ కార్యకర్తలే దానికే ఓటేసి ఉండేవారు' అని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ రిజిస్టర్డ్ సంఘం కాదన్న ప్రియాంక్ ఖర్గే వ్యాఖ్యలను భాగవత్ ప్రస్తావిస్తూ.. 'ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమైంది. బ్రిటిష్ ప్రభుత్వం వద్ద మేం రిజిస్టర్ చేసుకోవాలా? స్వాతంత్ర్యానంతరం రిజిస్ట్రేషన్ తప్పనిసరని చట్టాలు చెప్పలేదు. అయితే, ఐటీ విభాగం, కోర్టులు సంఘ్‌ను వ్యక్తుల సంఘంగా గుర్తించాయి. మాకు ఐటీ నుంచి మినహాయింపు కూడా ఇచ్చాయి. సంఘ్‌పై 3సార్లు నిషేధం విధించారు. తద్వారా ప్రభుత్వం మమ్మల్ని గుర్తించినట్లయింది" అన్నారు. "రిజిస్టర్ కాని అంశాలు చాలానే ఉన్నాయి. హిందూ ధర్మం కూడా రిజిస్టరై లేదు" అని ఆయన పేర్కొన్నారు.

లోకం తీరు



భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- ముగ్గురిని అరెస్టు చేసిన గుజరాత్ ఏటీఎస్
- ఒకరు హైదరాబాద్ డాక్టర్, ఇద్దరు యూపీ వాసులు

హైదరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉగ్ర దాడులకు పన్నిన కుట్రను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అధికారులు భగ్నం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్‌తోపాటు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. గుజరాత్ ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి ఆదివారం విలేకరులకు తెలిపిన సమాచారం ప్రకారం.. ప్రమాదకర రసాయనాలు, ఆధునిక ఆయుధాలతో భారీ ఉగ్రదాడికి కుట్ర చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్(35), ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌ను అరెస్టుచేశారు. మొహియుద్దీన్‌ను గాంధీనగర్‌లో ఈ నెల 7న రెండు గ్లోక్ పిస్టళ్లు, ఒక బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కార్ట్రిడ్జ్‌లు, నాలుగు లీటర్ల కాస్టర్ ఆయిల్, రిసిన్ తయారీకి వాడే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. విచారణలో తాను గాంధీనగర్ జిల్లాలో మారుమూల ఉన్న కలాల్ ప్రాంతంలో ఈ ఆయుధాలను అందుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఉగ్ర కార్యకలాపాలు చేపట్టేందుకే వీటిని సేకరిస్తున్నట్లు తెలిపాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేసే క్రమంలో ఉగ్రవాదులతో ఇతడికి పరిచయం ఏర్పడింది. ఐఎస్‌కేపీ(ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ ప్రావిన్స్)కు చెందిన అబూ ఖదీజా(ఆఫ్ఘనిస్థాన్) ఇతడితో సంప్రదింపులు జరుపుతున్నాడని గుర్తించారు. ఖదీజాకు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయి. చైనాలో వైద్యవిద్య చదివిన మొహియుద్దీన్ దేశంలో భారీ ఉగ్రదాడులు జరిపేందుకు అత్యంత విషపూరితమైన రిసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు గుజరాత్ ఏటీఎస్ డీఐజీ చెప్పారు. అతడి ఫోన్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా అతడికి ఆయుధాలు అందించిన యూపీకి చెందిన అజాద్ సులేమాన్ షేక్, మహమ్మద్ సుహెయల్ మహమ్మద్ సలీమ్‌ను గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేశారు. . కాగా వీరు ఉగ్రదాడులు జరిపేందుకు లఖ్‌నవూ, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని పలు రద్దీ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. కాగా, దేశంలో ఎక్కడ ఉగ్ర కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఎక్కడ ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టయినా హైదరాబాద్‌తో వారికి ఏదో ఒక లింకు ఉంటోంది. హైదరాబాద్ నగరం ఉగ్రవాదులకు ఒక షెల్టర్ జోన్‌గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సయ్యద్ అహ్మద్

- గతేడాది సెప్టెంబరులో ఐఎస్(ఇస్లామిక్ స్టేట్) ఉగ్రవాద సంస్థకు చెందిన యువకుడు రిజ్వాన్ అలీ నగరానికి వచ్చి ఆశ్రయం పొంది తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఇతడు సైదాబాద్‌లోని శంకేశ్వర బజార్‌లో సుమారు ఆరు నెలలపాటు తలదాచుకున్నట్లు ఎన్ఐఏ అధికారుల విచారణలో తేలింది.
- గతేడాది నగరంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ఒక సదస్సు సికింద్రాబాద్‌లోని ఓ హోటల్లో జరిగినా.. పోలీసు నిఘా వ్యవస్థ కనిపెట్టలేక పోయిందనే చర్చ జరుగుతోంది. మహారాష్ట్ర సహా.. వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ఇస్లామిక్ సానుభూతిపరులు హోటల్లో దిగి నెల రోజులపాటు మత విద్వేష సదస్సును ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించారంటే.. నగరాన్ని వారు ఎంత సేఫ్టీ జోన్‌గా వాడుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ సదస్సుకు హాజరైన ఓ యువకుడు ముత్యాలమ్మ ఆలయంలోకి వెళ్లి అమ్మవారి విగ్రహాన్ని కాలితో తన్ని ధ్వంసం చేశాడు.



క్రికెట్ విజేత అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఏదైనా సాధ్యమే

- రెవెన్యూ క్రీడా పోటీలే నిదర్శనం: మంత్రులు పయ్యావుల, అనగాని, సవిత

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఏదైనా సాధ్యమేనని మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత పేర్కొన్నారు. రెవెన్యూ క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించడమే అందుకు నిదర్శనమన్నారు. 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు అనంతపురంలో ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, అనంత కలెక్టర్ ఆనంద్, బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్, టెన్నిస్ ప్లేయర్ మైనేని సాకేత్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. 38పాయింట్లతో అనంతపురం జట్టు ఓవరాల్ చాంపియన్‌గా అవతరించింది. 37 పాయింట్లతో విశాఖ, 30 పాయింట్లతో కాకినాడ జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

దళిత ఉద్యమ పతాక కత్తి పద్మారావు: రాచపాలెం

- కత్తి చేతన్‌కు విమలా స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం అందజేత



విమలా స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న కత్తి చేతన్

అనంతపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు దళిత ఉద్యమ పతాక అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. 2025 సంవత్సరానికిగాను డాక్టర్ కత్తి పద్మారావును విమలా స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసమితి ఆదివారం నిర్వహించిన పురస్కార సభకు అనివార్య కారణాల వల్ల కత్తి పద్మారావు హాజరుకాలేదు. దీంతో ఆయన కుమారుడు కత్తి చేతన్ హాజరై పురస్కారాన్ని అందుకున్నారు. సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డితోపాటు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి హాజరై.. కత్తి చేతన్‌కు పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు.

227 మంది స్పెషలిస్టులకు పోస్టింగ్

- సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో నియామకం: మంత్రి సత్యకుమార్

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య సేవల్ని అందించడంలో కీలక పాత్ర వహించే సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీర్చడంలో భాగంగా 227 మంది పీజీ పూర్తి చేసిన వైద్యులకు పోస్టింగ్‌లు ఇచ్చామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇన్‌సర్వీస్ కోటాలో 12 విభాగాల్లో పీజీ చేసిన 227 మందిని 142 సెకండరీ ఆస్పత్రులకు కేటాయించామన్నారు. త్వరలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 155 మంది స్పెషలిస్టులు, 100 పీహెచ్‌సీల్లో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు విధుల్లో చేరతారన్నారు. 33 ఏరియా ఆస్పత్రుల్లో 60 మంది, ఏడు జిల్లా ఆస్పత్రుల్లో 10 మంది, 2 ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లు ఇచ్చామని తెలిపారు. మొత్తంగా 227 మందిలో 35 మంది చొప్పున గైనకాలజిస్టులు, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు, 30 మంది జనరల్ సర్జరీ వైద్యులు, 26 మంది మత్తు వైద్యులు, 25 మంది పిల్లల వైద్య నిపుణులు, 18 మంది ఎముకల వైద్యులు, 17 మంది రేడియాలజిస్టులు, 15 మంది కంటి వైద్య నిపుణులు, 9 మంది ఈఎన్‌టీ స్పెషలిస్టులు సెకండరీ ఆస్పత్రుల్లో సేవలందిస్తారని చెప్పారు. మొత్తం 243 సెకండరీ ఆస్పత్రులుండగా 142 ఆస్పత్రుల్లో 227 మంది స్పెషలిస్టులు నియమితులయ్యారు. అత్యధికంగా గూడూరు ఏరియా ఆస్పత్రికి నలుగురు స్పెషలిస్టుల్ని కేటాయించారు. వీరిలో పిల్లల వైద్యుడు, రేడియాలజిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, పాథాలజిస్ట్ ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. 2022-23లో ఇన్ సర్వీసు డాక్టర్లుగా వివిధ పీజీ కోర్సుల్లో చేరిన 257 మంది పీహెచ్‌సీ వైద్యులు.. తాజాగా తమ కోర్సులు పూర్తి చేయగా, వారిలో 227 మందిని సెకండరీ ఆస్పత్రుల్లో నియమించామని, తగిన ఖాళీలు లేనందున మిగిలిన 30 మందిని డీఎంఈ ఆస్పత్రుల్లో ట్యూటర్లుగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈ మేరకు పోస్టింగ్‌ల వివరాలను మంత్రి సత్యకుమార్‌కు సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా.పద్మావతి వివరించారు.

రేపు మైనార్టీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవం

- విజయవాడలో కార్యక్రమానికి సీఎం: మంత్రి ఫరూక్

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లు, కార్యాచరణ అమలుకు సంబంధించిన అంశాలపై మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులతో ఆదివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. 26 జిల్లాల కేంద్రాల్లోనూ ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు.

హైస్కూల్ ప్లస్‌లలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి

హైస్కూల్ ప్లస్ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్లుగా అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహకవర్గ సమావేశాన్ని ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ప్రతి పాఠశాలకూ ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ రెండు మీడియంలు కొనసాగించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మరో తుఫాను ముప్పు!

19న అల్పపీడనం.. 25 నాటికి బలపడి తీరంపైకి?

- దక్షిణ కోస్తాపై ప్రభావం చూపే అవకాశం
- రాష్ట్రంలో పెరిగిన చలి
- జి.మాడుగులలో 11.6, వజ్రకరూర్‌లో 11.8 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఈశాన్య రుతుపవనాలు బలపడేందుకు అనువుగా పరిస్థితులు మారనున్నాయి. పసిఫిక్ మహాసముద్రం నుంచి వచ్చే తేమగాలుల ప్రభావంతో హిందూ మహాసముద్రంలో అనుకూల వాతావరణం ఏర్పడనున్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆ ప్రభావంతో ఈ నెల 19 లేదా 20వ తేదీన దక్షిణ అండమాన్ సముద్రం/ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత పశ్చిమంగా పయనించే క్రమంలో ఇది బలపడి తుఫాన్‌గా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. అనంతరం ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా రానుందని అంచనావేశారు. దక్షిణ కోస్తా జిల్లాలపై దీని ప్రభావం ఉంటుందని విశ్లేషించారు. దీని కంటే ముందుగా మరో నాలుగైదు రోజుల్లో శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఒకటి ఏర్పడి దక్షిణ తమిళనాడు దిశగా వస్తున్నట్టు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. రానున్న రెండు, మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసి, ఆ తర్వాత వాతావరణం పొడిగా ఉంటుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అధికారి ఒకరు తెలిపారు. కాగా, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా మారి పొడి వాతావరణం నెలకొంది. దక్షిణ భారతంపైకి చలిగాలులు వీస్తుండటంతో ఆదివారం కోస్తా, రాయలసీమల్లో చలితీవ్రత పెరిగింది.పాడేరు ఏజెన్సీ, తెలంగాణకు ఆనుకుని ఉన్న మధ్యకోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. జి.మాడుగులలో 11.6, వజ్రకరూర్‌లో 11.8, అనంతపురంలో 15.5, ఆరోగ్యవరంలో 16, నందిగామ, జంగమహేశ్వరపురంలలో 17.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాయవ్య, మధ్య, ఉత్తర భారతంలో కొనసాగుతున్న చలి ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల చలి గాలులు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది.

రాష్ట్రంలో నేడు, రేపు కేంద్రబృందం పర్యటన

- మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టం అంచనా
- అనంతరం సచివాలయంలో సీఎంతో భేటీ

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆరు జిల్లాల్లో కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమీ బసు నేతృత్వంలోని కేంద్ర బృందం సోమ, మంగళవారాలు పర్యటించనుంది. ఎనిమిది మంది సభ్యులు రెండు బృందాలుగా ఏర్పడి, క్షేత్రస్థాయిలో తుఫాన్ నష్టాన్ని పరిశీలించనున్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. తుఫాన్ ప్రభావం, నష్టంపై అధికారులు ఏర్పాటు చేసే ఫొటో ప్రదర్శనను తిలకించనున్నారు. సోమవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో రెండు బృందాలకు రాష్ట్ర అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తుఫాన్ పరిణామాలు, ప్రభుత్వ సహాయక చర్యలు, నష్టాలను వివరించనున్నారు. అనంతరం టీమ్1 ప్రకాశం జిల్లా, టీమ్2 కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించనున్నాయి. మంగళవారం ఉదయం టీమ్1 బాపట్ల జిల్లా, టీమ్2 కోనసీమ జిల్లాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయనున్నాయి. మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్ర బృందం సమావేశమై తుఫాన్ నష్టంపై చర్చించనుంది.

మెడికోలపై ఎలుకల దాడి..
ప్రభుత్వం సీరియస్

- ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కాంట్రాక్టర్, వార్డెన్లకు షోకాజు నోటీసులు
- మెడికల్ కాలేజీ హాస్టళ్లను పరిశీలించిన ప్రిన్సిపాల్
- ఎలుకలను పట్టేందుకు బోన్లు, గమ్‌ప్యాడ్లు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి/ఏలూరు క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులపై జరిగిన ఎలుకల దాడి ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన హాస్టల్ వార్డెన్, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ప్రైవేటు ఏజెన్సీ (పెస్ట్ అండ్ రోడెంట్ కంట్రోల్ సర్వీసెస్)కి నోటీసులు జారీచేయాలని డీఎంఈ డా.రఘునందనరావును ఆదేశించారు. ఎలుకల దాడి ఘటనపై విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మెడికల్ కాలేజీ బాలికల హాస్టళ్లు ఉన్నాయి. విద్యార్థులను ఎలుకలు గాయపరిచిన ఘటనకు సంబంధించి 'మెడికోలపై ఎలుక దాడి' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. మంత్రి ఆదేశాల నేపథ్యంలో సదరు నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ప్రైవేటు సంస్థ వివరణ కోరుతూ డీఎం షోకాజ్ నోటీసు ఇచ్చారు. హాస్టల్ వార్డెన్ల వివరణ కోరుతూ మెమో ఇవ్వాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. వసతి గృహాల్లోని పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో.. ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, ఏలూరు ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ కృష్ణ, పలువురు అధికారులు హాస్టళ్లను పరిశీలించారు. కొత్త భవన నిర్మాణాల శబ్దాలతోపాటు చెట్లు, మొక్కలు, తుప్పలు తీసివేయడంతో ఆ ప్రాంతాల్లో ఉండే ఎలుకలు హాస్టల్‌లోకి వస్తున్నట్లుగా గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కాగా, గత రెండు రోజుల వ్యవధిలో ఎలుకలు హాస్టల్‌లోని ఏడుగురు విద్యార్థులను కరిచాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఎలుకలు రావడానికి ఆస్కారం ఉన్న రంధ్రాలను పూడ్పించారు. హాస్టల్‌లో పలుచోట్ల 25 గమ్‌ప్యాడ్‌లు, 15 ఎలుక బోన్లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ రాత్రి 9 గంటలకల్లా హాస్టళ్లలో చెత్త బుట్టలను ఖాళీ చేసి, ఫినాయిల్‌తో శుభ్రం చేయాలని, ఎలుకలు రాకుండా రసాయనాలు స్ప్రే చేయాలని సిబ్బందికి ప్రిన్సిపాల్ సావిత్రి ఆదేశించారు.

పీఎస్ హెచ్‌ఎంల జాబ్ చార్ట్ ప్రకటించాలి

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీస్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ వెంటనే జాబ్‌చార్ట్ ప్రకటించాలని ఏపీ ప్రైమరీ స్కూల్స్ హెచ్‌ఎంల ఫోరం డిమాండ్ చేసింది. ఫోరం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఫోరం అధ్యక్షుడు సీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ స్పష్టతనివ్వాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌గా తిరిగి వెళ్తామనే పీఎస్ హెచ్‌ఎంలకు వచ్చే బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పీఎస్ హెచ్‌ఎంలను గ్రేడ్-3 హెచ్‌ఎంలుగా హోదా మార్చాలని డిమాండ్ చేశారు. ఎల్‌కేజీ, యూకేజీలను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో చేర్చాలన్నారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ అంశంపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, వెంటనే పీఆర్‌సీ కమిటీని నియమించాలని, పీఎస్ హెచ్‌ఎంలకు అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఫోరం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు, రేపు గుంటూరులో వాటర్‌షెడ్ జాతీయ సదస్సు

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమ, మంగళవారాల్లో పీఎంకేఎస్‌వై-వాటర్‌షెడ్ జాతీయ సమావేశాలు నిర్వహించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఏర్పాట్లు చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ సమావేశాలను గుంటూరులోని ఒక హోటల్‌లో నిర్వహిస్తున్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల వాటర్‌షెడ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. మొదటి రోజు సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. వాటర్‌షెడ్-పీఎంకేఎస్‌వై 2.0 అమలు తీరుపై సమీక్ష నిర్వహిస్తారు. రెండో రోజు మంగళవారం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరులోని వెంగలాయపాలెం వద్ద అభివృద్ధి చేసిన ఆధునీకరించిన సంప్రదాయ నీటి వనరును ప్రారంభిస్తారు. పైలట్ ప్రాజెక్టుగా వెంగలాయపాలెం చెరువు గట్టును పటిష్ఠం చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, ఉద్యానవన మొక్కలు, గ్రీన్ ఫెన్సింగ్, సిమెంట్ బెంచ్‌లు, సోలార్ లైట్లు, నక్షత్ర వనం, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, ఓపెన్ ఆడిటోరియం తదితర అభివృద్ధి, ఆహ్లాద కార్యక్రమాలు చేపట్టారు. వెంగలాయపల్లిలో శ్రమదానం-మొక్కలనాటే కార్యక్రమంలో పాల్గొంటారు. సత్తెనపల్లి రోడ్డులో ఉన్న లయోలా పబ్లిక్ స్కూల్‌లో బహిరంగ సమావేశంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ సింగ్ చౌహాన్ వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతపురం జిల్లా ఇప్పేరు వద్ద ఊటచెరువు, చెక్‌డ్యాంను కేంద్ర మంత్రి వర్చువల్‌గా భూమిపూజ నిర్వహించి, శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగానే వాటర్‌షెడ్ జనభగీదరి కప్-2025 విజేతలకు ఒక్కొక్కరికీ రూ.20 లక్షల బహుమతిని అందజేస్తారు.

నేడు మంత్రివర్గ సమావేశం

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఇప్పటికే అజెండా సిద్ధమైంది. ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సమావేశం ప్రారంభం కానుంది. గతంలో ఎస్ఐపీబీలో లక్ష కోట్ల పెట్టుబడులపై తీసుకున్న నిర్ణయాలు, తాజా పెట్టుబడులపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలన్న అంశాలపైనా చర్చించనున్నట్లు తెలుస్తోంది.

జనసేన 'ఎక్స్' ఖాతా హ్యాక్

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి చెందిన 'ఎక్స్' ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత ఖాతా హ్యాక్ అయినట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది గుర్తించారు. 'ఎక్స్' వేదికగానే పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టులు, ఇతర సమాచారాన్ని కేడర్‌కు అందిస్తున్నారు. ఎక్స్ ఖాతా హ్యాక్ అవడంతో కేడర్‌కు ఇవ్వాల్సిన సమాచారం నిలిచిపోయింది. బిట్ కాయిన్స్ వ్యవహారంపై హ్యాక్ చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్రిటన్‌కు చెందిన వ్యక్తులు హ్యాక్ చేసినట్లు తెలుస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ట్రేడింగ్, బిట్ కాయిన్‌ల వ్యవహారంలో పార్టీ నాయకులను జనసేన కార్యాలయ సిబ్బంది అప్రమత్తం చేశారు.


శ్రీశైలంలో 14న కోటి దీపోత్సవం

- భక్తులు ఉచితంగా పాల్గొనేందుకు అవకాశం: ఈవో

శ్రీశైలం నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో తొలిసారిగా ఈనెల 14న కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ జరిపే ఈ కోటి దీపోత్సవంలో భక్తులు ఉచితంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు సాయంత్రం ఆలయ ప్రధాన మాడవీధిలో గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. పాల్గొనేందుకు రెండు రోజుల్లో పేర్లు, వివరాలు పరిపాలన భవనంలోని శ్రీశైలప్రభ కార్యాలయం లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, కార్తీక మాసంలో పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆదివారం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

పారిశ్రామిక ఉత్పత్తుల్లో.. ఎంఎస్ఎంఈల వాటానే ఎక్కువ

- ఈ రంగంలో ఏపీని అగ్రగామిని చేయడమే లక్ష్యం: మంత్రి కొండపల్లి
- గత ఏడాది 26 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల ఎగుమతి
- మరింత పెంచేందుకు ఔత్సాహికులకు సహకారం
- మేమొచ్చాక ప్రోత్సాహకాల కింద రూ.439 కోట్లు
- విశాఖ ఎగుమతుల సదస్సులో మంత్రి వెల్లడి
- 16 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు




విశాఖ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాఖపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విశాఖలో ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సదస్సులో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక ఉత్పత్తుల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వాటాయే అధికమన్నారు. ఈ రంగం ఎంత అభివృద్ధి చెందితే ఎగుమతులు అంత ఎక్కువ పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రైవేటు పార్కుల ఏర్పాటుకు కొందరు ముందుకొస్తున్నారని, వారిని ప్రోత్సహిస్తామన్నారు. గత ఏడాది రాష్ట్రం నుంచి 26 బిలియన్ డాలర్ల ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేశామని, దీనిని మరింతగా పెంచేందుకు ఔత్సాహికులకు సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రంగానికి అనువుగా క్లస్టర్లు ఏర్పాటుచేయాలన్న సీఎం చంద్రబాబు ఆలోచనను అమలు చేస్తున్నామని చెప్పారు. 'ప్రతి క్లస్టర్‌లో భారీ పరిశ్రమలకు అనుబంధంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా 15 అంశాలతో విధానానికి రూపకల్పన చేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటివరకు ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకం కింద రూ.439 కోట్లు విడుదల చేశాం. ఈ రంగంలో ఉత్పత్తి చేసే వస్తువుల ఎగుమతులకు ప్రోత్సాహం, వస్తువుల ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల మధ్య అవగాహన కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. 16 దేశాల నుంచి 44 మంది ప్రతినిధులు వచ్చారు. జాతీయ, అంతర్జాతీయంగా పోటీని తట్టుకునేలా ఉత్పత్తుల తయారీ నుంచి విక్రయాలు, ఎగుమతులు, కొత్త సాంకేతికత వినియోగం వరకు కామన్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నాం. ఇందుకు రూ.200 కోట్లు కేటాయించాం' అని ప్రకటించారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడిదారుల సదస్సులో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదురుతాయని భావిస్తున్నామని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. సదస్సులో ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇండియా ఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్‌కుమార్, కస్టమ్స్ అదనపు కమిషనర్ ఆర్పీ ప్రథమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తరాల చీకటి!





దేన్నైనా ఎంతకాలం భరిస్తవ్
ఎగరాలనుకునే ప్రతీసారి
నీ రెక్కలు కట్టేస్తున్న
తరాల చీకటి ఇది!

కళ్లముందే... పార్టులు పార్టులుగా
జీవితం ముగిసిపోతుంటుంది
చెరగని చిరునవ్వులతో...
రాలుతున్న పూలను చూసి
ఒంటరిగా దుఃఖిస్తుంటావు

మెరుపుల కలల్ని
నీలో సమాధి చేసుకుంటూ
ఒక సాహసయాత్రలో
నడుస్తుంటావు

రేపైనా గెలవకపోతానా అని
ప్రతీరోజూ ఓడిపోతుంటావు

మర్రిచెట్టులా నీడను పంచాలనుకుంటావు
మల్లెతీగవై పందిరిగుంజలమీదే
కాలాన్ని గడుపుతుంటావు
నెరవేరని ఆశల్ని
చలిమంటమీద కాల్చుకుంటూ...
తలుచుకొని తలుచుకొని
పొగిలి పొగిలి ఏడుస్తుంటావు
అడ్డంపడ్డ ఎద్దు కొమ్ము మీద కూర్చోని
కన్ను పొడుచుకు తింటున్నట్టు కాకి కాలం
నీ మానని గాయమై వెంటనడిచే నేస్తం
దుఃఖసంద్రాల మీద
ఒంటరి ప్రయాణీకుడివై
ఒడ్డును కలగంటుంటావు

చెరువుగట్టున చేపవై
చావుబతుకుల నడుమ
ఎదురీదుతుంటావు

గెలుపో... ఓటమో...
నీ కొట్లాటను చూసి
లోకం ఒక రిపోర్ట్ తయారుచేస్తుంది...
ఏదీ పట్టించుకోకు...
ఎక్కడా ఆగిపోకు...
నీకోసం ఉదయించే సూర్యోదయాలు
నీకోసం రెక్కలు చాచే సముద్రాలు
నీవైన కాలాలు తప్పక పుట్టకపోవు
రేపటిని నీకు
బహుమానంగా ప్రకటించకపోవు!

■ పసునూరి రవీందర్
✆ 77026 48825

కవిత్వ బలానికి కళా సాధనాలు

కవిత్వమంటే మనసులో ఉప్పొంగే భావాలను ఉద్వేగంగా చెప్పడమే కాదు, దానికి మించిన అర్థం, శబ్దం, భావోద్వేగాల కలయిక. కవిలో కలిగే అంతర్ బహిర్ సంఘర్షణలకు ప్రతిరూపమైన కవిత్వానికి ప్రాణం పోసే కళా సాధనాలు అనేకం ఉన్నాయి. ఈ సాధనాలు లేకుండా కవిత్వం ఒక ఆత్మ లేని దేహం.

గొప్ప కవులు తమ కవిత్వంలో ఒక వాతావరణాన్ని సృష్టించడానికి, శబ్దం ద్వారా మాధుర్యాన్ని ఇవ్వడానికి, ఉత్కృష్ట దృశ్యాలను ఆవిష్కరించడానికి, భావోద్వేగాలను లోతుగానూ స్పష్టంగానూ వ్యక్తీకరించడానికి, చెప్పదలచుకున్న అర్థాన్ని పొరలు పొరలుగా ప్రవేశపెట్టడానికి ఈ సాహిత్య కళా సాధనాలను ఉపయోగిస్తారు. ఫలానా సాధనాన్ని వాడుతున్నామని ప్రత్యేకంగా కవులు అనుకోరు కాని వారి కవిత్వాన్ని పరిశీలిస్తే ఇవి కనిపిస్తాయి.


వీటిలో ముఖ్యమైనవాటిని పరిశీలిద్దాం. కవిత్వంలో 'ప్రతిబింబాలు' (Imagery) చదువరి మనసుకి ఆనందాన్ని కలిగించే చిత్రణని ఇస్తాయి. ఉదాహరణగా చెప్పుకుంటే "ఆకాశం తేనెలా ఒలుకుతోంది.". 'ఉపమానం' (Simile) అంటే "వంటి" లేదా "లాగా" ఇలాంటి పదాలతో పోలికను సృశించడం. 'రూపకం' (Metaphor) అంటే నేరుగా పోలిక చేయడం. 'జీవీకరణ' (Personification) కవిత్వంలో నిర్జీవ వస్తువులకు మానవ లక్షణాలని ఆపాదించటం. 'అనుప్రాస' (Alliteration) కవితలోని పదాల ఆరంభాలలో ఒకే ధ్వనుల్ని పునరావృత్తి చేయడం.

ఇక 'యమకం' (Rhyme) అంటే సమాంతరంగా పద అంత్యాలలో ధ్వనుల పునరావృత్తి. 'ఛందస్సు' (Rhythm/ Meter) ఇది కవిత్వంలో తాళం, ఉచ్చారణ ధోరణికి ఉదాహరణ. 'ఏంజాంబ్మెంట్' (Enjambment) అంటే కవితలో పంక్తి ముగిసిన తర్వాత, ఆ పంక్తిలోని భావం ఆగకుండా తదుపరి పంక్తికి కొనసాగడం. ఇక 'ముగింపు పంక్తి' (Endstopped line) అంటే పంక్తి చివర విరామ చిహ్నాన్ని ప్రకటించడం, మరొక సాధనం 'పునరావృత్తి' (Repetition) కవితలో పదాలను, పద బంధాలను మళ్లీ మళ్లీ వాడడం. కవిత్వంలో 'సంకేతం' (Symbol) అత్యంత ప్రధానంగా కనిపించే సాధనం, అది ఒక మామూలు వస్తువు ద్వారా లోతైన భావాన్ని చెప్పడం. 'Irony' అంటే వాక్యంలో ఒకటి అంటూనే, దానికి విరుద్ధమైన అర్థాన్ని స్ఫురింపచేయటం. ఇది మాటల్లో ద్వంద్వార్థం ద్వారా హాస్యం, వ్యంగ్యం, లేదా ఆకస్మిక మలుపును చూపించడానికి వాడతారు.

Onomatopoeia అనేది ధ్వన్యనుకరణ శబ్దాల అలంకారం. అంటే, ఏదైనా వస్తువు లేదా చర్య పలికించే సహజమైన శబ్దాన్ని దాన్ని సూచించే పదం కూడా అనుకరించడం అన్నమాట. ఈ శబ్దం చదువరికి మానసికంగా కూడా అనుభూతిని కలిగిస్తాయి. 'అతిశయోక్తి' అంటే, ఏదైనా విషయాన్ని ఉద్దేశపూర్వకంగా అతిశయంగా, చాలా ఎక్కువగా చెప్పడం అన్నమాట. ఇక 'విరోధాభాసం' (Paradox) అనేది బయటకు తేలికగా అర్థం చేసుకున్నప్పుడు తప్పుగా అనిపించవచ్చు కానీ లోతుగా ఆలోచిస్తే అది నిజం అయ్యే వాక్యం లేదా భావన. ఇక Oxymoron అనేది వ్యతిరేక భావాలు కలిగిన రెండు పదాలను ఒకే చోట కలిపే శైలీ అలంకారం.

> **కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు కవితను కేవలం మామూలు పదాల సమాహారంగా కాకుండా, లోతైన అనుభూతి ప్రయాణంగా మార్చుతాయి.**

'అనిశ్చితి', 'అస్పష్టత' (Ambiguity) అనేది ఒక పదం, లేదా వాక్యం, లేదా భావానికి ఒకటి కంటే ఎక్కువ అర్థాలు కలిగి ఉండే స్థితి. 'ప్రత్యక్ష సంబోధన' (Direct Address) శైలిలో రాసిన కవితలో కవి నేరుగా ఒక వ్యక్తి, వస్తువు, లేదా భావనను సంబోధిస్తూ మాట్లాడుతున్నట్టు ఉంటుంది. Refrain అనేది 'పునరావృత పదబంధం'. ఇందులో ఒకే పదబంధం లేదా వాక్యం ఆ కవితలో, పాటలో, లేదా ప్రసంగంలో పునరావృతంగా వస్తుంది. 'ఇంద్రియ మిశ్రమం' (Synaesthesia) అనేది ఒక ప్రత్యేకమైన అలంకార శైలి. ఇందులో ఒక ఇంద్రియ అనుభూతిని మరొక ఇంద్రియ ద్వారా వ్యక్తీకరిస్తారు (ఉదా: "నీ మాటలు తేనెలా మధురంగా ఉన్నాయి" – అంటే శబ్దాన్ని రుచిగా అనుభవించడం, రంగును మోగుతుందనిపించడం, గంధాన్ని చూడగలిగినట్లు చెప్పడం.)



ఇలా కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు కవితను కేవలం మామూలు పదాల సమాహారంగా కాకుండా, లోతైన అనుభూతి ప్రయాణంగా మార్చుతాయి. ఎవరు రాసినా కవితలు శబ్దాన్ని వినిపించాలి, చిత్రాన్ని చూపించాలి, హృదయాన్ని స్పృశించాలి. ఈ మూడింటినీ కలిపే మంత్రం కవిత్వంలోని ఈ కళా సాధనాలల్లో దాగి ఉంది. మనం రాసిన కవిత్వం బలపడాలంటే కవిత్వంలోని సాహిత్య కళా సాధనాలు మనకు మార్గదర్శకాలు.

■ వారాల ఆనంద్
✆ 94405 01281

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

'పావుకోళ్ళు' కవిత్వ సంపుటి

ఉమ్మడిశెట్టి రాధేయ కవితా సంపుటి 'పావుకోళ్ళు' ఆవిష్కరణ నవంబర్ 16ఉ.10.గం.లకు కళా మందిరం, పలమనేరు, చిత్తూరు జిల్లాలో జరుగుతుంది. అధ్యక్షత దోర్నాదుల సిద్ధార్థ, ఆవిష్కర్త పలమనేరు బాలాజీ. ముఖ్య అతిథులు పల్లిపట్టు నాగరాజు, సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్, అంకే శ్రీనివాస్, జెల్ది విద్యాధర్ తదితరులు.

పలమనేరు బాలాజి

కాళోజీ పురస్కారాలు

కాళోజీ సోదరుల యాది సభ, కాళోజీ పురస్కారాల ప్రదానం నవంబర్ 13 సా.6గం.లకు వాగ్దేవి డిగ్రీ అండ్ పిజీ కళాశాల, కిషన్ పుర, హన్మకొండలో జరుగుతాయి. అధ్యక్షత ఎస్. జీవన్ కుమార్, ముఖ్య అతిథి అంపశయ్య నవీన్. పురస్కారాలను మంగారి రాజేందర్, అంజనీ కుమార్ గోయల్ అందుకుంటారు.

కాళోజీ ఫౌండేషన్

బ్రౌన్ సాహిత్య పురస్కారం

సి.పి. బ్రౌన్ మందిరం ఇచ్చే బ్రౌన్ స్మారక సాహిత్య పురస్కారాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్‌చాన్సలర్ ఆచార్య డి. మునిరత్నం నాయుడు స్వీకరిస్తారు. బ్రౌన్ జయంతి నవంబర్ 10 న రాజమండ్రి సి.పి.బ్రౌను మందిరంలో జరిగే పురస్కార ప్రదానంలో సన్నిధానం నరసింహశర్మ బహుమతిని అందజేస్తారు.

సి.పి. బ్రౌన్ మందిరం

'తెలంగాణ దేశీ సాహిత్య గంప'

తెలంగాణ సాహిత్య అకాడమి 'సాహిత్యవారం' కార్యక్రమంలో భాగంగా కాలువ మల్లయ్య రెండు పుస్తకాలు 'తెలంగాణ దేశీ భాష సాహిత్య గంప', 'బుక్ ఆఫ్ కల్చర్ (ఇంగ్లీష్) ఆవిష్కరణ సభ నవంబర్ 15 సా.5గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త పులికొండ సుబ్బాచారి, పరిచయం టి. గౌరీశంకర్, బాణాల భుజంగరెడ్డి.

నామోజు బాలాచారి

తెలంగాణలో మహిళల కథలు

సాహిత్య అకాడమీ, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'తెలంగాణలో మహిళల కథలు: వికాసం, విస్తృతి, వైవిధ్యం' అంశంపై సదస్సు నవంబర్ 15 ఉ.10గం.ల నుంచి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ బిల్డింగ్, తెలంగాణ విశ్వవిద్యాలయం, డిచ్‌పల్లి లో జరుగుతుంది. ఎల్. సురేశ్ కుమార్, కరిమిండ్ల లావణ్య, ఎస్వీ సత్యనారాయణ, టి. యాదగిరి రావు, సూర్యాధనంజయ్, పి. కనకయ్య, వంగరి త్రివేణి తదితరులు పాల్గొంటారు.

సాహిత్య అకాడమీ

అనువాదంతోపాటు అదనపు శ్రమా ఉంటుంది!


ముస్లిం బాల్య జీవిత అనుభవాలతో నెల్లూరు మాండలికంలో మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన పుస్తకాలు 'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు'ను అనువాదకురాలు **డి.వి. శుభశ్రీ** ఇంగ్లీష్ లోకి అనువదించారు. ఈ అనువాదాలను 'స్పీకింగ్ టైగర్' ప్రచురణ సంస్థ 'దట్స్ ఏ ఫైర్ ఆంట్ రైట్ దేర్' పేరుతో ఇటీవల విడుదల చేసింది. ఈ సందర్భంగా అనువాదకురాలితో 'వివిధ' సంభాషణ.

'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు' పుస్తకాలనే అనువాదానికి ఎందుకు ఎంచుకున్నారు?

నిజం చెప్పాలంటే పదేళ్ళ కిందట ఈ పుస్తకాలని చదివినప్పుడు అందరి లాగే ఇవి అనువాదానికి లొంగవని ఊరుకున్నాను. ఆపై ఖదీర్ బాబు గారు రాసినవే 'మెట్రో కథలు'లో కొన్నింటిని అనువదించాను. అయితే కాలక్రమేణా అనువాద ప్రక్రియపై నా అవగాహన పెరిగింది. అనేక భాషల అనువాదాలు చదవటంతోపాటు, ట్రాన్స్‌లేషన్‌లో పీజీ డిప్లొమా చేసాను. ఆ తర్వాత నాకు అనిపించింది ఏమిటంటే– అనువాదంలో భాషాపరంగానూ, ఇతరత్రానూ ఎన్నో అంశాలు కోల్పోయినప్పటికీ, ఒక పుస్తకం అనువాదం కావటం వల్ల ఎంతో మేలు కూడా జరుగుతుంది. ఇంగ్లీష్, రష్యన్, బెంగాలీ భాషల నుంచి తెలుగులోకి అనువదించడం కుదరని పని అనుకుని ఉంటే తెలుగువారు ఎంతో కోల్పోయేవారు. 'దర్గామిట్ట కతలు', 'పోలేరమ్మ బండ కతలు' వంటి పుస్తకాలు ఇంగ్లీష్‌లోకి వెళ్ళడం ద్వారా తెలుగేతరులకు మన సాహిత్యం, సంస్కృతి, భాష రుచి తెలిసే అవకాశం ఉంది. ఈ కథల్లో రచయిత మనల్ని నవ్విస్తూనే ప్రస్తావించిన అనేక విషయాలు సమాజాన్ని ఆలోచింపచేసే విధంగా ఉంటాయి.

బాల్య అనుభవాలతో ప్రాంతీయ మాండలికంలో రాసిన ఈ కథలను ఇంగ్లీష్‌లోకి అనువదించటం ఎలాంటి అనుభవం?

ఈ కథలు అనువదించడం సాహసమే. వీటిలో అనువాదానికి లొంగని మూడు అంశాలున్నాయి: నెల్లూరు మాండలికం, ముస్లిం తెలుగు సంస్కృతి కలగలిసి ఉండటం, అంతర్లీనంగా సాగే హాస్యం. ఈ మూడింటిని ఇంగ్లీష్ లోకి మార్చటం పెను సవాలు. దీన్ని అధిగమించడానికి మూస పద్ధతిలో మాటకి మాట, పదానికి పదం అన్నట్టు కాకుండా, కొత్త ఆలోచనలు చేయాల్సి వచ్చింది. ముఖ్యంగా, ఇంగ్లీష్‌లో కూడా మన దేశీయ పరిమళం ఉట్టిపడే విధంగా అనువదించాలని నిర్ణయించుకున్నాను. వీలైనంతవరకు అవసరమైనచోట తెలుగు, ఉర్దూ పదాలను కొద్దిపాటి వివరణతో అలాగే ఉంచేసాను. Formal, written English లోకి కాకుండా, Spoken Indian English లోకి తర్జుమా చేసాను.



మీ అనువాదంతో ప్రచురణ సంస్థలని ఎలా అప్రోచ్ అయ్యారు? ఈ క్రమంలో ఎదురైన అనుభవాలు ఏమిటి?

అనువాదాలకి గుర్తింపు, మార్కెట్ పెరుగుతున్నప్పటికీ, అనువాదాలను ప్రచురణ దాకా తీసుకు వెళ్ళటం ప్రయాసతో కూడుకున్న పనే. నేను ఐదారేళ్ళకు పైగా అనేక ప్రచురణ సంస్థల తలుపు తట్టాను కానీ పెద్దగా లాభం లేకపోయింది. అడపాదడపా ఆన్‌లైన్ మ్యాగజైన్లలో కథలు ప్రచురించాను.



సంస్థాగతంగా ఏ ప్రోత్సాహం అవసరం?

కేంద్రీయ, రాష్ట్ర సాహిత్య అకాడెమీలు చాలా నాణ్యమైన పని చేస్తున్నాయి కానీ, మనకున్న భాషా సంపదకి అది సరిపోదు. దేశ భాషల్లోకైనా, విదేశీ భాషల్లోకైనా మన సాహిత్యం వెళ్ళాలీ అంటే ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పౌరులు అందరూ పూనుకోవాలి. అనువాదకులను తయారు చేయడానికి కావలసిన అనువాదకులు కేవలం అనువాదం మాత్రమే చేస్తారు అనేది అపోహ. ఒక పుస్తకం మరో భాషలో రావాలంటే అనువాదకులు చేపట్టే స్వచ్ఛంద అదనపు శ్రమ చాలా ఉంటుంది. కాపీ రైట్ సంపాదించడం దగ్గర నుంచి, ప్రపోజల్ రాయటం, రీసెర్చ్ చేయటం, ప్రచురణకర్తని ఒప్పించటం వంటి పనులు లెక్క లోకి రావు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పనులన్నింటికీ నిర్దిష్టమైన సంస్థాగత ఆలంబన లేకపోవడం, అనువాద ప్రక్రియకి గానీ అనువాదకులకి గానీ ప్రోత్సాహం లేకపోవడం పెద్ద లోటు. శిక్షణ, అనువాదాన్ని వృత్తిగా చేపట్టడానికి అవసరమైన ఆర్థిక సాయం, ఫెలోషిప్స్, గ్రాంట్స్, రెసిడెన్సీస్ వంటివి కల్పించి, అనువాదాన్ని ప్రోత్సహించే ఎకోసిస్టమ్‌ను తయారుచేయడం అవసరం.


అనువాదాల్ని పెద్ద ప్రచురణ సంస్థల వద్దకు తీసుకు వెళ్లినప్పుడు కొత్త అనువాదకులు ఎలాంటి సవాళ్లకు సిద్ధం కావాలి?

అనువాదకులు తాము అనువాదానికి ఎంచుకున్న పద్ధతిని, తమ నిర్ణయాలని జస్టిఫై చేసుకోగలగాలి. మూల భాషనీ, వస్తువునీ రూపు మాపకుండా, అదే సమయంలో exoticize చేయకుండా చదువరులకు చేర్చడం ముఖ్యం.

ఈ పుస్తకం విషయంలో 'స్పీకింగ్ టైగర్' ప్రచురణ సంస్థ ఎడిటర్ల నుంచి మీకు ఎలాంటి సూచనలు అందాయి?

ఎడిటర్లు మొదటి డ్రాఫ్ట్ చదివాక వాళ్ళకి కూడా ఈ కథల్లో హాస్యం వినిపించింది అన్నప్పుడు ఊపిరి పీల్చుకున్నాను. అయితే, తెలుగు, ఉర్దూ మాటలను ఎంతవరకు వివరించాలి అనే ప్రశ్నపై కొంత చర్చ జరిగింది. చదువరులకు మన మాటలు మొదట్లో కొత్తగా అనిపించినా అర్థమయ్యే కొద్దీ అలవాటుపడతారు అనే నమ్మకం మాకు కలిగింది. జెర్రీ పింటో, మినీ కృష్ణన్ వంటి సాహిత్య దిగ్గజాలకు ఈ కొత్తరకం కథలు, అనువాద శైలి నచ్చాయి అంటే, దాన్నే విజయంగా పరిగణిస్తున్నాను.

మంట



నీటిలో దాక్కుంటావు సరే
నిప్పులో ఎట్లా దాక్కుంటావు?
మేఘవిస్ఫోటనం నుండి
తప్పించుకుంటావు సరే
ఆకాశం గురి చూసి కొడుతున్న
పిడుగులను ఎట్లా తప్పించుకుంటావు?
పర్వతాల నుండి వరదై ప్రవహిస్తున్న
ఘోర హిమపాతం సరే
అగ్నిపర్వతాల్ని బద్దలుకొట్టుకుని వచ్చే
లావా ప్రవాహం సంగతేమిటి?

కార్చిచ్చుకు బలవుతున్న ప్రతి చెట్టు
ఒక ఆగ్నేయాస్త్రమే
యుద్ధం కూడా ఫైర్‌తో మొదలై
ఫైర్‌తో అంతమవుతుంది
కాని అన్ని అగ్నుల కన్నా క్రూరమైంది
అన్ని చిచ్చుల కన్నా భయంకరమైంది
అన్ని మంటల కన్నా ప్రాణాంతకమైంది
ఒకటుంది
క్షణక్షణం మృత్యువుకు చేరువ చేసే
కాలకూటం
కడుపులో విస్తరించే ఎడారి
మనిషిని జంతువు చేసే ఘోర కరువు
అదే
ఆకలిమంట!

■ అమ్మంగి వేణుగోపాల్
✆ 94410 54637

బహుళ స్వరాల నేటి విమర్శ


కొంతమంది కవులు/ రచయితలు తాము చెప్పింది పరమ ప్రామాణికం అనే ఆలోచనతో, ఎటువంటి పరిశోధనాత్మక పద్ధతి లేకుండా, కేవలం వ్యక్తిగత అభిప్రాయాలను, సాధారణ ప్రకటనలను సిద్ధాంతాలుగా ప్రకటిస్తున్నారు. ఇది విమర్శకు నష్టం చేస్తుంది. సుంకర గోపాలయ్య రాసిన 'ప్రమాణాల్లేని నేటి విమర్శ' వ్యాసం (వివిధ: 03-11-2025) ఈ కోవలోని వ్యాసమే! ఈ వ్యాసంలో, గత పదిహేనేళ్లుగా తెలుగు విమర్శ స్తబ్ధతలో ఉందని, కొత్త సిద్ధాంతాలు లేవని, లోతైన విశ్లేషణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు గోపాలయ్య. కట్టమంచి నుండి త్రిపురనేని వరకు సాగిన 'పద్ధతైన' విమర్శ ఆగిపోయిందని, నేటి విమర్శకులు కేవలం 'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. వ్యాసంలో వ్యక్తమైన కొన్ని ఆందోళనలలో వాస్తవం ఉన్నప్పటికీ, సమకాలీన విమర్శనా రంగాన్ని పూర్తిగా 'ప్రమాణాలు లేనిదిగా' కొట్టిపారేయడం పొరపాటు. వాస్తవానికి, నేటి తెలుగు విమర్శ 'ప్రమాణాలు లేకపోవడం'తో బాధపడటం లేదు; అది 'ఏక ప్రమాణం' స్థానంలో 'బహుళ ప్రమాణాల' వైపు పరిణామం చెందింది. ఇది బలహీనత కాదు, ఆధునిక సమాజపు సంక్లిష్టతకు, సాహిత్యపు వైవిధ్యానికి అద్దం పట్టే పరిపక్వతకు సంకేతం.

మూల వ్యాసంలో 'కొత్త సిద్ధాంతాలు లేవు' అన్న ప్రధాన ఆరోపణ అత్యంత విస్మయపరిచే వాదన. 'కొత్త సిద్ధాంతం' అంటే ఆకాశం నుండి ఊడిపడదు; ప్రపంచవ్యాప్తంగా వస్తున్న నూతన తాత్విక చింతనలను, సామాజిక శాస్త్ర సిద్ధాంతాలను మన సాహిత్యానికి అన్వయించి, మనదైన విమర్శనా పద్ధతులను నిర్మించుకోవడమే. ఆ దిశగా గత పదిహేనేళ్లలో జరిగిన, జరుగుతున్న కృషిని విస్మరించలేం.

ఈ కాలంలో అస్తిత్వవాద విమర్శలు విస్తరించాయి. ఈ కోవలో దళిత, స్త్రీవాద, బీసీ, ప్రాంతీయవాద విమర్శలు కేవలం 'వస్తు' విమర్శగా ఆగిపోలేదు. అవి తమదైన సౌందర్య శాస్త్రాలను నిర్మించుకుంటున్నాయి. ముస్లిం సాహిత్యంపై సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకం 'సవారు', కొలిమి పత్రికలో కాత్యాయనీ విద్మహే 'నీలి రాగం' వ్యాసాలు, దత్తయ్య అట్టెం పుస్తకం 'తెలంగాణ బి.సి. వాద సాహిత్యం', సూర్యా ధనంజయ్ పుస్తకం 'కాకోటి' వంటివి ఈ కోవలోనివే. అద్లూరు రఘురామరాజు "వాచకం, పఠనం, విమర్శ" అన్న కోణంలో వడ్డెర చండీదాస్ నవలలను చర్చించిన గ్రంథం 'వడ్డెర చండీదాస్: దర్శనమూ సాహిత్యమూ'. జి. అరుణ కుమారి ఫ్యూచరాలజీ కోణంలో రాసిన గ్రంథం 'తెలుగు కవిత్వం భవిష్యద్దర్శనం'. ఓల్గా మల్టీ డిసిప్లినరీ పెర్స్పెక్టివ్‌లో రాసిన గ్రంథం 'సంతులిత'. యస్. రఘు డిస్క్రిప్టివ్ క్రిటిసిజం కోణంలో రాసిన గ్రంథం 'సమన్వయ'... జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్ నవ్య దళిత వాద విమర్శ వంటి కొత్త పద్ధతులను పరిచయం చేశారు. ఇవన్నీ 'కొత్త సిద్ధాంతాల' అన్వయాలు, నిర్మాణాలే. కాబట్టి, 'ఏమీ జరగడం లేదు' అనడం కళ్ల ముందున్న వాస్తవాన్ని కాదనడమే.

విమర్శకుడు 'న్యాయమూర్తి' పాత్ర పోషించాలని మూల వ్యాసం ఆశిస్తున్నది. కానీ ఆధునిక విమర్శలో 'న్యాయమూర్తి' పాత్ర స్థానంలో 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం. గతంలో కట్టమంచి వంటి వారు 'కవిత్వం ఇలా ఉండాలి' అని తీర్పులు ఇచ్చారు. అది ఆ కాలపు చారిత్రక అవసరం. నేటి విమర్శ ఒక రచన 'ఎందుకు అలా ఉంది', 'దాని సామాజిక – చారిత్రక సందర్భం ఏమిటి,' 'దాని వెనుక భావజాలం ఏమిటి' అని విశ్లేషిస్తోంది. 'తీర్పు' ఇవ్వడం కంటే, 'పాఠకుడికి ఆ రచనను బహుళ కోణాల్లో అర్థం చేసుకునే పరికరాలను అందించడం' నేటి విమర్శ లక్ష్యం. నేటి విమర్శలో 'కేవలం విశ్లేషణ మాత్రమే చూస్తున్నాం' అని గోపాలయ్య నిరాశపడుతున్నారు. కానీ ఆ 'విశ్లేషణ'లోనే 'మూల్యాంకనం' అంతర్భాగం.

'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటలతో రాస్తే విమర్శ కాదని గోపాలయ్య తీసిపారేయడం సరికాదు. ఏ కాలపు విమర్శ అయినా వీటి చుట్టూనే తిరుగుతుంది. సమస్య ఆ మాటల్లో లేదు, వాటిని విశ్లేషించే పద్ధతిలో ఉంది.



ఉదాహరణకి గోపాలయ్య ప్రస్తావించిన వాటిలో మొదటిదైన 'వస్తువు'నే తీసుకుంటే– గతంలో వలె నేటి విమర్శ రచనలో 'వస్తువు ఏమిటి' అనేదానికే పరిమితం కాలేదు. 'ఆ వస్తువును ఎవరి దృక్కోణం నుంచి చూస్తున్నారు' అనేది నేటి విమర్శ ప్రధాన ప్రశ్న. ఉదాహరణకు, 'కుటుంబం' అనే ఒకే వస్తువును– మార్క్సిస్టు విమర్శ 'వర్గ' సంబంధాల కోణంలోను; స్త్రీవాద విమర్శ 'లింగ' వివక్ష, 'పితృస్వామ్య' కోణంలోను; మనోవైజ్ఞానిక విమర్శ 'అంతర్గత' సంఘర్షణల కోణంలోను విశ్లేషిస్తుంది. ఇక నేటి విమర్శ రచనలోని 'భాష' కేవలం 'సరళంగా ఉందా, సంక్లిష్టంగా ఉందా,' 'గ్రాంథికమా, వ్యావహారికమా' అని చూడటం లేదు. భాష వెనుక ఉన్న 'అధికార సంబంధాలను', 'ఆధిపత్య భావజాలాన్ని' శోధిస్తోంది. దీన్నే Discourse Analysis అంటారు. తెలంగాణ, రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ 'భాష'పై, 'మాండలికాల రాజకీయం'పై చేసినంత లోతైన చర్చ గతంలో ఎన్నడూ లేదు. ప్రామాణిక భాష పేరుతో కొన్ని ప్రాంతాల, సమూహాల భాషను ఎలా అణచివేశారో విశ్లేషించడం నేటి విమర్శలో ముఖ్యమైన అంశం కాదా? ఇక 'అభివ్యక్తి', 'శిల్పం' విషయానికి వస్తే– ఆధునికోత్తరవాద పద్ధతులు వచ్చిన తర్వాత 'శిల్పం'పై విశ్లేషణ పూర్తిగా మారింది. గతంలా ఇది అలంకారాల లెక్క, ఛందస్సుల బేరీజు కాదు. కథన పద్ధతులు, మ్యాజిక్ రియలిజం, ఇంటర్–టెక్స్ట్యువాలిటీ (intertextuality) వంటి కొత్త పరికరాలతో శిల్పాన్ని విశ్లేషిస్తున్నారు. పాఠకుడి పాత్ర కూడా శిల్ప విశ్లేషణలో భాగమైంది.

మూల వ్యాసకర్త బహుశా పత్రికల్లో వచ్చే 'సమీక్ష'లను చూసి, దాన్నే సమగ్ర 'విమర్శ'గా భ్రమపడి ఉండవచ్చు.

కట్టమంచి, రా.రా. వంటి విమర్శకులను ప్రస్తావిస్తూ గోపాలయ్య గతాన్ని ఆదర్శీకరిస్తున్నారు. వారు గొప్ప విమర్శకులే, కానీ వారి కాలపు ప్రమాణాలతో నేటి అస్తిత్వవాద (దళిత, బీసీ, గిరిజన) సాహిత్యాన్ని కొలవలేం. "సృజన ఆధారంగానే విమర్శ పరికరాలను సిద్ధం చేసుకోవాలి" అని వ్యాసకర్త చెప్పిన వాక్యమే ఆయన వాదనను ఖండిస్తుంది.

గత 15–20 ఏళ్లలో తెలుగు సృజనాత్మక సాహిత్యం (ప్రపంచీకరణ, తెలంగాణ ఉద్యమం, అస్తిత్వవాదాల కేంద్రంగా) పూర్తిగా మారింది. ఈ 'కొత్త సృజన'ను అర్థం చేసుకోవడానికి విమర్శ కూడా 'కొత్త పరికరాలను' సిద్ధం చేసుకుంది (దళిత, స్త్రీ, బీసీ వాదాలు, బయోపాలిటిక్స్ మొదలైనవి). ఈ పరిణామాన్ని గుర్తించకుండా 'ఏమీ జరగడం లేదు' అని తేల్చేయడం నిరాశావాదం. సమకాలీన తెలుగు విమర్శ 'ప్రమాణాలు లేని' శూన్యంలో లేదు. అది గతం కంటే భిన్నంగా, బహుళ స్వరాలతో కొనసాగుతోంది. సామాజిక మాధ్యమాల వల్ల విమర్శ ప్రజాస్వామ్యీకరించబడింది. అక్కడ 'కువిమర్శ' ఉన్నా, లోతైన సిద్ధాంత చర్చలూ ఉన్నాయి.

■ వెంకట రామయ్య గంపా
✆ 99586 07789



కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

శంకర్ ఆస్పత్రి.. సేవలు అసమాన్యం

- సామాన్యులకు అందుబాటులోకి నేత్రవైద్యం
- పెదకాకానిలో నేత్రాలయం ఏర్పాటు మన అదృష్టం
- నూతన బ్లాక్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అసమాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆదివారం గుంటూరుకు సమీపం పెదకాకానిలోని శంకర్ నేత్రాలయంలో ఐ కేర్ సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెదకాకానిలో శంకర్ నేత్రాలయ ఏర్పాటు అదృష్టంగా భావించాలన్నారు. ఐదు రాష్ట్రాల్లో 14 ఆస్పత్రుల ద్వారా ఇప్పటి వరకు 70 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు జరిగాయని కొనియాడారు. సామాన్యులకు సైతం నేత్ర వైద్యం అందుబాటులో తీసుకొచ్చిన ఘనత కంచి కామకోటి పీఠానిదన్నారు. ప్రతిఒక్కరికీ కంటి వెలుగు అందేలా శంకర కంటి ఆస్పత్రి కీలకపాత్ర పోషించాలన్నారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని భావించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మానవసేవే.. మాధవసేవ

పేదరికం లేని సమాజం చూడాలన్నది జగద్గురు ఆది శంకరాచార్యుల కల. ఇది అసాధ్యం కాదు. అందరం అనుకుంటే సాధ్యం. దేశంలోని అన్ని పీఠాలకు కంచి కామ కోటి పీఠం ఆదర్శవంతం. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా కంచి పీఠాన్ని ఆదిశంకరాచార్యులు తీర్చిదిద్దారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి కంచి పీఠం వైద్య సేవలందిస్తుండటం స్ఫూర్తిదాయకం. కంచి పీఠం చేసే అన్ని కార్యక్రమాలకు అండగా ఉంటాం.

-ముఖ్యమంత్రి చంద్రబాబు



శంకర్ నేత్రాలయంలో లోపల విభాగాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర

విద్య, వైద్యమే లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్య, రోగులకు మంచి వైద్యం, మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం అందించడమే తమ లక్ష్యమని కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. కంచి పీఠం తరపున చదువు, బలం, మంచిపేరు, కీర్తి, పుణ్యం తదితర ఐదు రకాల సేవలు నిత్యం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అనేకమైన ప్రార్థనలు, ప్రయత్నాలు ధర్మబద్ధంగా జరుగుతున్నాయన్నారు. విద్య, సంస్కృతి కలిపి శంకర స్కూల్స్ ప్రారంభం కానున్నాయని తెలిపారు. మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఆర్.వి .రమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సలహా మేరకు త్వరలో ఏఐ టెక్నాలజీ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, జీడీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, డాక్టర్ జేకే రెడ్డి, మురళీకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం మూడో ఆదివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయం సందడిగా మారింది. ప్రథమ ఆరామమైన అమరేశ్వరాలయ సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమరావతికి చేరుకున్న భక్తులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, నదీతీరంలో కార్తిక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



క్యూలో బారులు తీరిన భక్తులు

గడువుకంటే ముందే పనులు పూర్తి

శంకర్‌విలాస్ ఆర్వోబీ పరిశీలనలో డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణాన్ని గడువుకంటే ముందే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు.



శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోబీకి సంబంధించి రైల్వేకు సంబంధించిన సమస్యలపై కేంద్రంతో మాట్లాడుతున్నా మన్నారు. జీజీహెచ్ వైపున ఏడు పిల్లర్ల నిర్మాణం డిసెంబరు 15వ తేదీ నాటికి పూర్తి అవు తుందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఆర్వోబీ పనులు ఒక నెల ఆలస్యమయ్యా యని, వేగం పెంచి నిర్ణీత సమయం కంటే ముందే పూర్తి చేసేందుకు తాము ప్రయత్నిస్తు న్నామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న షాపులను కొందరు మున్సిపల్ కార్పొరేషన్‌కు స్వాధీనపరచలేదన్నారు. వారు కోరుకొంటున్నంత పరిహారం ఇవ్వలేమన్నారు. నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

మిర్చి సీజన్‌కు ఇబ్బంది లేకుండా చేస్తాం

మిర్చియార్డు వద్ద నల్లపాడు రోడ్డులో ఎన్‌హెచ్ఏఐ నిర్మిస్తోన్న ఫ్లైవోవర్ పనులతో మిర్చి సీజన్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని పెమ్మసాని తెలిపారు. ఆదివారం ఆయన తొలుత మిర్చియార్డు వద్ద జరుగుతోన్న ఫ్లైవోవర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సర్వీసు రోడ్డుకు ఇబ్బందికరంగా మారిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని వేరే ప్రదేశంలోకి మార్చాలని మంత్రి సూచించారు. మిర్చియార్డు గేటుకు ఎదురుగా రెండు పిల్లర్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి జనవరి 15కి వాటి మధ్యలో నుంచి యార్డులోకి లారీల రాకపోకలకు ప్రవేశం కల్పిస్తామన్నారు. వర్షాలతో పనులు కొద్దిగా ఆలస్యమయ్యాయని, ఇప్పుడు వేగం పుంజుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవ్

- ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు



వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటి (వీవీఐటీ)లో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనగా.. దాదాపు 25 వేల మంది ప్రేక్షకులు బాలల ప్రదర్శనలు తిలకించి మైమరచిపోయారు. బాలలు వారి ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు.

-పెదకాకాని, ఆంధ్రజ్యోతి



6

12, 13న నగరంలో.. నీటి సరఫరాకు అంతరాయం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12 13 తేదీల్లో తాగునీటి సరఫరా జరగదని కమిషనర్ పులి శ్రీనివాసులు అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం జాగర్లమూడి హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి నీటి సరఫరా చేసే ప్రధాన లైనుపై సుద్దపల్లి గ్రామం వద్ద ఏర్పడిన లీకుకు బుధవారం మరమ్మతులు చేస్తామన్నారు. ఈ కారణంగా ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సంగం జాగర్లమూడి ఫిల్టరేషన్ ప్లాంటు నుంచి నీటి పంపింగ్ పూర్తిగా నిలుపుదల చేస్తామన్నారు. ఈ కారణంగా బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా నాజ్‌సెంటర్, ఎల్‌బీనగర్, బాలాజీనగర్ రిజర్వాయర్లకు కూడా నీటి పంపింగ్ జరగదని ఈ కారణంగా బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం వాటి పరిధిలో కూడా నీటి సరఫరా జరగదన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి తాగునీటికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఫెడరేషన్ కప్‌లో మహిళా లిఫ్టర్ల సత్తా

6

కృష్ణానదిలో ఇద్దరు గల్లంతు
- రాయపూడి లాంచీ రేవు వద్ద ఘటన

వెంగళాయపాలేనికి.. సరోవరం

- పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి
- పీఎంకేఎస్‌వై 2.0లో రూ.1.20 కోట్లతో పనులు
- ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు ఆదాయంపై ప్రయోగం
- ఇక్కడ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- చెరువు పరిశీలనకు రేపు కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక



చెరువు కట్ట ఆవరణలో కొబ్బరి, అరటి చెట్లను నాటుతున్న సిబ్బంది



గుంటూరు శివారులోని వెంగళాయపాలెం చెరువుకు మహర్దశ పట్టింది. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో చెరువుకు కేంద్ర ప్రభుత్వం వరమిచ్చింది. పిచ్చిచెట్లు.. గోతులు.. అపరిశుభ్ర పరిసరాలతో అధ్వానంగా ఉండే చెరువు సర్వాంగ సుందరంగా మా రింది. గతంలో గ్రామంలోని వారికే పట్టని చెరువు ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. పెద్దలకు ఆరోగ్యం, పిల్లలకు ఆహ్లాదకరం అందించడంతో పాటు స్వయం సమృద్ధి చెంది ఆదాయం ఆర్జించేలా అభివృద్ధి చేశారు. వాటర్ షెడ్ పథకంలో మోడల్ ప్రాజెక్టుగా వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ చేపట్టారు. చెరువు కట్ట పటిష్టంతో పాటు కొబ్బరి మొక్కలు, వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, జిమ్, పార్కు వంటి సౌకర్యాలతో నందనవనాన్ని తలపిస్తోంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 130 మంది ప్రతినిధులు రానున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని వాటర్‌షెడ్‌కు సంబంధించిన జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేయడంతో పాటు వెంగళాయపాలెంలో వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చెరువు పునరుద్ధరణ చేశారు. దీంతో ప్రస్తుతం చెరువు పర్యాటక ప్రాంతంగా మారింది. 23.5 ఎకరాల్లో విస్తరించిన వెంగళాయపాలెం చెరువును గతంలో గ్రామస్థులు తాగునీటి అవసరాలకు వినియోగించుకునేవారు. క్రమేణా గ్రామంలో తాగునీటికి ప్రత్యామ్నాయంతో పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీటి అవసరాలకే చెరువు

(మిగతా 6లో)



నల్లపాడు లయోలా పాఠశాలలో జరుగుతున్న వాటర్ షెడ్ మహోత్సవ సభ ఏర్పాట్లు



చెరువు ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు



వెంగళాయపాలెం చెరువు

వెంగళాయపాలెనికి.. సరోవరం

(5వ పేజీ తరువాయి)

పరిమితమైంది. దీంతో పశువుల సంచారంతో చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రూపం కోల్పోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువు చుట్టూ ఖాళీ స్థలంతో పాటు.. విశాలంగా ఉండటంతో జాతీయస్థాయిలో ఎంపిక చేసి, అమృత సరోవర్ అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు, చెరువులో చేపల పెంపకానికి కూడా చర్యలు చేపట్టారు. తద్వారా ఆదాయం కూడా ఆర్జించేలా చెరువును అభివృద్ధి చేశారు. కొబ్బరి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షలు, చేపల పెంపకం ద్వారా రూ.2 లక్షలు పంచాయతీకి సమకూరుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలుకు పాలకులు, అధికారులు ఆలోచన చేస్తున్నారు.

రేపు పరిశీలన.. సభ

రెండు రోజుల వాటర్‌షెడ్ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమవుతుంది. కాగా చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు కూడా రానున్నారు. ఆ తర్వాత వెంగళాయపాలెంలోని నల్లపాడు, లయోలా పాఠశాలలో వాటర్ షెడ్ మహోత్సవం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. చెరువుతో పాటు వెంగళాయపాలెం గ్రామంలో డివైడర్‌కు రంగులతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. లయోలా పాఠశాలలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వాటర్‌షెడ్ మహోత్సవ్‌కి విస్తృత ఏర్పాట్లు

● గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, పక్కన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమవారం నుంచి రెండు రోజులు జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ ఆదేశించారు. గుంటూరు ఐటీసీ హోటల్‌లో సోమవారం ప్రారంభమయ్యే సదస్సు వేదికను ఆయన ఆదివారం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ కింద వెంగళాయపాలెంలో నిర్మిస్తున్న ఊట చెరువు పనులను, లయోలా పాఠశాల ఆవరణలో జరిగే సభ ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించారు. ఆయా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నిఖిల్‌కడే, వాటర్‌షెడ్ విభాగం సంచాలకుడు వైవీకే షణ్ముఖ కుమార్, అదనపు కమిషనర్ సీపీరెడ్డి, రాష్ట్ర సంచాలకులు మైలవరపు కృష్ణతేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శంకర్ పాల్గొన్నారు.



శిలఫలాకాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



చెరువు కట్ట వద్ద పనులు జరుగుతున్న దృశ్యం

అవగాహనా లోపంతోనే పక్షవాత మరణాలు

● మెదడును రక్షించడంలో గోల్డెన్ అవర్ కీలకం
● బీఫాస్ట్ పద్ధతిని విస్తృతంగా ప్రచారం చేయాలి
● ఐఎస్ఏ సింపోజియంలో వైద్యుల అభిప్రాయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో అవగాహనా లోపం, ఆలస్యమైన వైద్యం కారణంగా పక్షవాతం వలన ప్రాణనష్టం ఎక్కువగా సంభవిస్తుందని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో ఐఎస్ఏ సింపోజియం నిర్వహించారు. దేశంలో పెరుగుతున్న పక్షవాతం కేసుల దృష్ట్యా ప్రజలు తమ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించుకోవాలని, బీ ఫాస్ట్ అనే స్ట్రోక్ హెచ్చరిక సంకేతాల పట్ల అప్రమత్తంగా వుండాలని వైద్యులు సూచించారు. తొలుత ఐఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ పీ విజయ జ్యోతిప్రజ్వలన చేసి సింపోజియంను ప్రారంభించారు. పలువురు వైద్యులు, ఐఎస్ఏ ప్రతినిధులు తమ అభిప్రాయాలను, అనుభవాలను వెల్లడించారు. దేశంలో ప్రతియేటా 18లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని చెప్పారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి కారణాలతో యువతలో కూడా ఈ తరహా కేసులు పెరుగుతున్నాయన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాతం మొదలైన నాలుగున్నర గంటల (గోల్డెన్ అవర్) లోపు ఆసుపత్రికి చేరుకోవడం ద్వారా మెదడును రక్షించవచ్చని, దీర్ఘకాలిక వైకల్యాన్ని నిరోధించవచ్చని చెప్పారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సింపోజియంలో ఐఎస్ఏ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ సుశీల్ శర్మ, ఎయిమ్స్ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ దీప్తి వేమకొమ్మ, పరిపాలనా విభాగం డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం, ఎమర్జెన్సీ వైద్యులు, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్, వీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయిలో స్ట్రోక్ కేర్ మార్గదర్శకాల అభివృద్ధిపై చర్చించారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవ్

● ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
● తెలుగు కళలకు అద్దం పట్టేలా బాలల ప్రదర్శనలు
● విజేతలకు బహుమతుల అందజేత











పెదకాకాని, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐటీ)లో మూడురోజులపాటు వైభవంగా నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనగా.. దాదాపు 25వేల మంది ప్రేక్షకులు బాలల ప్రదర్శనలు చూసేందుకు హాజరయ్యారు. మూడోరోజు విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు జరిగాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద చేసిన జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. విచిత్ర వేషధారణ పోటీలలో చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారి ప్రదర్శనలు సాంప్రదాయాలకు అద్దంపట్టేలా ఉన్నాయి. మట్టిబొమ్మలు, కాగితపు చేతిబొమ్మల అంశాలలో చిన్నారులు ఆసక్తిగా ఆకృతులను రూపొందించారు. బాలోత్సవ్ విజయవంతం కావటంలో వీవీఐటీయూ శాక్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రోచాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. బాలోత్సవ్‌లో సంతోషంగా గడిపిన విద్యార్థులు వారి జీవిత లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులకు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, వీవీఐటీయూ వైస్ చాన్సలర్ రాంబాబు కొడాలి, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ కె.గిరిబాబు బహుమతులు అందచేశారు.

మట్టితో బొమ్మలు చేస్తున్న చిన్నారులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం

● బాపట్లలో అఖిల పక్ష సదస్సులో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి



ఐక్యత చాటుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ

బాపట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సదస్సు నిర్వహించారు. పీపీపీ విధానాన్ని విరమించి 590 జీవోను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ప్రముఖ వైద్యుడు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్రకన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మస్తాన్‌వలి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ మాఫియాను ప్రోత్సహిస్తూ 500 ఎకరాలలో నిర్మాణంలో ఉన్న 10 మెడికల్ కళాశాలలను, 10 ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్‌కు కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ, విద్య, వైద్యరంగాలు సేవారంగాలుగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి గంటా అంజిబాబు, సీపీఐ కార్యవర్గసభ్యుడు పర్చూరి రాజేంద్రప్రసాద్, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, గంగయ్య, మెడికల్ కళాశాలల కోకన్వీనర్ డాక్టర్ వసుంధర కుర్రా, ఎన్‌జే విద్యాసాగర్, మేదా శ్రీనివాసరావు, దర్శి విష్ణుశంకర్, డాక్టర్ తవ్వా సురేశ్ ప్రసంగించారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు 43,500 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజ్ దిగువకు విడుదలవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెంగళరేవు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 52350 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 43500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3615, పశ్చిమడెల్టాకు 5009, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

హోరాహోరీగా ఎడ్లబండ లాగుడు పోటీలు

● సబ్ జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం



ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దుర్గి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 4200 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన రోషన్‌బాబు ఎడ్లజత 4 వేల అడుగులు, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత కూడా 4వేల అడుగుల దూరం లాగి రెండు, మూడుస్థానాలను కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బొర్రెడ్డి కేశవ ఎడ్లజత 3800 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 3400 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరుకు చెందిన తనుబొత్తి రవిశంకర్‌రెడ్డి ఎడ్లజత 3357 అడుగులతో ఆరోస్థానం, బాపట్ల జిల్లా బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత 3140 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. పోటీలను తిలకించేందుకు రైతులు, పశుపోషకులు భారీగా తరలివచ్చారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించగా పులి హరి, కొత్త వెంకటేశ్వర్లు, పులిబండ్ల పిచ్చయ్య, పెదనేడు గోపిలు పర్యవేక్షించారు. పోటీలను కూటమి నేతలు కటకం రామారావు, ఆకుల రామలక్ష్మయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, గుండాల వెంకటేశ్వర్లు, తోటకూర శ్రీనివాసరావు, వెలిదండి శ్రీనివాసరావులు ప్రారంభించారు. సోమవారం సేద్యం విభాగంలో పోటీలు జరగనున్నాయి.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుండి ఢీకొనడంతో వాహనదారుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.శివయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం చెరుకుపల్లి మండలం, గూడవల్లికి చెందిన షేక్ అహ్మద్‌వలి(27) రేపల్లె నుండి ద్విచక్రవాహనంపై వస్తుండగా సూరేపల్లి వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కృష్ణానదిలో ఇద్దరు గల్లంతు

తుళ్లూరు(రాయపూడి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపూడి కృష్ణానది లాంచీ రేవు వద్ద ఇద్దరు వర్కర్లు గల్లంతయ్యారు. పోలీసుల కథనం మేరకు.. శాఖమూరు గ్రామ పంచాయతీ పరిధిలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దగ్గర ఎన్‌సీసీ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు వర్కర్లు నదిలో స్నానానికి దిగారు. ఇందులో ఎన్‌సీసీ స్టోర్‌లో పనిచేస్తున్న అమలాపురానికి చెందిన పవన్ (24), అకౌంటెంటుగా పనిచేస్తున్న గిద్దలూరుకు చెందిన దినేష్(23)లు నదిలో కొట్టుకుపోయారు. మణికంఠ, పవన్‌కళ్యాణ్ అనే ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కలగయ్య ఆధ్వర్యంలో గల్లంతైన వారికోసం పడవలతో గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఫెడరేషన్ కప్‌లో మహిళా లిఫ్టర్ల సత్తా



ఫెడరేషన్ కప్, క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లు

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహించిన గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు సత్తా చాటి రెండు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలను సొంతం చేసుకున్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని మంగళగిరిలో ఆదివారం ఈ వివరాలను వెల్లడించారు. క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ 76 కిలోల విభాగంలో బి.లిఖిత స్వర్ణం, 84 కిలోల విభాగంలో ఈ.లక్ష్మీ వినయశ్రీ స్వర్ణం, ఎక్విప్డ్ 47 కిలోల విభాగంలో ఎం.షానూన్ రజతం, 84 కిలోలు పైబడిన విభాగంలో నాగం జ్ఞానదివ్య రజత పతకాలు సాధించారు. తెనాలి పట్టణానికి చెందిన ఈ నలుగురు భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికపై రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బి.చంద్రిక, భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, మస్తాన్‌వలి తదితరులు అభినందించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5438, ప్రధానజల విద్యుత్‌కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 51,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

అంబేడ్కర్‌పై మరిన్ని రచనలు రావాలి

● ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై మరిన్ని రచనలు రావాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు అన్నారు. స్థానిక బ్రాడీపేట యూటీఎఫ్ హాల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రచయిత ఆనంద తేల్ తుంబడే రచించిన ఐకానోక్లాస్ట్ పుస్తక సమీక్ష జరిగింది. ఈ సభకు రాష్ట్ర నాయకుడు కోలా నవ జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసులు మాట్లాడుతూ, ఐకానోక్లాస్ట్ పుస్తకం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రకు అద్దం పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, పౌర హక్కుల సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, కె.జయసుధ, డాక్టర్ మూకిరి సుధ, నళినీకాంత్, భావన్నారాయణ, చిట్టి బాషా, కొరివి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు, వేదికపై డొక్కా మాణిక్యవరప్రసాదు, జూపూడి ప్రభాకర్

చరిత్రకారుడు నసీర్‌కు జీవిత సాఫల్య పురస్కారం


సయ్యద్ నసీర్ అహమ్మద్

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చరిత్రకారుడు, రచయిత సయ్యద్ నసీర్ అహమ్మద్ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉర్దూ అకాడమీ వారు ప్రతి ఏడాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని ఈ అవార్డును ప్రకటిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ గత మూడు దశాబ్దాలుగా నసీర్ 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించారు. ఈ గ్రంథాలు ఉర్దూ భాషతోపాటుగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, గుజరాతీ భాషలలో వెలువడ్డాయి. ఆయన చరిత్ర గ్రంథ రచనతో పాటు స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు తెలియపర్చుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సయ్యద్ నసీర్ అహమ్మద్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. ఈ పురస్కారం ఈ నెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయనకు అందజేయనున్నారు.


మాట్లాడుతున్న రమేశ్ నాయుడు, పాల్గొన్న బీజేపీ నాయకులు

కేంద్ర మంత్రి పర్యటనను జయప్రదం చేయాలి

గుంటూరు (తూర్పు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొనేందుకు మంగళవారం గుంటూరుకు రానున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు అపూర్వ స్వాగతం పలకాలని శ్రేణులకు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేశ్ నాయుడు పిలుపునిచ్చారు. లాలూపురంలోని వాజ్‌పేయి భవనంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐటీసీ హోటల్లో జరిగే సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎం మాధవ్ పాల్గొననున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నాయకుల పర్యటనలను జయప్రదం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాస్, పాలపాటి రవికుమార్, చంద్రశేఖర్, బజరంగ్ రామకృష్ణ పాల్గొన్నారు.


చెన్నై సదస్సులో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు అరుదైన గౌరవం

గుంటూరు మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అహల్య ఆసుపత్రికి చెందిన ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. చెన్నైలో ఐఎస్ఏఆర్ ఆధ్వర్యంలో ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో వైద్య చికిత్సలు విఫలమయ్యేందుకు దారి తీసే కారణాలు, వైద్య చికిత్స విధానాలు గురించి ఆదివారం మాస్టర్ క్లాస్ సదస్సు నిర్వహించారు. దీనికి దేశంలో పేరుగాంచిన 60 ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ వైద్యులను ఆహ్వానించారు. ఈ సదస్సుకు గుంటూరు నుంచి అహల్య ఆసుపత్రి వైద్యుడు శనక్కాయల ఉమా శంకర్‌కు ఆహ్వానం అందింది. చెన్నై సదస్సులో డాక్టర్ ఉమాశంకర్ పాల్గొని కృత్రిమ సంతానోత్పత్తి చికిత్సల్లో తన అనుభవాలను పంచుకున్నారు. ఐఎస్ఏఆర్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అమిత్ పాత్కి, డాక్టర్ ఉమా శంకర్‌ను సత్కరించారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, పాల్గొన్న సీపీఐ నాయకులు

ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిన కూటమి ప్రభుత్వం

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేవలం పదిహేడు నెలల పాలనలోనే రూ.రెండున్నర లక్షల కోట్ల అప్పులు తెచ్చి ప్రజలను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి కూటమి ప్రభుత్వం నెట్టేసిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక కొత్తపేట, సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజా సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం ప్రజలను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయని అన్నారు. సమస్యలపై ఈ నెల 18న సామాజిక న్యాయంపై పేరిట పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి డిసెంబరు 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శతవార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించిందని, దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే చలో ఖమ్మం మహాసభలో కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగా అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మేడా హనుమంతురావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ బుడంపాడు, ఏటుకూరు, పొత్తూరు, నాయుడు పేట తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించబోమని, పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించమని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. పనులు పూర్తయిన తర్వాత తప్పనిసరిగా సంబంధిత కాంట్రాక్టరే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, డీఈఈ సతీష్ కుమార్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

జనసేనను మరింత బలోపేతం చేయాలి

● పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన పిలుపు

గుంటూరు మెడికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా జనసైనికులు, వీర మహిళలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. నెహ్రూనగర్ మెయిన్ రోడ్ సెంటర్‌లో జనసేన కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పులిగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 'చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గుంటూరు నగరంలో వారానికి ఒక డివిజన్‌లో చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమం నిర్వహించాలని, దీని ద్వారా రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం దిశగా వేయవలసిన అడుగులపై ప్రతిఒక్కరికీ అవగాహన పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శి వడ్రాణం మార్కండేయ బాబు, పార్టీ జిల్లా, నగర కమిటీ సభ్యులు, కొత్తపేట శివాలయం గుడి ఛైర్మన్ శేషతల్ప సాయి, వీరమహిళలు, జనసైనికులు, పాల్గొన్నారు.


చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బోనబోయిన

అలరించిన భక్తిమాల గీతాలాపన

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం భక్తిమాల గితాలాపన కార్యక్రమం అలరించింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీమణులు యిమ్మడి అంజనీదేవి, చింతలపాటి రమామహేశ్వరి, సోనాముఖి, పావని, హేమకుసుమ, లక్ష్మీదేవి, జీవనజ్యోతి, దుర్గ, పార్వతి, సుభాషిణి, యశోద, ఉష, ఉమ, నాగరవళి, లోకేశ్వరి, భారతి, కామాక్షి, సుజాత, లక్ష్మీకుమారి, భారతి, మురళికృష్ణ, బ్రహ్మేశ్వరి వివిధ దేవి, దేవతలను స్తుతిస్తూ పలు కీర్తనలను చక్కగా ఆలపించారు. డాక్టర్ తాతా గిరిజా శేషమాంబ కీర్తనలకు స్వర రచన గావించారు. వీరికి తబలపై బాలాజి, కీబోర్డుపై అశోక్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని యిమ్మడి మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

రాజకీయ ఉనికి కోసమే పోరాటం

● ఏపీ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా నేత ఏడుకొండలు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాలివాహనులకు కావాల్సింది రాయితీలు కాదని, రాజకీయ ప్రాతినిధ్యమని ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు అన్నారు. ఆదివారం పేరేచర్ల వద్ద జరిగిన వన పూజోత్సవంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తమకు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇచ్చిందన్నారు. ఆ తర్వాత రాజకీయపార్టీలు పట్టించుకోవడం మానేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాలివాహనుల సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించడానికి తమకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వేలాది మంది శాలివాహనులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 2026 డైరీని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం భాస్కర శ్రీనివాస్, రాజవరపు రవి, పొరళ్ల అంకమ్మరావు, గుమ్మడిదల సీతారామయ్య తదితరులు ఆవిష్కరించారు.

వేడుకగా బ్రాహ్మణ కార్తిక సమారాధన

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆవరణలో గుంటూరు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన బ్రాహ్మణ కార్తిక సమారాధన ఆదివారం వేడుకగా సాగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ గీతాలాపన చేసి అలరించారు. ముఖ్యఅతిథులుగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితరులు హాజరై మాట్లాడారు. కార్తిక వన సమారాధనలతో ఆధ్యాత్మికతో పాటు సమష్టిగా ముందుకు వెళ్లాలనే భావన కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు నందిరాజు పాండురంగరావు, రంగావజ్ఝల లక్ష్మీపతి, కర్లపాలెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయత... అనుబంధాలు తెలియజేసే రీతిలో వనభోజనాలు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కిట్టీ పార్టీల మోజులో పడి అనుబంధాలు.. ఆత్మీయతను కోల్పోతున్న నేటి యువతరానికి వాటి విలువలు చాటి చెప్పడానికి కార్తీక మాసం వనభోజనాలు వేడుకగా నిలిచింది. ఓ వంశానికి చెందిన వారు ఆరేడు తరాల పెద్దల ఫొటోలు సేకరించి గ్యాలరీ ఏర్పాటు చేశారు. నాడు ఉమ్మడి కుటుంబాల్లో జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెప్పేవిధంగా అలనాటి మధుర స్మృతులను కళ్ళకు కట్టేలా వినూత్న రీతిలో ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1947కు ముందు ఆటపాటలను నేటి తరం వారితో ఆడిస్తూ... చివరకు భోజనాలు కూడా స్వాతంత్ర్యానికి ముందు పూర్వకాల పద్ధతిలోనే ఏర్పాటు చేశారు. ఆదివారం పెదపలకలూరు సమీపంలోని తోటలో చిటిప్రోలు వంశస్థులు ఆదివారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆనాటి తరం పరిస్థితులు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని నిర్వాహకులు కిషోర్ కుమార్, సురేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు.

తైక్వాండో పోటీలలో అత్యుత్తమ ప్రతిభ

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సీకే బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఆర్ పూజ అక్షర, షణ్ముఖ ప్రియ, లక్ష్మీ చరిత, చేతన్ శ్రీ అభిరామ్, జశ్విత శ్రీ.. బంగారు పతకాలు, వెరోనికా రెడ్డి కాంస్య పతాకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీవో అఫ్రోజ్‌ఖాన్, బచపన్ పాఠశాల డైరెక్టర్ షహనాజ్, కోచ్ కరుణాకర్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు


పడిపూజలో పాల్గొన్న మాదల చైతన్య, అయ్యప్ప స్వాములు

ఘనంగా జనచైతన్య ప్రాపర్టీస్ మహా పడిపూజ

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జన చైతన్య ప్రాపర్టీస్ అధినేత మాదల చైతన్య ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక పట్టాభిపురంలోని, స్వామి థియేటర్ ప్రాంగణంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవ కార్యక్రమానికి వేల సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. గురుస్వాములు రాంబాబు, డేగల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో మహాపడి పూజ మహోత్సవం, స్వామి వారికి హారతి పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు శ్రీను స్వామి ఆధ్వర్యంలో గొప్ప భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. అయ్యప్ప స్వామి వారికి 18 పడిమెట్లకు పూజలు చేశారు. పూజ అనంతరం విగ్రహానికి పంచామృత అభిషేకం, కుంకుమ, చందన, పసుపు, భస్మాభిషేకాలను చేశారు. మహా మంగళ హారతితో పూజ కార్యక్రమాన్ని ముగించారు.

వడ్డెర సంఘం నగర ఉపాధ్యక్షుడిగా సురేశ్

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నగర ఉపాధ్యక్షుడిగా తమ్మిశెట్టి సురేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు మహేశ్‌బాబు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ, వడ్డెర జాతి అభ్యున్నతికి, వడ్డెరలు రాజకీయ చైతన్య దిశగా అడుగులు వేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొని సురేశ్‌ను అభినందించారు.

వ్యభిచార, పేకాట స్థావరాల గుట్టు రట్టు

● యువతులు సహా పలువురు అరెస్టు

● రెండు లక్షలకు పైగా స్వాధీనం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గుట్టుగా సాగుతోన్న పేకాట, వ్యభిచార స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువతులు సహా పది మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.... జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం ఆదివారం విస్తృత దాడులు నిర్వహించారు. అరండల్‌పేట 7/2 రోడ్డులో ఉన్న ఒక భవనంలోని మూడో అంతస్తులో ఆర్గనైజింగ్ పేకాట ఆడుతున్న ముఠాపై అరండల్‌పేట ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న సరిపూడి బాలకృష్ణ, పుట్టా రవి, ముప్పాళ్ళ నరేంద్ర, మన్నం శ్రీనివాసరావు, తాకినేని శ్రీను, సిరిగిరి రమేష్ బాబు, బందెల నారాయణ, అన్నా కోటేశ్వరరావు, ముప్పాళ్ళ బాబు, రేలంగి శివప్రసాద్ (బాయ్) అనే పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2 లక్షల 18 వేల 320 నగదును, 10 సెల్ ఫోన్లు సీజ్ చేసి అరండల్ పేట పోలీస్‌స్టేషన్ కు తరలించారు.

అదే విధంగా ఆదివారం సాయంత్రం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల ఒక హోటల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు నల్లపాడు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆకస్మిక దాడి నిర్వహించి ముగ్గురు మహిళలు, ఒక పురుషుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 4 సెల్ ఫోన్లను సీజ్ చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి

పాతకక్షల నేపథ్యంలో శారదా కాలనీ 13వ లైన్‌కు చెందిన పఠాన్ బుడే (58)పై కత్తితో దాడి చేశారు. బుడే బేల్దారు పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అతని కొడుకు పటాన్ మస్తాన్ ఫైపులు పని చేస్తూ జీవిస్తున్నాడు. సదరు మస్తాన్‌కి అదే వీధిలో ఉండే పటాన్ హసన్‌కి మధ్య పాత గొడవలు ఉన్నట్లు, ఆ గొడవలు మనసులో పెట్టుకొని మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గొడవపడి హసన్ కత్తితో బుడే తలపై దాడి చేశాడు. బుడేకు రక్తం గాయం అవ్వగా జీజీహెచ్‌కి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబును శంకర కంటి ఆసుపత్రి వద్ద గౌరవ వందనంతో మర్యాద పూర్వకంగా కలిసిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి



నెహ్రూనగర్‌లోని కాపునాడు కార్యాలయంలో ఆదివారం మిర్యాల వెంకటరావు 11వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మిర్యాల వెంకటరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనకు ఘనమైన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు, రాష్ట్రనాయకులు రాగం సదాశివరావు, బొందలపాటి వెంకట్రావు పాల్గొన్నారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి).

ఫ్యామిలీ వైద్య విధానంతో మంచి ఫలితాలు

● జన విజ్ఞాన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రిటన్‌లో అమలవుతున్న ఫ్యామిలీ వైద్య విధానాన్ని రాష్ట్రంలోనూ అమలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో తక్కువ ఖర్చుతో వైద్యం అనే అంశంపై ప్రసంగించారు. ప్రజలకు వచ్చే వ్యాధుల్లో 90 శాతం ఆసుపత్రులతో పనిలేకుండా తగ్గించుకోవచ్చున్నారు. కేవలం 5 శాతం వ్యాధులకు మాత్రమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. నూటికి 85 శాతం వైరల్ జ్వరాలను పారాసిటమాల్ మాత్రలతో తగ్గించుకోవచ్చన్నారు. ఐదు రోజుల వరకు జ్వరం తగ్గకపోతేనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. గుండెపోటు వంటి వాటికి సీపీఆర్ చేయటం నేర్చుకుంటే చాలా మంది ప్రాణాలు కాపాడవచ్చున్నారు. అనారోగ్య సమస్యలను 80 శాతం విశ్రాంతి తీసుకోవటం ద్వారా తగ్గించుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, చలమారెడ్డి, ఎస్ కృష్ణారావు, చంద్రశేఖర్‌రావు, టీవీ సాయిరామ్ తదితరులున్నారు.

ఉత్సాహంగా వాకథాన్

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన వాకథాన్ ఆదివారం నగరంలో ఉత్సాహంగా సాగింది. తొలుత ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు ఈ వాకథాన్ సాగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, వాస్కులర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి నిర్ధారించడంలో జాప్యం కారణంగా చాలా మంది అవయవాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహనతోనే ఈ వ్యాధిని ఆరికట్టవచ్చని అన్నారు. వాస్కులర్ సర్జన్ డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సురేంద్ర డాక్టర్ రత్నశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, కార్యదర్శి డాక్టర్ సాయి కృష్ణ, జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ జి.రామకృష్ణ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్, నర్సింగ్ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.


వాకథాన్‌లో పాల్గొన్న వైద్యులు, ప్రజలు, విద్యార్థులు

బీజేపీ మీడియా కో కన్వీనర్‌గా గంగాధర్ బాధ్యతల స్వీకారం

గుంటూరు (తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బీజేపీ రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కార్యాలయంలో కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాం ప్రసాద్ సమక్షంలో ఈ కార్యక్రమంలో గంగాధర్ మాట్లాడుతూ, బ్రాహ్మణ అర్చక, పురోహిత సంఘాలను కలుపుకొని బ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడతానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ దొరబాబు, నాయకులు పాలపాటి రవికుమార్, తాడువాయి రామకృష్ణ, పల్లపరాజు, తారక రామారావు తదితరులు పాల్గొని గంగాధర్‌ను అభినందించారు.


గంగాధర్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తదితరులు

మాజీ ఎంపీ శివాజీకి పరామర్శ

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీని ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత గౌతు లచ్చన్న తనయుడు మాజీ మంత్రి గౌతు శ్యామ్‌సుందర శివాజీ పరామర్శించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శివాజీ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు అంశాల గురించి వారిద్దరూ చర్చించారు. పెదనందిపాడు విద్యాసంస్థల అధ్యక్షుడు, మాజీ అదనపు ఎస్పీ, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ గౌతు శివాజీని శాలువా కప్పి సత్కరించారు. అనంతరం డాక్టర్ శివాజీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పాలకవర్గం కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీ శివాజీని కలిసిన మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర శివాజీ

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

గుంటూరు (విద్య) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని చల్లావారిపాలెం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సిద్దార్థ గ్యాస్ట్రో కేర్ ఆసుపత్రి, శ్రీ లక్ష్మి సాయి ఆప్టికల్స్ ఐ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దార్థ రెడ్డి ఆళ్ల, పి.సతీష్ కృష్ణ, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ వలెంటీర్లు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

దిక్సూచి

జాతీయ స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో(ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ) ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ మెయిన్ షెడ్యూల్ ఆరంభమైంది. మొదటి సెషన్ జనవరి 21 నుంచి జరుగనుంది. తదుపరి రెండు నెలలూ ఇంటర్ పరీక్షలతో బిజీబిజీ. అపై ఏప్రిల్ నెలలో రెండోసెషన్ ఉంటుంది. అంటే పది నుంచి పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ప్రిపరేషన్‌కు అప్పుడు సమయంఉంటుంది. అలాగే జనవరి సెషన్‌లో ఏదైనా పొరపాటు జరిగితే రెండోదైన ఏప్రిల్ సెషన్‌లో మెరుగుపర్చుకోవచ్చు. ఆ నేపథ్యంలో జనవరి సెషన్‌లోనే మంచి స్కోర్‌కు గట్టి ప్రయత్నం చేయడం మంచిది. అలా చేస్తే ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేందుకు సరిపోను సమయం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన ముఖ్యమైన కొన్నింటిని చూద్దాం. ప్రధానంగా ఈ సారి ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ఫాంట్‌ను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

జేఈఈ మెయిన్
జనవరి సెషన్ బెస్ట్



- ఇంటర్ రెండేళ్ళ సిలబస్ - మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విషయంలో ఈ నెల నుంచే గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌పై దృష్టిపెట్టాలి. డెబ్బయ్ నుంచి ఎనభై శాతం ప్రశ్నలు ఫౌండేషన్స్‌పైనే ఆధారపడి ఉంటాయని గమనించాలి.
- ఫాస్ట్ రివిజన్ షీట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిలో అన్ని ముఖ్యమైన ఫార్ములా, రియాక్షన్, ఈక్వేషన్‌ని ఒకే చోట సబ్జెక్టువారీగా రాసుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంతో ప్రతి రెండు సబ్జెక్టుల మధ్య ట్రాన్సిషనల్ గ్యాప్‌ని తప్పనిసరిగా ఉంచుకోవాలి. పరీక్ష సమయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలి. జిగ్‌జాగ్ లేదంటే ర్యాండమ్ అటెంప్ట్‌లు అస్సలు చేయకూడదు.
- కాలేజీ ముగిసిన తరవాత రోజూ కనీసం నాలుగు గంటల సమయాన్ని స్టడీకి కేటాయించాలి. థియరీతోపాటు కచ్చితంగా న్యూమరికల్స్‌ను సాల్వ్‌చేయాలి. కాలిక్యులేటర్‌ను ఉపయోగించవద్దు. అటెంప్ట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మీ నోట్స్ లేదంటే పాఠ్యపుస్తకాన్ని రిఫర్ చేయండి.
- టైమ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. గడిచిన కొన్నేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేయడం ద్వారా ఒక నిర్ణీత అంచనాకు రావచ్చు. ఏ సబ్జెక్టులో ఏయే కాన్సెప్టుల్లో సులువైన ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు. తద్వారా వాటిపై శ్రద్ధపెట్టవచ్చు. ఉదాహరణకు ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి సులువైన ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అక్కడ మిగిలిన సమయాన్ని కష్టమైన ప్రశ్నలను సాల్వ్ చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.
- ప్రతి వారం కనీసం రెండు మాక్‌టెస్టులను ప్రాక్టీస్ చేయాలి. టెస్ట్ పూర్తయ్యాక ఎర్రర్ అనాలిసిస్ చేసుకోవాలి. ఏ టాపిక్‌లో ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయో గమనించి, ఆ కాన్సెప్ట్‌ని మరో సారి రివైజ్ చేసుకోవాలి.
- అన్ని చాప్టర్లు అని కాకుండా ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి. మేథ్స్‌లో కాలిక్యులస్, జామెట్రీ; ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ; కెమిస్ట్రీలో ఆర్గానిక్‌కు ఎక్కువ వెయిటేజ్ ఉంటుంది.
- మాక్ టెస్టుల్లో స్కోర్ యావరేజ్ అంటే 150కి మించేలా చూసుకోవాలి. ఒకవేళ తగ్గినట్లయితే ఒక చాప్టర్‌పై అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పులు ఎలా, ఎందుకు జరుగుతున్నాయో గమనించాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- గెస్ వర్క్ అస్సలు చేయవద్దు. పరీక్షలో కూడా ఎలిమినేషన్ పద్ధతి ఫాలో అవ్వండి. ఎంసీక్యూలో రెండు లేదా మూడు ఆప్షన్స్ తప్పు అని నిక్కచ్చిగా తెలిస్తే జవాబును గుర్తించడం సులువు అవుతుంది.
- అసలు ఎగ్జామ్‌లో కూడా సులువు నుంచి మోడరేట్‌గా ఉండే ప్రశ్నలు, అలాగే మీకు నచ్చిన సబ్జెక్టుతో అటెంప్ట్ మొదలుపెట్టండి. ఇందుకోసం ముందు మొత్తం పేపర్‌ని విశ్లేషించుకోవాలి. అందుకు కనీసం పది నిమిషాలు కేటాయించుకోవాలి. ఒక్క విషయం, కొన్ని సంవత్సరాల ప్రశ్నపత్రాల సరళిని గమనిస్తే, మేథ్స్‌లో అడిగే ప్రశ్నల నిడివి ఎక్కువగా, కఠినంగానూ ఉంటున్నాయి. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో సులువుగా, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ ఆధారంగా ప్రశ్నలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా మంచిది.
- అన్నింటికీ మించి సరైన ఆహార అలవాట్లు, తగిన నిద్ర తప్పనిసరి. డిజిటల్ అడిక్షన్‌కు దూరంగా ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ప్రశాంతత పెరిగి మంచి స్కోర్ సాధించే వీలు ఉంటుంది.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్సెలెన్సియా, హైదరాబాద్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్స్

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్(ఎల్‌బీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో తెలంగాణలో 88, ఏపీలో 5 పోస్టులు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం ఏడాదిపాటు క్లరికల్/ అధికారి కేడర్‌లో బ్యాంకింగ్ రంగంలో పనిచేసి ఉండాలి.
వయస్సు: 20-30 సంవత్సరాల మధ్య.
ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లోకల్ లాంగ్వేజ్ పరీక్ష ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 23
వెబ్‌సైట్: https://pnb.bank.in/

ఎన్‌సీపీఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 114 డిప్యూటీ మేనేజర్(హెచ్ఆర్ 31. ఎఫ్ అండ్ ఎ 48, సీఅండ్ ఎంఎం 34, లీగల్ 1), 8 హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులు ఉన్నాయి. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం www.npcilcareers.co.in /www.npcil.nic.in. చూడవచ్చు.


జాబ్ కార్నర్

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) 110 అసిస్టెంట్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. జనరల్ 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్ 2, సివిల్ 3) పోస్టులు ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి ఏదైనా పీజీ/ ఇంజనీరింగ్ డిగ్రీ/ లాలో డిగ్రీ ప్లస్ రెండేళ్ళ అనుభవం.
ఎంపిక: రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 28
వెబ్‌సైట్: www.sebi.gov.in

బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజనీర్లు



భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) 340 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఇంజనీర్స్(ఎలక్ట్రానిక్స్ 175, మెకానికల్ 109, కంప్యూటర్ సైన్స్ 42, ఎలక్ట్రికల్ 14 పోస్టులు ఉన్నాయి)
అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 25 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 14
వెబ్‌సైట్: https://bel-india.in/

ఐబీలో 258 మంది ఆఫీసర్స్

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 అధికారుల(అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(90), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(168) పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సైన్సెస్‌లో పీజీ(ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్‌తో ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024, 2025 గేట్ ఎగ్జామ్(కోడ్ ఈసీ/ సీఎస్)లో నిర్దేశిత అర్హతతో కటాఫ్ మార్కులు సాధించి ఉండాలి.
ఎంపిక: నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 16
వెబ్‌సైట్: www.mha.gov.in/www.ncs.gov.in

ఎన్‌హెచ్‌ఏఐలో...

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధపోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టులు: డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) 9, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ 1, జూనియర్ ట్రాన్స్‌లేషన్ అధికారి 1, అకౌంటెంట్ 42 స్టెనోగ్రాఫర్ 32.
పోస్టునుబట్టి ఎంపిక ప్రక్రియ ఉంది. అర్హతలు విడివిడిగా ప్రకటనలో ఇచ్చారు.
అఖరు తేదీ: డిసెంబర్ 15
వెబ్‌సైట్: nhai.gov.in/

నీట్ ఎస్ఎస్ రిజిస్ట్రేషన్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ - నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ - సూపర్ స్పెషాలిటీ(నీట్ ఎస్ఎస్) 2025కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. నవంబర్ 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనిలో సాధించిన మెరిట్ ఆధారంగానే వైద్యవిద్య సంస్థలు అందించే డీఎం, ఎంసీహెచ్, డీఆర్ఎన్‌బీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ టెస్ట్ జరుగుతుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** exam.natboard.edu.in/



టీఐఎఫ్ఆర్‌హెచ్‌లో అడ్మిషన్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ - హైదరాబాద్(టీఐఎఫ్ఆర్‌హెచ్) కెమిస్ట్రీ, ఫిజిక్స్ అడ్మిషన్ బోర్డులు కలపి పీహెచ్‌డీ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - పీహెచ్‌డి ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో నాలుగు ఖాళీలు ఉన్నాయి. కోర్సు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, అసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://gasadmissions.tifrh.res.in
అకడమిక్ కోఆర్డినేటర్ ఈమెయిల్: gasadmissions@tifrh.res.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పెళ్లి షురూ



ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

క్రైమ్ థ్రిల్లర్



వజ్ర యోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. విలన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మహిళల వరుస హత్యల కేసు నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుంది' అని తెలిపారు.



పెద్దితో ఆ కోరిక తీరింది

రామ్‌చరణ్

'సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో పనిచేయాలనేది నా కల. అది 'పెద్ది' చిత్రంతో నెరవేరింది' అని అన్నారు రామ్‌చరణ్. ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. రామ్‌చరణ్, జాన్వీకపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' నుంచి 'చికిరి' పాట లిరికల్ వీడియోను తెరపై ఆవిష్కరించారు. రెహ్మాన్ తనయుడు ఏఆర్ అమీన్ ఈ పాటను వేదికపై ఆలపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ 'నా సంగీత ప్రయాణం తెలుగులోనే ఆరంభమైంది. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమాలతో తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, ఆదరణ ఎంతో సంతోషాన్నిస్తోంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణం' అని చెప్పారు.

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయమౌతున్నాడు. కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాల దర్శకుడు అజయ్‌భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు అజయ్ భూపతి. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు పిక్చర్స్ లిమిటెడ్ బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'ఏబీ4'.

వేధింపుల కేసులో ఊహించని మలుపు



సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో) మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నిరాధార ఆరోపణలతో తనను వేధిస్తున్నారని కథానాయిక అనుపమా పరమేశ్వరన్ కొన్ని రోజుల క్రితం కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. ఎవరో ఆకతాయిలు, పోకిరీ వ్యక్తులు అనుపమను వేధిస్తున్నారని భావించారు. అయితే ఆమెపై వేధింపులకు పాల్పడింది అబ్బాయిలు కాదు, ఓ 20 ఏళ్ల యువతి అని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమిళనాడుకు చెందిన నిందితురాలు పలు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకొని, అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు తేలింది. నిందితురాలు పిన్న వయస్కురాలు కావడంతో ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి వివరాలను బహిర్గతం చేయదలుచుకోలేదు అని అనుపమ తెలిపారు. అయితే ఈ కేసులో చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. సైబర్ వేధింపులు శిక్షార్హమైన నేరం, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అనుపమ కోరారు.

చిరంజీవిని క్షమాపణలు కోరిన రామ్ గోపాల్





తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఆయన్ను క్షమాపణలు కోరారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఈనెల 14న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో సందేశంలో చిత్ర బృందాన్ని అభినందించారు. "శివ' సినిమా చూసి నేను ఆశ్చర్యపోయా. అది సినిమా కాదు ఓ విప్లవం, తెలుగు సినిమాకి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం మంచి విషయం. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని చిరంజీవి అన్నారు. ఈ వీడియోను ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'థాంక్స్ చిరంజీవి గారు.. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నా. విశాల హృదయంతో మా చిత్ర బృందాన్ని అభినందించినందుకు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. గతంలో పలు సందర్భాల్లో మెగా బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు రామ్ గోపాల్ వర్మ.

ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా...



'మసూద' ఫేమ్ తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఓ చిత్రం ఆదివారం ప్రారంభమైంది. భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఓ హిలేరియస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ అన్నారు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈనెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. అతి త్వరలోనే పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీవరప్రసాద్, సినిమాటోగ్రఫీ: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచి రాజు.

వినోదం... విజ్ఞానం



వనాలను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, నాగదుర్గ ప్రధాన తారాగణం. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మించారు. ఇటీవలె చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈనెల 21న 'కలివి వనం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.వినోదంతో పాటు విజ్ఞానాన్ని ఇచ్చే చిత్రమిదని దర్శకుడు తెలిపారు.



మేఘాలయలో చిత్రీకరణ

- వేణు దోనేపూడి

'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాజా రవీంద్ర, విస్మయ్, టిన్ను ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా గుణ మాచికంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. మేఘాలయలో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో టీమ్‌ను కలసిన మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఓ సినిమా పూర్తి షూటింగ్ మేఘాలయాలోనే జరగడం ఇదే ప్రథమం. ఒక్క రోజులో ఆరుగురు వ్యక్తుల మధ్య జరిగే ఆసక్తిరమైన క్రైమ్ కామెడీ ఇది. ఎప్పుడూ వర్షం పడుతూ ఉండే ఈ ప్రాంతంలో షూటింగ్ అంత సులువు కాదు. అయినా అన్ని సవాళ్లు స్వీకరించి ముందుకు సాగుతున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో ఉపేంద్ర లిమియే, జార్జ్ మరియన్, రాజా అక్షయ్ లఘుసాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాలుగు యుగాల నేపథ్యంలో



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'నాలుగు యుగాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేమ, పునర్జన్మ, పురాణ గాథలను స్పృశిస్తూ సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగు హక్కులను నిర్మాతలు కే. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి దక్కించుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విలియం జే, సంగీతం: జుడా శాండి.

గొప్ప అనుభూతినిచ్చేలా..



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా హరీశ్ రెడ్డి ఉప్పల తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు హరీశ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇందులోని అన్ని క్యారెక్టర్లతో మీరు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ "జిగ్రీస్' ఒక కల్ట్ సినిమాగా ఉండబోతుంది. వినోదంతోపాటు భావోద్వేగాలూ ఉంటాయి' అని తెలిపారు.

కొత్త చిత్రం ప్రారంభం



త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా దర్శకుడు కే.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో 'ఇరువురు భామల కౌగిలి'లో అనే కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ బేనర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా దర్శకుడు బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేశారు.

స్పోర్ట్స్

గుంటూరు ● సోమవారం 10 నవంబరు 2025

దక్షిణాఫ్రికా-ఎ రికార్డు విజయం

- 417 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన సఫారీలు
- 5 వికెట్లతో భారత్-ఎపై గెలుపు



సిరాజ్

బెంగళూరు: రెగ్యులర్ టెస్ట్ బౌలర్లు సిరాజ్, ఆకాశ్ దీప్, కుల్దీప్ ఏమాత్రం ప్రభావం చూపలేక పోవడంతో.. 'ఎ' జట్ల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా-ఎ 417 పరుగుల అత్యధిక లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ జోర్డాన్ హెర్మన్ (91), సెనోక్వెనె (77), హమ్జా (77), బవుమా (59), కానర్ (52 నాటౌట్) అదరగొట్టడంతో సౌతాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్-ఎపై చిర స్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. భారీ ఛేదనలో ఆటకు నాలుగో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 25/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా 417/5 స్కోరు చేసి గెలిచింది. భారత్ 255, 382/7 డిక్లేర్ చేయగా.. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221రన్స్‌కు ఆలౌటైంది.

1 'ఎ' టీమ్‌ల క్రికెట్‌లో అత్యధిక లక్ష్యం (417 పరుగులు) ఛేధించిన జట్టుగా సౌతాఫ్రికా. ఈ సీజన్‌లోనే ఆస్ట్రేలియా-ఎపై భారత్-ఎ 413/5 రికార్డు ఛేదనను సఫారీలు అధిగమించారు.

సిరాజ్‌కు గాయం..: దక్షిణాఫ్రికాతో టెస్టులకు ఎంపికైన పేసర్ సిరాజ్ ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా వేలికి బంతి బలంగా తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిల్లాడుతూ మైదానాన్ని వీడాడు. ధ్రువ్ జురెల్ వేలికి కూడా గాయమైంది.

ఆంధ్ర 177

- 1 ● రషీద్ అర్ధ శతకం
- ● తమిళనాడు 102/3

విశాఖపట్నం (స్పోర్ట్స్): బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకొంది. గ్రూప్-ఎలో తమిళనాడుతో రంజీ మ్యాచ్‌లో ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 20/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 177 పరుగులకు కుప్పకూలింది. రషీద్ (87 నాటౌట్), సౌరభ్ కుమార్ (30) రాణించారు. సందీప్ వారియర్ 4 వికెట్లు పడగొట్టాడు. తమిళనాడు తొలి ఇన్నింగ్స్ స్కోరు 182కు ఆంధ్ర 5 పరుగులతో వెనుకంజలో నిలిచింది. అనంతరం తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 102/3 స్కోరు చేసింది. ప్రదోష్ రంజన్ (26), సాయి కిశోర్ (0) క్రీజులో ఉన్నారు. బాల సుబ్రమణియం (51) అర్ధ శతకం సాధించాడు. నారాయణ్ (0)ను పృథ్వీ రాజ్ డకౌట్ చేయగా.. విమల్ కుమార్ (20)ను రాజు వెనక్కిపంపాడు.

డిసెంబరు 15న ఐపీఎల్ వేలం?

ముంబై: వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్ కోసం డిసెంబరు 15న క్రికెటర్ల మినీ వేలం జరిగే అవకాశం ఉంది. గత రెండు పర్యాయాలు ఈ ప్రక్రియ దుబాయ్, సౌదీ అరేబియాల్లో జరిగిన విషయం తెలిసిందే. కానీ ఈసారి మాత్రం స్వదేశంలోనే వేలాన్ని నిర్వహించాలనుకుంటున్నారు. ఈ విషయమై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అలాగే ఏ జట్టు ఎవరెవరిని అట్టిపెట్టుకోనుందనే వివరాలను ఈనెల 15లోగా వెల్లడించాల్సి ఉంది.



జొకో @ 101

ఏటీపీలో నొవాక్ ఘనత

'హెలినిక్' ట్రోఫీ సొంతం

ఏథెన్స్ : సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో ఘనత సాధించాడు. కెరీర్‌లో 101వ ఏటీపీ సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఉత్కంఠ భరితంగా జరిగిన హెలినిక్ చాంపియన్‌షిప్ ఫైనల్లో జొకో 4-6, 6-3, 7-5తో లొరెంజో ముసెటి (ఇటలీ)ని ఓడించి విజేతగా నిలిచాడు. ఓపెన్ ఎరాలో జొకోకంటే ముందు జిమ్మీ కానర్స్ (109), రోజర్ ఫెడరర్ (103) ఏటీపీ సింగిల్స్ టైటిళ్ల సెంచరీ కొట్టారు. అంతేకాదు..38 ఏళ్ల జొకో హార్డ్‌కోర్టులపై 72వ సింగిల్స్ టైటిల్‌తో మరో రికార్డునూ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈక్రమంలో రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) పేరిట 71 సింగిల్స్ టైటిళ్లతో ఉన్న రికార్డును నొవాక్ బద్దలుగొట్టాడు. కాగా.. వరుసగా రెండో సంవత్సరమూ సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్ నుంచి జొకోవిచ్ వైదొలిగాడు. భుజం గాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు నొవాక్ ప్రకటించాడు. పురుషుల విభాగంలో టాప్-8 ఎనిమిది మంది ఏటీపీ ఫైనల్స్‌లో తలపడుతున్నారు.

పారా షట్లర్ల పసిడి మోత

షిరుఘొకా (జపాన్) : భారత పారా బ్యాడ్మింటన్ స్టార్లు ప్రమోద్ భగత్, కృష్ణ నాగర్, సుకాంత్ కదమ్..జపాన్ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టారు. ఈ ముగ్గురు షట్లర్లు అరడజను స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. భగత్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణాలతో మెరిశాడు. టోక్యో పారాలింపిక్స్ చాంపియన్ కృష్ణ నాగర్ (ఎస్‌హెచ్ 6) సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. ఇక..సుకాంత్ కదమ్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణం, సింగిల్స్‌లో రజత పతకం సాధించాడు. అలాగే మహిళల విభాగంలో మన్‌దీప్ కౌర్ స్వర్ణం, నీరజ్ కాంస్య పతకం అందుకున్నారు. ఇంకా..మాన్సీ జోషి, మురుగేశన్ మహిళల డబుల్స్‌లో పసిడి పతకం నెగ్గారు.

జురెల్‌కు బెర్త్ ఖరారే



నితీశ్



జురెల్

నితీశ్ చోటుకు ఎసరు

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌ను చాటుకున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికార టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌లోనూ అజేయ శతకాలతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈనెల 14 నుంచి జరిగే తొలి టెస్టులో అతడికి తుది జట్టులో చోటు ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. గతంలో పంత్ గాయం కారణంగా ఇంగ్లండ్ పర్యటనలో ఐదో టెస్టు, విండీస్‌తో రెండు టెస్టులకు జురెల్ ప్రధాన కీపర్‌గా వ్యవహరించాడు. అయితే పంత్ ఇప్పుడు గాయం నుంచి కోలుకుని టెస్టు జట్టులో వైస్‌కెప్టెన్ హోదాలో ఉన్నాడు. కాబట్టి కీపర్‌గా పంత్ కొనసాగడం ఖాయమే. అయితే ఫామ్‌లో ఉన్న జురెల్‌ను ఎక్కడ ఆడించాలనేది కోచ్ గంభీర్‌కు సవాల్ కానుంది. దేశవాళీ సీజన్ ఆరంభమైనప్పటి నుంచి అతడి చివరి 8 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో 631 రన్స్ సాధించాడు. ఈనేపథ్యంలో జురెల్‌ను బెంచీకే పరిమితం చేస్తే విమర్శలు తప్పవు.

ఎవరి స్థానానికి ఎసరు?

తొలి టెస్టులో జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దించితే ఎవరి స్థానంలో ఆడతాడనేది చర్చనీయాంశమవుతోంది. ఇందుకు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అయితే చివరి టెస్టులో సాయి హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక మిగిలింది నితీశ్ కుమార్ చోటే. స్వదేశీ పిచ్‌లపై అతడి బౌలింగ్ జట్టుకు పెద్దగా అవసరం పడకపోవచ్చు. అలాగే జురెల్ ఫామ్‌తో పోలిస్తే నితీశ్‌ను తుది జట్టులోకి తీసుకుని ఆడించడం కష్టమే. దీనికి తోడు నితీశ్ గతనెలలో విండీస్‌తో జరిగిన తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ వేశాడు. ఇక రెండో టెస్టులో బ్యాటింగ్‌లో 43 పరుగులు చేసినా.. ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నితీశ్ స్థానంలో జురెల్‌ను ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఒకవేళ అదే జరిగితే 1986లో కిరణ్ మోరే, చంద్రకాంత్ పండిట్‌ల తర్వాత భారత తుది జట్టులో ఇద్దరు స్పెషలిస్ట్ కీపర్లు బరిలోకి దిగినట్టవుతుంది.

ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి?

రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' విధించిన 417 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 'ఎ' ఛేదించడం భారత టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆలోచనలో పడేసింది. సిరాజ్, ఆకాశ్, ప్రసిద్ధ్, కుల్దీప్‌లాంటి బౌలర్లను దీటుగా ఎదుర్కొని భారీ ఛేదనను పూర్తి చేయడంతో బౌలింగ్ లైనప్‌పై కోచ్ దృష్టి సారించాడు. ప్రధాన పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌లు ఆడడం దాదాపు ఖాయమే. ఇక బ్యాటర్‌గా జురెల్‌ను తీసుకుంటే ముగ్గురు స్పిన్నర్లు జడేజా, సుందర్, కుల్దీప్ తుది జట్టులో ఉంటారు.

8 బంతుల్లో 8 సిక్సర్లు

11 బంతుల్లో హాఫ్ సెంచరీ

మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

అరుణాచల్‌తో రంజీ ప్లేట్ మ్యాచ్



ఆకాశ్

సూరత్: ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు బాదితే అద్భుతమనుకున్నాం. కానీ మేఘాలయ క్రికెటర్ ఆకాశ్ చౌధరి అంతకు మించి అన్నట్టుగా.. వరుసగా 8 బంతుల్లోనూ సిక్సర్లు బాది వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అతడి దూకుడైన ఆటతీరుకు 11 బంతుల్లోనే వేగవంతమైన హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. దీంతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకేసారి రెండు రికార్డులను నమోదు చేసిన బ్యాటరయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఆకాశ్ మొత్తం 14 బంతుల్లో 8 సిక్సర్లతో 50 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు. గతంలో 12 బంతుల్లో లెస్టర్‌షైర్ ఆటగాడు వేన్ వైట్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించాడు. అరుణాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ప్లేట్ మ్యాచ్ రెండో రోజు ఆదివారం ఆటలో ఆకాశ్ ఎనిమిదో నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగాడు. స్పిన్నర్ లిమార్ దాబి వేసిన ఓవర్‌లో ఆరు సిక్సర్లు బాదగా, ఆ తర్వాత ఓవర్‌లోనూ తొలి రెండు బంతులను బౌండరీకి దాటించి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 628/6 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది. అటు అరుణాచల్ ప్రదేశ్ 73 పరుగులకే ఆలౌటై.. ఫాలోఆన్‌లోనూ 29/3 స్కోరుతో ఓటమి వైపు పయనిస్తోంది.

ఎవరీ ఆకాశ్?: 2019లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల ఆకాశ్ ఈ మ్యాచ్‌కు ముందు 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 14.37 సగటుతో 503 పరుగులు సాధించగా, ఇందులో రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే ఉన్నాయి. పేసర్‌గా రాణించే తను 87 వికెట్లు పడగొట్టాడు. అయితే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో గతంలో సోబర్స్, రవిశాస్త్రి మాత్రమే ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల ఫీట్‌ను సాధించారు.

ఏసీఏ కార్యాలయం తిరిగి విజయవాడకు..

వైసీపీ హయాంలో విశాఖకు తరలింపు

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రధాన కార్యాలయం తిరిగి విజయవాడ రానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సంఘ ప్రతినిధులు ఇప్పటికే పూర్తిచేసినట్టు సమాచారం. విజయవాడలోని పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రామలింగేశ్వర నగర్‌కు వెళ్లే కృష్ణవేణి రోడ్డులో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. 1954లో ఏసీఏ రిజిస్టర్ అయ్యింది. అప్పట్లోనే రిజిస్టర్డ్ కార్యాలయాన్ని గుంటూరులో, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని విజయవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేశారు. ఆరేళ్ల క్రితం వరకు ఈ ప్రాంతాల్లోనే రెండు కార్యాలయాలూ కొనసాగాయి. 2019లో గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన మూడు రాజధానుల పిలుపుతో మొట్టమొదటిగా ఏసీఏ కార్యాలయాన్ని విశాఖకు తీసుకెళ్లారు. రాజధానికి ఈ కార్యాలయం దూరం కావడంతో క్రికెటర్లు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తిరిగి విజయవాడకు తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది.



అనీష్‌కు రజతం

వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్స్

కైరో (ఈజిప్ట్): వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్ అనీష్ భన్వాల్ రజతం సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో అనీష్ మొత్తం 28 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. బెస్సాగ్వెట్ (ఫ్రాన్స్) స్వర్ణం.. హొరోడైనెట్స్ (ఉక్రెయిన్) కాంస్యం దక్కించుకొన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో 25మీటర్ల ర్యాపిడ్‌ఫైర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా అనీష్ రికార్డుల్లోకి ఎక్కాడు. కాగా క్వాలిఫయింగ్ రౌండ్‌లో 585 పాయింట్లతో రెండో స్థానం సొంతం చేసుకొన్న అనీష్ ఫైనల్‌కు అర్హత సాధించాడు.

బిజినెస్

భారత అభివృద్ధి, వ్యూహాత్మక నిధి ఏర్పాటు చేయండి

ప్రభుత్వానికి సీఐఐ సూచన

న్యూఢిల్లీ: భారత్ దీర్ఘకాలిక వృద్ధికి, ఆటుపోట్లు తట్టుకుని నిలబడేందుకు, కీలక ఆర్థిక ప్రయోజనాల సాధనకు అవసరమైన నిధుల కల్పన కోసం భారత అభివృద్ధి, వ్యూహాత్మక నిధిని (ఐడీఎస్ఎఫ్) ఏర్పాటు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వానికి సూచించింది. వృద్ధికి కొత్త శక్తి ఇవ్వడంతో పాటు దేశ భవిష్యత్తుకు భరోసా ఇచ్చేందుకు ఈ నిధి అవసరమని తేల్చి చెప్పింది. క్రమశిక్షణతో రూపకల్పన చేసినట్టయితే రాబోయే రెండు దశాబ్దాల కాలంలో ఈ నిధిలోని మూలధనం 1.3 లక్షల కోట్ల నుంచి 2.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అంచనా. ప్రాథమికంగా కొంత సొమ్ము బడ్జెట్ నుంచి కేటాయిస్తే ఆస్తుల నగదీకరణ ద్వారా సమకూరే సొమ్ముతో నిధిలో మూలధనం పెరుగుతూ వస్తుందని సీఐఐ భావన. ప్రస్తుతం జాతీయ పెట్టుబడులు, మౌలిక వసతుల నిధి (ఎన్ఐఐఎఫ్) అభివృద్ధి నిధిగా వ్యవహరిస్తుందని, తాజాగా ప్రతిపాదిస్తున్న ఈ వ్యూహాత్మక నిధి భారత దీర్ఘకాలిక వృద్ధి, భద్రతా ప్రయోజనాలకు అవసరమైన విదేశీ ఆస్తులను కొనుగోలు చేసి భద్రపరుస్తుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	108	అనంతపురం	110
గోదావరి	106		

25,200 దిగువన బేరిష్

(నవంబరు 10-14 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,787-25,318 పాయింట్ల మధ్యన కదలాడి 230 పాయింట్ల నష్టంతో 25,497 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,616, 25,191, 25,102, 24,364 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి : 25,800 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,200
నిరోధ స్థాయిలు : 25,700, 25,800, 25,900 (25,600 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 25,300, 25,200, 25,100 (25,400 దిగువన బేరిష్)

అనిశ్చితిలోనే బులియన్ మార్కెట్



ఈ వారం మరింత దిద్దుబాటు!

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో అనిశ్చితి కొనసాగుతోంది. దీంతో ఈ వారం కూడా బంగారం, వెండి ధరల్లో మరింత దిద్దుబాటు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. 'ఈ వారం బులియన్ మార్కెట్ దృష్టి అంతా అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు, రాబోయే పరపతి విధానంపై అమెరికా ఫెడ్ రిజర్వ్ అధికారుల వ్యాఖ్యలు, కీలక ఆర్థిక విషయాలకు సంబంధించి చైనా విడుదల చేసే గణాంకాలపై ఉంటుంది. కాబట్టి ఈ వారం పసిడి ధర కొద్దిగా స్థిరీకరణ లేదా మరింత దిదుబాటుకు లోనయ్యే అవకాశం ఉంది' అని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ అండ్ కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మెర్ చెప్పారు. గత నెలలో ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 క్యారట్స్) బంగారం ధర 10 శాతం మేర నష్టపోయింది. ప్రస్తుత అనిశ్చితి నేపథ్యంలో ఈ వారం కూడా పసిడి ధర మరింత దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ అంచనాతోనే రిటైల్ కొనుగోలుదారులు కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు.

ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ అదే ట్రెండ్

ఫ్యూచర్స్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు డౌన్‌ట్రెండ్‌లో కనిపిస్తున్నాయి. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ధర గత వారం రూ.1,17,000-1,22,000 మధ్య ట్రేడైంది. చివరికి శుక్రవారం రూ.165 నష్టంతో రూ.1,21,067 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ 'కామెక్స్'లో మాత్రం డిసెంబరులో డెలివరీ ఇచ్చే ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర గత వారం 13.3 డాలర్ల లాభంతో 4,009.8 డాలర్ల వద్ద ముగిసింది. ప్రస్తుతం అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్స్ పసిడి ధర 4,000 డాలర్లకు కొద్దిగా అటుఇటుగా ట్రేడవుతోంది. ఎంసీఎక్స్‌లో డిసెంబరులో డెలివరీ ఇచ్చే కిలో వెండి ధర గత వారం రూ.559 నష్టపోయి రూ.1,47,728 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లో కిలో వెండి ధర రూ.1.5 లక్షలోపు ట్రేడ్ అయినంత వరకు రూ.1,39,300-1,38,000 స్థాయిలను కీలక మద్దతు ధరగా చూడాలని ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ చెప్పారు.

తదుపరి నిరోధం 25,800

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,300 స్థాయి వరకు దిగజారినా శుక్రవారం ఇంట్రాడే రికవరీ సాధించి 160 పాయింట్ల మేరకు కోలుకుని 25,490 వద్ద ముగిసింది. ముందు వారంతో పోల్చితే 230 పాయింట్లు నష్టపోయింది. నాలుగు వారాల పాటు సాగిన ర్యాలీలో 1,500 పాయింట్ల మేరకు లాభపడిన నిఫ్టీ ప్రస్తుతం టెక్నికల్ కరెక్షన్‌లో ఉంది. జీవితకాల గరిష్ఠ స్థాయి 26,000 వద్ద బలమైన రియాక్షన్లు ఏర్పడుతూ ఉండడం ఇక్కడ గట్టి నిరోధం ఎదురవుతోందనేందుకు సంకేతం. ఈ కారణంగా స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగే ఆస్కారం ఉంది. గత శుక్రవారం నాటి అమెరికన్ మార్కెట్ ధోరణి ఆధారంగా నిఫ్టీ ప్రస్తుతం టెక్నికల్ రికవరీ సాధించవచ్చు. గత రెండు వారాల కాలంలో గరిష్ఠ స్థాయిల నుంచి 700 పాయింట్ల మేరకు నష్టపోయినందు వల్ల కూడా రికవరీ అవకాశాలున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 25,650 వద్ద నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,800. ఇక్కడ నిలదొక్కుకున్నప్పుడే అప్‌ట్రెండ్‌లో మరింతగా పురోగమిస్తుంది. ఆ పైన మరో ప్రధాన నిరోధం 26,100.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 25,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,300 వద్ద రికవరీ అవకాశాలున్నాయి. ఇక్కడ కూడా విఫలమైతే మరింతగా బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 25,000.

బ్యాంక్ నిఫ్టీ: ప్రారంభ డౌన్‌ట్రెండ్ అనంతరం 320 పాయింట్ల మేరకు రికవరీ సాధించి జీవిత కాల గరిష్ఠ స్థాయిల వద్ద నిలకడగా క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రస్తుత గరిష్ఠ స్థాయి 58,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 58,600. రియాక్షన్‌కు గురైనా భద్రత కోసం మద్దతు స్థాయి 57,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: వీక్లీ చార్టుల్లో గత వారం బ్రేక్‌డౌన్ పాటర్న్ ఏర్పడింది. స్వల్పకాలిక బలహీనత మరింత కొనసాగవచ్చుననేందుకు ఇది సంకేతం. నిఫ్టీ ప్రస్తుతం 50 డిఎంఎ వద్ద ఉంది. ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 25,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిఫ్టీకి మద్దతు ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	25,590, 25,650
మద్దతు:	25,450, 25,360

రూ. 5,000 కోట్లతో విశాఖలో అధునాతన ప్లాంట్

లారస్ ల్యాబ్స్

హైదరాబాద్: లారస్ లేబొరేటరీస్.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద రూ.5,000 కోట్ల పెట్టుబడితో ఒక అత్యాధునిక భారీ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే 532 ఎకరాలు కేటాయించిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ చావా సత్యనారాయణ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసే ఈ భారీ యూనిట్‌ను వచ్చే ఎనిమిదేళ్లలో పూర్తి చేయనున్నట్లు ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ కాల్‌లో ఆయన వెల్లడించారు. అవసరమైతే ఈ ప్లాంట్ కోసం మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కాగా మైసూరులో ఏర్పాటు చేయతలపెట్టిన భారీ ఫెర్మెంటేషన్ యూనిట్‌ను కూడా విశాఖకు తరలిస్తున్నట్టు సత్యనారాయణ వెల్లడించారు.

వచ్చే ఏడాది ఐపీఓకి ర్యాపిడో

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ ర్యాపిడో పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చేందుకు రెడీ అవుతోంది. వచ్చే ఏడాది చివరికల్లా ఇందుకు అవసరమైన కసరత్తు ప్రారంభమవుతుందని సంస్థ సహ వ్యవస్థాపకులు అరవింద్ చెప్పారు. ఐపీఓకు వెళ్లే ముందు కూడా ఏటా 100 శాతానికంటే ఎక్కువ వృద్ధి రేటు నమోదు చేస్తూ తమ సమీప పోటీదారుల కంటే ముందు ఉంటామన్నారు. గత రెండేళ్లుగా ర్యాపిడో ఏటా 100 శాతానికిపైగా వృద్ధి రేటు నమోదు చేస్తోంది.

మళ్లీ ఎఫ్‌పీఐల అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాల పోటు ప్రారంభమైంది. గత నెల రూ.14,610 కోట్ల నికర కొనుగోళ్లు జరిపిన ఎఫ్‌పీఐలు ఈ నెలలో ఇప్పటి వరకు రూ.12,569 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు దేశీయ స్టాక్ మార్కెట్లో ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.1.5 లక్షల కోట్లకు చేరాయి.

పుల్‌బ్యాక్‌కు అవకాశం..!

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఈ వారం పుల్‌బ్యాక్ సూచనలు కనిపిస్తున్నాయి. గత వారం లాభాలు స్వీకరించిన ఇన్వెస్టర్లు ఈ వారం కొనుగోళ్లకు దిగే ఆస్కారం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే పెరగటం ఖాయం. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, చమురు, మెటల్, ఇన్‌ఫ్రా రంగ షేర్లు జోరు ప్రదర్శిస్తున్నాయి. కంపెనీల ఫలితాలను బట్టి మదుపరులు షేర్లను ఎంపిక చేసుకోవటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరుకు రూ.600 శ్రేణిలో మద్దతు లభించింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.615 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.610లో పొజిషన్ తీసుకుని రూ.655/675 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.595 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వోల్టాస్: ఏడాది కాలంగా పతనమవుతూ వస్తున్న ఈ కౌంటర్ ప్రస్తుతం ట్రెండ్ రివర్సల్ బాటలో ఉంది. కీలకమైన రూ.1,350 స్థాయిలో కదలాడుతోంది. గత శుక్రవారం రూ.1,321 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,300 ఎగువన ప్రవేశించి రూ.1,450/1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,275.

టాటా స్టీల్: ఈ ఏడాది ఆరంభం నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం రెండేళ్ల నాటి గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసింది. స్వల్పంగా హెడ్‌లైన్ సప్లయ్ రావటంతో పుల్‌బ్యాక్ అయ్యింది. మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటిస్తుందన్న అంచనాలు, మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ నేపథ్యంలో ఈ కౌంటర్‌పై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.181 వద్ద ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.180 స్థాయిలో ప్రవేశించి రూ.220 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.175.

ఆదిత్య బిర్లా క్యాపిటల్: ఈ ఏడాది మార్చి నుంచి ఈ కౌంటర్ దాదాపుగా 130 శాతానికి పైగా పెరిగింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ చాలా బాగుంది. గత శుక్రవారం రూ.338 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.330 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.390/410 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.312.

బజాజ్ ఫైనాన్స్: రెండేళ్ల బేస్ బ్రేకౌట్ తర్వాత ఈ షేరు సుదీర్ఘ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ఫలితాల నేపథ్యంలో మూమెంటమ్ పెరిగింది. గత శుక్రవారం రూ.1,066 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ1,010.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

2027 మార్చి కల్లా పునర్ వ్యవస్థీకరణ పూర్తి

అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ తన వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ వేగం పెంచింది. 2027 మార్చి నాటికి ఈ కార్యక్రమం పూర్తవుతుందని కంపెనీ సీఎఫ్ఓ కృష్ణన్ అఖిలేశ్వరన్ చెప్పారు. ఈ పునర్ వ్యవస్థీకరణ ద్వారా కంపెనీ తన ఫార్మసీ, డిజిటల్ వ్యాపారాలను ప్రత్యేక కంపెనీలుగా విభజించి.. ఆ కంపెనీలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఇందుకు సెబీతో సహా ఇతర రెగ్యులేటరీ సంస్థల అనుమతులు అవసరం. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి కల్లా ఇవన్నీ పూర్తవుతాయని భావిస్తున్నట్టు అఖిలేశ్వరన్ తెలిపారు.

- కోటక్ మహీంద్రా ఏఎంసీ.. కోటక్ రూరల్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించింది. రూరల్, అలైడ్ థీమ్‌తో రూపొందించిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్‌కు నిఫ్టీ రూరల్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో అయితే రూ.500. ముగింపు తేదీ ఈ నెల 20.

'ఓ చిన్ని పిచ్చుక... చిన్నారి పిచ్చుక... రావమ్మా నీ ఇంటికి'- ఈ గీతం ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో మారుమోగుతోంది. జిల్లా కలెక్టర్ **పమేలా సత్పతి** ఆలపించిన ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిన్నారులు, మహిళల కోసం ఈ గీతానికి రూపకల్పన చేసిన పమేలా చేపడుతున్న పలు కార్యక్రమాలు సర్వత్రా ప్రశంసలు పొందుతున్నాయి.



పాటతో మేలుకొలుపు

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలోని సునాబెడాలో పమేలా సత్పతి పుట్టి పెరిగారు. ఆమె డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధికారి ఆర్.కె.సత్పతి కుమార్తె. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసి, ఇన్ఫోసిస్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పొందిన పమేలా... ఆ తరువాత 2015లో సివిల్స్ ద్వారా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. భద్రాచలం సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అక్కడ ఆమె 19 నెలలు పని చేశాక, భద్రాచలం ఈవోగా, అనంతరం భూసేకరణ విభాగంలో విధులు నిర్వర్తించారు. 2019 డిసెంబర్‌లో వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం యాదాద్రి-భువనగిరి కలెక్టర్‌గా ఉన్నారు. 2023లో కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె భర్త దీపాంకర్ వైద్య వృత్తిలో ఉన్నారు.

సమాజంలో అవగాహన కోసం...

'సత్యమేవ జయతే' హిందీ ధారావాహికలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన 'ఓరి చిరయ్యా' అనే పాట పమేలాను ఆకట్టుకుంది. దాన్ని తెలుగులోకి అనువదిస్తే సమాజంలో అవగాహన పెరుగుతుందని ఆమె భావించారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌కు తన ఆలోచనను తెలిపారు. ఆయన 'ఓ చిన్ని పిచ్చుక... చిన్నారి పిచ్చుక' అనే శీర్షికతో ఆ పాటను తెలుగులోకి అనువదించారు. బధిర విద్యార్థుల కోరిక మేరకు పమేలా ఆ పాటను స్వయంగా పాడి వీడియో, ఆడియో ఆల్బంను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలు, అంధులు, దివ్యాంగులతో కలిసి సంతోష్, రాంబాబు అనే ఉద్యోగులు, శర్మ అనే ఉపాధ్యాయుడి సహకారంతో ఆ ఆల్బం రూపకల్పన జరిగింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో దాన్ని ఆవిష్కరించారు. సోషల్ మీడియాలో ఆ పాటకు విశేష ఆదరణ లభించింది. జిల్లా అంతటా ఆ గీతం మారుమోగుతోంది. భ్రూణ హత్యలను నిరసిస్తూ, బాలికా సంరక్షణ, మహిళా సాధికారతను చాటే ఈ పాట సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. .

మహిళలకు అండగా...

మహిళా సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ, విద్యార్థులకు మెరుగైన బోధన కోసం కలెక్టర్ పమేలా పలు కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో... ఆమె ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'శుక్రవారం సభ'కు ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ఈ సభల్లో అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది, ఐసీడీఎస్, సఖీ సెంటర్, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొంటారు. ఈ సందర్భంగా మహిళా ఆరోగ్య మేళా నిర్వహించి 50 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారు. ముఖ్యంగా క్యాన్సర్ స్ర్కీనింగ్ నిర్వహించడంతో పాటు రక్తపోటు, మధుమేహం, రుతుస్రావం తదితర సమస్యలకు దారితీసే కారణాల గురించి, పౌష్టికాహారం ఆవశ్యకత గురించి అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారు. చికిత్సలు కూడా చేయిస్తారు.

అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళల కోసం రూపొందించిన 'పోక్సో' చట్టంపై తదితర అంశాల గురించి వివరిస్తారు. మహిళలు ఎదుర్కొంటున్న కుటుంబ, సామాజిక సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అధికారులు సూచనలు చేస్తారు. ప్రతి శుక్రవారం జిల్లాలో ఏదో ఒక చోట ఈ సభల్లో కలెక్టర్ పాల్గొని అధికారులు, ఉద్యోగులతోపాటు కింది స్థాయి సిబ్బంది, మహిళలు, బాలికల ఇబ్బందులు తెలుసుకుంటారు. మరోవైపు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ఈవీ ఆటో వాహనాల డ్రైవింగ్‌లో పలువురు మహిళలకు శిక్షణ ఇప్పించి, ఆటోల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పించారు.

అందరికీ ఆదర్శం...

ఉన్నతాధికారులు తమకు తమ ఆరోగ్య సమస్యలకు కార్పొరేట్ ఆసుపత్రులకే వెళ్తారనేది సర్వత్రా ఉన్న భావన. కానీ కలెక్టర్ పమేలా... వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికే వెళ్తారు. తనకు ముక్కులో ఇబ్బంది ఏర్పడినప్పుడు ప్రభుత్వాసుపత్రిలో చేరి, శస్త్రచికిత్స చేయించుకున్నారు. వైద్య ఆరోగ్య శిబిరాల్లో కూడా పరీక్షలు చేయించుకుంటూ... ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగేలా చేస్తున్నారు. పిల్లలు, మహిళల ఆరోగ్యంపై గ్రామైక్య సంఘాల సభ్యులకు అవగాహన కలిగిస్తున్నారు. ఆమె సేవలకు 'యూనిసెఫ్' గుర్తింపు సైతం లభించింది. 2022లో భువనగిరి కలెక్టర్‌గా పనిచేసినప్పుడు తన రెండున్నర ఏళ్ల కుమారుడిని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.



విద్యార్థుల కోసం 'బుధవారం బోధన'

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కఠినమైన పాఠ్యాంశాలు బోధించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధవారం అన్ని పాఠశాలల్లో 'బుధవారం బోధన' కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా ప్రారంభించారు. దీనిలో భాగంగా... కఠినమైన పాఠాలను విద్యార్థులతో చదివించి, అవి చక్కగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు సూచనలు ఇస్తారు. ప్రతి విద్యార్థి చేతి రాతను మెరుగుపరచడానికి, కృషి చేస్తారు. పాఠశాలలను కలెక్టర్ సందర్శించినప్పుడు విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేస్తారు. విద్యార్థులతో కలిసి పాఠాలు వినడం, బోధకురాలిగా మారి పాఠాలు చెబుతారు. బాలికలకు రక్షణ కల్పించడానికి 'స్నేహిత క్లబ్'లను ఏర్పాటు చేసి చట్టాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. గత విద్యాసంవత్సరంలో 4,300 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరగా... ఈ ఏడాది ఆ సంఖ్య 7,600కు పెరిగింది.

• గజవాడ ఆంజనేయులు
ఫొటోలు: ఎండీ షుకూర్

తులసి కషాయం తాగితే...

తులసి ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. రోజూ తులసి ఆకులతో కషాయం తయారుచేసుకుని తాగితే పలు అనారోగ్య సమస్యలనుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. తులసి ఆకుల కషాయం అందించే ప్రయోజనాలు...

- తులసి ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో న్యూట్రియెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదం చేస్తాయి. తరచూ తులసి కషాయం తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధులు దరిచేరవు.
- తులసి కషాయంలో ఉండే పోషకాలు.. జీర్ణాశయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తాయి. దీంతో కడుపులో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు రావు.
- తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. శ్వాస వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తులసి కషాయం తాగిన వెంటనే శ్లేష్మం, కఫం విసర్జితమవుతాయి. దీంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం లాంటి సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.
- ఉదయాన్నే తులసి కషాయం తాగితే శరీరంలో కార్టిసాల్ స్థాయి తగ్గుతుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. శరీరంలో ఇన్సులిన్ పనితీరు మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.
- తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు అధికంగా ఉంటాయి. వారానికి రెండుసార్లు తులసి కషాయం తాగుతుంటే చర్మవ్యాధులు తొలగిపోతాయి. ముఖంపై మొటిమలు, మచ్చలు మాయమవుతాయి. చర్మం బిగుతుగా, కాంతిమంతంగా మారుతుంది. నోటి పూత, నోటి దుర్వాసన కూడా తగ్గుతాయి.



ఎలా తయారు చేయాలంటే...

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో ఒక గ్లాసు మంచినీళ్లు పోయాలి. ఆపైన ఏడు తులసి ఆకులు, చిన్న అల్లం ముక్క, నాలుగు మిరియాలు, చిన్న దాల్చిన చెక్క వేసి పది నిమిషాలపాటు బాగా మరిగించాలి. తరువాత ఆ నీటిని వడబోసి చెంచా తేనె కలిపితే తులసి కషాయం తయారవుతుంది. ఇందులో పావుచెంచా లవంగాల పొడి, చిటికెడు పసుపు, చిటికెడు నల్ల ఉప్పు కూడా కలుపుకొని తాగితే అనారోగ్యం దరిచేరదు.

వినూత్నం

ప్రత్యామ్నాయంతో సాధికారత దిశగా!

ఒక అసౌకర్యం... సరికొత్త ఆవిష్కరణకు నాంది పలికింది. ఒక జంటను అనూహ్యంగా పారిశ్రామికవేత్తలను చేసింది. తాన్యా గోయల్... తన భర్తతో కలిసి ఆమె ప్రారంభించిన వ్యాపారం... ఇప్పుడు ఎయిర్‌ప్యూరిఫయర్స్ రంగంలో పెను మార్పులకు కారణమైంది. ఎంతోమంది మహిళలకు జీవనోపాధి కల్పించి... సాధికారత వైపు అడుగులు వేయిస్తోంది. 'ఫోర్బ్స్ 30 అండర్ 30' జాబితాలో చోటు దక్కించుకున్న తాన్యా కథ ఇది.

"దాదాపు నాలుగేళ్ల కిందట... నేను, మావారు కరణ్ బన్సాల్ జైపూర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో ఉండేవాళ్లం. ఆ ఇంట్లో సీలింగ్ బాగా కిందకు ఉండేది. ఆ ఎత్తుకు సరిపడేలా, మంచి గాలి ఇచ్చేలా సీలింగ్ ఫ్యాన్ ఒకటి కొందామని మార్కెట్‌కు వెళ్లాం. ఆన్‌లైన్‌లో వెతికాం. కానీ ఎక్కడా సరైన ఫ్యాన్ కనిపించలేదు. బాగా గాలి రావాలి. సీలింగ్ ఎత్తుకు తగినట్టు ఇమిడిపోవాలి. పొరపాటున చేతులు తగిలినా ప్రమాదం లేకుండా ఉండాలి. అలాంటి ఫ్యాన్ కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాం. బ్లేడ్ లేని ఫ్యాన్సీ ఫ్యాన్లు చూశాం. అయితే సంప్రదాయ బ్లేడ్ గల ఫ్యాన్లతో పోలిస్తే గాలి చాలా తక్కువగా వస్తుంది. మేం గమనించిన మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే... మార్కెట్‌లో లభించే ఫ్యాన్లవల్ల గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ఆందోళనకర స్థాయిల్లో పెరుగుతోందని. మనం సాధారణంగా ఉపయోగించే ఎయిర్ ప్యూరిఫయర్లను గది మూలలో పెట్టడంవల్ల ప్రయోజనం అంతంతమాత్రమేనని అర్థమైంది. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేశాం. సీలింగ్ ఫ్యాన్, ఎయిర్‌ప్యూరిఫయర్లకు సరైన ప్రత్యామ్నాయం కనుగొనాలనే నిర్ణయానికి వచ్చాం. అలా ఆవిర్భవించిందే... 'కార్బన్ ఎన్విరోటెక్'. మా ఈ సంస్థ ద్వారా 'కార్బన్ ఎయిర్‌జోన్' ఒక పరికరాన్ని తీసుకువచ్చాం.



అలా మొదలైంది...

మా ఇద్దరిదీ రాజస్థాన్‌లోని జైపూర్ పట్టణం. నేను 'ఓపీ జిందాల్ గ్లోబల్ లా స్కూల్'లో బీఏ ఎల్ఎల్‌బీ చదివాను. 2019లో 'జియాంగ్ యూనివర్సిటీ' నుంచి మాస్టర్ ఆఫ్ లా పట్టా పొందాను. చదువుకొంటూనే పలు సంస్థల్లోని వివిధ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేశాను. తరువాత కొంత కాలం లీగల్ కన్సల్టెంట్‌గా, జిందాల్ స్కూల్‌లో అసిస్టెంట్ లెక్చరర్‌గా పని చేశాను. కరణ్ ఐఐటీ గువహటిలో మెకానికల్ ఇంజనీరింగ్, అమెరికాలోని పర్డ్యూ యూనివర్సిటీలో ఎంఎస్ చదివాడు. మూడేళ్ల కిందట మా ఇద్దరికీ పరిచయమైంది. మనసులే కాదు, అభిప్రాయాలు కూడా కలవడంతో పెళ్లితో ఒక్కటయ్యాం.



కొలువులు కాదనుకొని...

ఇక మా కంపెనీకి బీజం... ఒక అసౌకర్యం నుంచి మొదలైన ఆలోచన. దాని కోసం మేమిద్దరం ఉద్యోగాలు వదిలేయాలనుకున్నాం. కెరీర్, భవిష్యత్తు పరంగా చూస్తే... మేం తీసుకున్నది సాహసోపేత నిర్ణయం. ఎందుకంటే ఇద్దరివీ ఉన్నత ఉద్యోగాలు. మంచి సంపాదన. అన్నీ వదిలేసి 2021లో 'కార్బన్ ఎన్విరోటెక్ ప్రైవేట్ లిమిటెడ్'ను స్థాపించాం. ఎన్నో అధ్యయనాలు, పరిశోధనల తరువాత 'కార్బన్ ఎయిర్‌జోన్' పరికరాన్ని అభివృద్ధి చేశాం. 2023లో దీన్ని అందుబాటులోకి తెచ్చాం. ఇది ఫ్యాన్‌లా, గాలిని శుభ్రపరిచే యంత్రంలా, గది అంతా కాంతినిచ్చే లైట్‌లా ఉపయోగపడుతుంది. అంటే అన్నీ ఒకే పరికరంలో ఇమిడివుంటాయి.

ఎక్కడైనా అమరిపోతుంది...

ఇల్లు, కార్యాలయాల్లో ఎక్కడైనా అమర్చుకోవచ్చు. చూడ్డానికి కూడా చాలా అందంగా ఉంటుంది. మార్కెట్‌లో లభించి సంప్రదాయ ఫ్యాన్లు, ఎయిర్‌ప్యూరిఫయర్లతో పోలిస్తే ఇది ఎన్నో రెట్లు మెరుగైనదని కచ్చితంగా చెప్పగలం. అన్నిరకాల సీలింగ్‌లకూ సరిపోతుంది. ఇందులో సీఎఫ్‌డీ టెక్నాలజీని ఉపయోగించాం. దీనివల్ల ఎయిర్‌ఫ్లో అద్భుతంగా ఉంటుంది. అన్ని మూలలకూ విస్తరిస్తుంది. గాలి నాణ్యతనూ కాపాడుతుంది. ప్రత్యేకించి తక్కువ ఎత్తున్న సీలింగ్‌లకు అమర్చినా భద్రత పరంగా సంకోచించాల్సింది లేదు. ఇటీవలే దీనికి లైటర్ వెర్షన్ అంటే చిన్న గదుల్లో కూడా ఇమిడేలా మరో మోడల్‌ను తీసుకు వచ్చాం. మా సంస్థ ద్వారా ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. అది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

బడా బ్రాండ్లతో కలిసి...

టైటాన్ క్యాపిటల్, ఆల్ ఇన్ క్యాపిటల్, రెయిన్‌మ్యాటర్ తదితర ప్రముఖ సంస్థల నుంచి మా స్టార్టప్‌కు నిధులు సమకూరుతున్నాయి. ఇది మా ఆర్ అండ్ డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)కు ఎంతో దోహదపడుతోంది. మొదటి ఎనిమిది మాసాల్లో వెయ్యికి పైగా ఎయిర్‌జోన్ యూనిట్లు విక్రయించాం. ఇక ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రకటించిన 30 అండర్ 30' 2025 జాబితాలో నాకు చోటు దక్కింది. అది నాకు ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది. నిత్య జీవితంలో అవసరమయ్యే పరికరాలను మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్ఫూర్తిని నాలో నింపింది."

మూగజీవాలకు రక్ష

మంచి ర్యాంకుతో మెడిసిన్‌లో సీటు వస్తే ' ఎవరైనా వెటర్నరీ వైపు చూస్తారా? కానీ డాక్టర్ రాణి మరియా థామస్ కోరి మరీ ఆ కోర్సునే ఎంచుకున్నారు. మూగ జీవాలకు తన జీవితాన్ని అంకితం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేలా వాటి కోసం ఐసీయూ సైతం ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి ఉద్యోగ అవకాశాలు వస్తున్నా... సొంత ఊళ్లోనే హాస్పిటల్ నెలకొల్పి... మన చుట్టూ ఉండే జీవజాతులను రక్షిస్తున్నారు.

"మూగ జీవాల కోసం ప్రత్యేక ఐసీయూ ఏర్పాటు చేస్తున్నానని చెప్పినప్పుడు అందరూ వింతగా చూశారు. 'వాటి కోసం అంత అవసరమా?' అనేది వాళ్ల ఆలోచన. కానీ నాకు మాత్రం అవి కేవలం జంతువులు, పక్షులు మాత్రమే కాదు... నా తోడబుట్టినవారిలా భావిస్తాను. అవే నా ప్రపంచం. కేరళ రాష్ట్రం అలప్పుళ మా స్వస్థలం. చిన్నప్పటి నుంచి నాకు జంతు ప్రేమ ఎక్కువ. మా ఇంట్లో మకావూ ఉండేది. ఎంతో ఇష్టంగా, మా కుటుంబ సభ్యురాలిగా దాన్ని చూసుకొనేవాళ్లం. ఒక రోజు దానికి అస్వస్థత చేసింది. దగ్గర్లోని వెటర్నరీ ఆసుపత్రులకు వెళ్లాను. కానీ ఇలాంటి అరుదైన పక్షులకు సంబంధించి సరైన ఆసుపత్రులు అందుబాటులో లేవని అప్పుడే అర్థమైంది. సాధ్యమైన అన్ని దారుల్లోనూ ప్రయత్నించా. అయినా పెద్దగా ఫలితం కనిపించలేదు. దాన్ని ఎలా బతికించుకోవాలంటే ఇంకా ఏంచేయాలి? ఎక్కడకు వెళ్లాలి? నాకు ఏ మాత్రం అవగాహన లేదు. చివరకు మృత్యువుతో పోరాడిన మకావూ మా కళ్లముందే ఊపిరి వదిలింది. అది మా కుటుంబాన్ని, ముఖ్యంగా నన్ను తీవ్రంగా కలచివేసింది. అంతులేని బాధను మిగిల్చింది. ఆ క్షణమే ఒక నిర్ణయానికి వచ్చాను... ఈ పరిస్థితిలో మార్పు తేవాలని.



మంచి ర్యాంకు వచ్చినా...

ప్రపంచం ఆధునికంగా ఎంత వేగంగా దూసుకుపోతున్నా జంతువుల వైద్యానికి సంబంధించి ఆ స్థాయిలో సేవలు మనకు అందుబాటులో లేవు. ఇదే నన్ను ఆలోచనలో పడేసింది. అందుకే మెడిసిన్‌లో మంచి ర్యాంకు వచ్చినా నేను అందరిలా కాకుండా వెటర్నరీనే కోరుకున్నా. అందుకు మా నాన్న కూడా మద్దతుగా నిలిచారు. ఎందుకంటే అవసరానికి సరిపడా పశువైద్యులు లేరనేది ఆయనకు కూడా అనుభవమే.. పశువైద్యం చదవాలని అనుకున్నప్పుడు... నా భవిష్యత్తు ఏమైపోతుందోనని నాన్న ఆందోళన చెందలేదు. అది నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది. విశేషం ఏమిటంటే... నేను చదివిన కాలేజీలో ఈ కోర్సు తీసుకున్నదీ, లైబ్రరీ నుంచి ఆ పుస్తకాలు తెచ్చుకున్నదీ నేనొక్కదాన్నే.

అబుదాబి వెళ్లి...

వెటర్నరీ మెడిసిన్ పూర్తవగానే హడావుడిగా ప్రాక్టీస్ మొదలుపెట్టలేదు. అందులో మరింత లోతుగా అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో అబుదాబి వెళ్లాను. అక్కడి ఫాల్కన్ హాస్పిటల్‌లో శిక్షణ తీసుకున్నాను. అరుదైన పక్షులకు అక్కడ అంతర్జాతీయ స్థాయి వైద్యం అందుతుంది. ఆ స్థాయి వైద్యాన్ని భారత్‌కు తీసుకురావాలన్న దృఢ సంకల్పంతో తిరిగి వచ్చాను. రాగానే మా పట్టణంలో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఆధునిక హంగులతో 'సారాస్ బర్డ్స్ అండ్ ఎగ్జాటిక్ యానిమల్ హాస్పిటల్' ప్రారంభించాను. అంతేకాదు... ఎక్కడా లేని విధంగా ఐసీయూ ఏర్పాటు చేశాను. ఎండోస్కోపీ, ఎక్స్‌రేతో పాటు గ్రూమింగ్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చాను.

వైద్యం... ఆవాసం

నేడు మా హాస్పిటల్ ఎన్నో మూగ జీవాలకు వైద్యం అందించింది. అత్యవసర సమయాల్లో మెరుగైన చికిత్సలు చేసి, ప్రాణం పోసింది. ముఖ్యంగా అరుదైన పక్షిజాతులకు నేను వైద్యం చేస్తాను. మా పట్టణంలోనే కాదు, దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ మా పశువైద్యశాలకు వస్తారు. వైద్యం ఒక్కటే కాకుండా... ఎన్నో మూగ జీవాలకు మా కేంద్రం చక్కని ఆవాసం కూడా. ప్రస్తుతం దాదాపు వంద కుక్కలు, పిల్లులు, మకావూ తదితర పక్షులు పెరుగుతున్నాయి.



అదే నా జీవితం

ఎప్పుడైతే ఈ వృత్తిని ఎంచుకున్నానో నాటినుంచీ నా జీవితం జంతువులు, పక్షులతోనే మమేకమైంది. వాటితో కలిసి జీవిస్తున్నాను. అందుకే అవి నాకు తోబుట్టువులు లాంటివని చెప్పాను. అవే నా ప్రపంచం కూడా. వివిధ దేశాల నుంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఇస్తాం, రమ్మని ఆహ్వానిస్తున్నారు. నిజమే... అక్కడకు వెళితే దేనికీ లోటు లేకుండా, నా తరువాత రెండు మూడు తరాలకు సరిపడా సంపాదించుకోవచ్చు. ఆనందంగా జీవించవచ్చు. కానీ నా ఆలోచనలు వేరు. నా లక్ష్యం వేరు. నా దృఢ సంకల్పం ఏమిటంటే... భారత్‌లో పశువైద్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలి. ఊపిరి ఉన్నంతవరకు ఈ రంగాన్ని అభివృద్ధి చేయడానికి పాటుపడాలి. మరింతమంది పశువైద్యులు తయారయ్యేలా యువతరంలో స్ఫూర్తి నింపాలి. అంతిమంగా మూగజీవాలకు అత్యుత్తమమైన చికిత్స అందాలి. అప్పటివరకు విశ్రమించేది లేదు."

ఇలా చేస్తే ఊపిరితిత్తులు శుభ్రం

వాతావరణ కాలుష్యం, అపరిశుభ్రమైన పరిసరాలు, అనారోగ్యకరమైన అలవాట్ల వల్ల ఊపిరితిత్తుల్లో రకరకాల సమస్యలు తలెత్తుతుంటాయి. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఊపిరితిత్తులను శుభ్రంచేస్తే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆ చిట్కాలు ఇవే...

- వెల్లకిలా పడుకొని నడుము కింద దిండు పెట్టుకోవాలి. ముక్కుతో వేగంగా శ్వాస పీల్చుకుని నోటితో మెల్లగా వదలాలి. ఇలా పావుగంటసేపు చేస్తే ఊపిరితిత్తుల్లో పేరుకున్న శ్లేష్మం బయటికి వచ్చేస్తుంది. ఇదేవిధంగా ఓ పక్కకు తిరిగి పడుకుని చేసినా ఫలితం కనిపిస్తుంది.
- వెడల్పాటి గిన్నెలో వేడి నీళ్లు పోసి అందులో కొద్దిగా జండు బామ్ లేదా యూకలిప్టస్ ఆయిల్ వేసి ఆవిరి పట్టాలి. ఘాటైన ఆవిరిని పీల్చడం వల్ల ముక్కుదిబ్బడ తొలగిపోయి శ్వాస బాగా ఆడుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని మలినాలు తొలగిపోతాయి.
- రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల ఊపిరితిత్తుల్లోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్‌ను వాడడం మంచిది.
- రోజూ ఉదయాన్నే భస్త్రికా ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తులు పూర్తిగా శుభ్రపడతాయి. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్ చేసినా కూడా శ్వాస కోశ వ్యవస్థ బలోపేతమవుతుంది.



- సాల్మోన్, మాకరెల్ లాంటి చేపలతోపాటు కోడి గుడ్లు, అవకాడో, కివీ, బాదం, గుమ్మడి గింజలు, చియా గింజలు, అల్లం, వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఉదయాన్నే ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో రెండు చెంచాల నిమ్మరసం లేదా అల్లం రసంతోపాటు కొద్దిగా తేనె కలుపుకుని తాగితే ఊపిరితిత్తుల్లో సమస్యలు తలెత్తవు.

కుంకీ ఏనుగుల శిక్షణా కేంద్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



పోటెత్తుతున్న లోటు!

(మొదటి పేజీ తరువాయి)

వేరుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- సెప్టెంబరు నాటికే రెవెన్యూ లోటు రూ.46,652 కోట్లకు చేరింది. రెవెన్యూ వసూళ్లు తగ్గిపోవడం, రెవెన్యూ వ్యయాలను పరిమితం చేయలేకపోవడంతో 'లోటు' ప్రమాదకర స్థాయికి చేరుతోంది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే రెవెన్యూ రాబడులు మరీ తగ్గిపోతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు పెరుగుతున్న ట్రెండ్ ప్రతి నెలా కొనసాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలలు... అంటే ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్ర రెవెన్యూ లోటు రూ.17,686 కోట్లకు చేరినట్టు 'కాగ్' తన నెలవారీ నివేదికల ద్వారా వెల్లడించింది. ఆ సమయంలో రెవెన్యూ రాబడి రూ.21,707 కోట్లు ఉండగా, రెవెన్యూ ఖర్చులు రూ.39,393 కోట్లకు చేరాయి. ఆర్థిక సంవత్సరం మొత్తమ్మీద రెవెన్యూ లోటును రూ.33,185 కోట్లు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ... కేవలం రెండు నెలల్లోనే అది 53 శాతానికి చేరింది. ఆరు నెలలకు 140 శాతానికి చేరుకుంది. ఈ ఆరు నెలల్లో రెవెన్యూ రాబడి రూ.74,234 కోట్లు వచ్చింది. అదే సమయంలో, రెవెన్యూ ఖర్చు రూ.1,20,887 కోట్లకు చేరింది. బడ్జెట్‌లో అంచనా వేసిన ఆదాయంలో వచ్చింది 34 శాతమే కాగా... లోటు మాత్రం అంచనాలకు మించి, 140 శాతానికి చేరింది. ఈ ఆరు నెలల్లో ద్రవ్యలోటు 78 శాతానికి చేరింది. బడ్జెట్‌లో ఏడాదికి గాను రూ.79,926 కోట్లు అంచనా వేయగా సెప్టెంబరు నాటికే అది రూ.62,213 కోట్లకు చేరుకుంది. బడ్జెట్‌లో ఈ ఏడాది జీఎస్టీ వసూళ్లు రూ.57,477 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఆరునెలల్లో... రూ.24,821 కోట్లు వచ్చాయి. అంటే... 43 శాతం! ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,97,929 కోట్ల ఆదాయం అంచనా వేశారు. సెప్టెంబరు నాటికి రూ.1,37,319 కోట్లు వచ్చాయి. ఇందులో అప్పులు రూ.63,052 కోట్లు ఉన్నట్టు కాగ్ నివేదికలో వెల్లడించింది. అదే సమయంలో 11,715 కోట్లు మూలధన వ్యయం చేసినట్టు పేర్కొంది.

ఏం చేయాలి

రెవెన్యూ ఖర్చుల్లో జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, పింఛన్ల వాటానే అత్యధికం! వీటిలో ఏది తగ్గించాలో తెలియని పరిస్థితి. సొంత ఆదాయ మార్గాలు పెంచుకుంటూ... పథకాలకు అనర్హులను ఏరివేయడం, అవసరంలేని పథకాలకు కోతలు వేయడం ద్వారా రెవెన్యూ లోటు కొంతయినా కట్టడి చేయవచ్చు. ఎఫ్ఆర్‌బీఎం చట్టం రెవెన్యూ లోటు 'సున్నా' ఉండాలి. అందుకు అనుగుణంగా కేంద్రం గ్రాంట్లు మంజూరు చేస్తుంది. మూలధన వ్యయం కోసం గరిష్ఠంగా 3శాతం వరకు అప్పులకు అనుమతిస్తుంది. రెవెన్యూ లోటు ఆ మేరకు ఉండొచ్చు. కానీ... అన్ని హద్దులు దాటడం ఆందోళన కలిగిస్తోంది. అనవసర ఖర్చులతో లోటు పెరగడంతో పాటు అప్పుల భారం పెరుగుతుంది. అప్పులకు వడ్డీ చెల్లింపులతో రెవెన్యూ వ్యయం పెరుగుతుంది. ఇదో విషవలయం.. ఇందులో కూరుకుపోతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమవడం ఖాయం.

ఏనుగుల దాడుల నివారణకు 'హనుమాన్'

- ఏనుగుల సంచారంపై ఎప్పటికప్పుడు సమాచారం
- 150 ఏనుగులకు జియో ట్యాగింగ్: పవన్
- చిత్తూరు జిల్లాలో 'కుంకీ' కేంద్రం ప్రారంభం

చిత్తూరు/పలమనేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడవి ఏనుగుల దాడుల నివారణకు అటవీశాఖ రూపొందించిన హనుమాన్ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ ప్రాజెక్టు పోస్టర్‌ను ఆవిష్కరించారు. 11 అంశాలతో కూడిన ఈ ప్రాజెక్టు గురించి అటవీశాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిని ఆసక్తిగా తెలుసుకున్న ఆయన, అటవీ శాఖతో పాటు పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనిపై చర్చించేందుకు ఈ నెల 3వ వారంలో సమీక్ష ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మానవ, వన్య ప్రాణి సంఘర్షణను తగ్గించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న గజ యాప్ స్థానంలో నూతన సాంకేతికతో ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలో ఏనుగులకు రేడియో కాలర్ ఏర్పాటు చేస్తే అత్యధిక ప్రయోజనం ఉంటుందో వాటికే ఏర్పాటు చేయాలని సూచించారు. జంతువుల సంచార సమాచారం ప్రజలకు తెలిసేలా అధునాతన టెక్నాలజీతో కొత్త యాప్‌ను రూపొందించి మార్చి 3లోగా అందుబాటులోకి తేవాలన్నారు. ఏనుగులతో తీవ్రంగా దెబ్బతింటున్న పంటల స్థానంలో ప్రత్యామ్నాయాలు ఎలా.. ఇందుకు రైతుల్ని ఎలా ఒప్పించాలనే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. సర్ప మిత్ర వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు.

20 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపు

మదపుటేనుగుల్ని అడవిలోకి తరిమి కొట్టేందుకు కర్ణాటక నుంచి ఆ మధ్య పవన్ నాలుగు కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 140-150 వరకు ఏనుగులు ఉన్నాయని అధికారులు చెప్పగా.. వాటన్నింటికీ జియో ట్యాగింగ్ చేయాలని పవన్ సూచించారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి, మియావకీ ఫారెస్టు ప్లాంటేషన్, అధునాతన సోలార్ ఫెన్సింగ్ తదితర వాటికి శిలాఫలకాలను ఆవిష్కరించారు.

మియావకీ తరహా ప్లాంటేషన్

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్‌కు పవన్ శ్రీకారం చుట్టారు. 250 చమీ విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేశారు. ఉసిరి మొక్కను నాటి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మీటరుకు ఒకటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్‌ను మొబైల్‌లో వీడియో తీసుకున్నారు.

ఆసక్తిగా కుంకీల విన్యాసాలు

ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగుల ప్రత్యేక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పవన్ ఆసక్తిగా తిలకించి తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసుకున్నారు. ఏనుగులు వరుసగా ఘీంకరిస్తూ పవన్‌కు సెల్యూట్ చేశాయి. వివిధ రకాల కలపను అడవిలో నుంచి ఎలా బయటికి తీసుకొస్తారో కుంకీలతో చేసి చూపించారు. కుంకీ ఏనుగులకు పవన్ ఆహారాన్ని అందించారు. వాటి సంరక్షణ చూసే మావటీలతో ఫొటో తీసుకుని రూ.50 వేలు బహుమతి అందించారు.

మత్తు ఇచ్చే గన్‌తో పవన్

మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ఓ ప్రత్యేకమైన మత్తు ఇచ్చి వాటి కోపాన్ని ఎలా అణచివేస్తారనేది మావటీలు పవన్‌కు చూపించారు. ఈ సందర్భంగా మత్తు ఇచ్చే ఇంజక్షన్ గన్‌ను పట్టుకుని పవన్ ఆసక్తిగా పరిశీలించారు.



గ్రామీణుల చేతికి ఆస్తిహక్కు!

ఆబడి, అనాధీన, ఆక్రమణ భూములపై సర్వే.. హక్కుల కల్పన

- స్థిరాస్తి కార్డుల పంపిణీకి సిద్ధం
- 'స్వామిత్వ'తో తొలగనున్న ఇక్కట్లు
- 5,847 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి
- నేటి నుంచి 2,344 గ్రామాల్లో సభలు

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆస్తి హక్కుల కోసం దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్న గ్రామీణులకు భారీ మేలు జరగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్న స్థిరాస్తుల వివరాలను గాడిలో పెట్టి వాటిపై సంబంధిత వ్యక్తులకు హక్కులు కల్పించే ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. గ్రామాల్లో ప్రభుత్వ లెక్కల్లో లేని ఆబడి, అనాధీన, ఆక్రమణలకు సంబంధించిన ఆస్తులను గుర్తించి.. సంబంధిత హక్కుదారులకు పట్టాలు అందించనుంది. 'స్వామిత్వ' పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఇలాంటి ఆస్తులకు సంబంధించిన వివరాలు సేకరించడంతోపాటు హక్కుదారులకు స్థిరాస్తి కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2020లోనే స్వమిత్వ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో దీనిని 2021 నుంచి అమలులోకి తీసుకువచ్చినా.. గత వైసీపీ ప్రభుత్వం మూడేళ్లలో 1,300 గ్రామాల్లో మాత్రమే ప్రాపర్టీ కార్డులు అందించింది. ప్రస్తుత ప్రభుత్వం 4 నెలల్లోనే 5,847 గ్రామాల్లో సర్వే పూర్తిచేసి ప్రాపర్టీ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. వచ్చే ఏడాది మార్చిలోపు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ హక్కుదారులకు స్థిరాస్తి కార్డులు అందిస్తారు.

నేటి నుంచి గ్రామసభలు

2,344 గ్రామాల్లో సోమవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి ఆస్తుల వివరాలను అధికారులు వెల్లడించనున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొంటారు. ఆస్తులకు సంబంధించి గ్రామీణుల వద్ద ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యంతరాలుంటే నమోదు చేస్తారు. వీటిని వారంలోపు పరిష్కరిస్తారు. పరిష్కారం కానట్లయితే ఫాం-19 ద్వారా అప్పీల్ చేసుకుని రీసర్వే కోసం డిప్యూటీ తహసీల్దార్‌కు పంపిస్తారు. సభకు రాని వారి ఇంటింటికీ వెళ్లి సంతకాలు తీసుకుంటారు. యజమానుల సమాచారం లేనప్పుడు ఇంటి పన్ను వివరాలను యధాతథంగా పరిగణిస్తారు. ఆధార్, మొబైల్ నంబర్, డాక్యుమెంట్లు మొదలైన వివరాలను సేకరించి డిజిటలీకరణ చేస్తారు. సభలో తీర్మానం చేసి గ్రామ సభ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

క్రయ విక్రయాలు సులువు!

గ్రామీణ ప్రాంతాల్లో ఆబడీ, అనాధీన, ఆక్రమిత భూముల్లో దశాబ్దాల తరబడి ఉంటున్న వారికి చట్టబద్ధంగా ఇప్పటి వరకు హక్కులు కల్పించలేదు. దీంతో వారు ఆయా భూములు, ఇళ్లను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందలేని, క్రయ విక్రయాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. పైగా కొన్ని రకాల భూముల విషయంలో వివాదాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఆస్తినీ గుర్తించి, దాని విలువను లెక్కించి.. యజమానికి హక్కులు కల్పించనున్నారు. ఈ ప్రాపర్టీ కార్డుల ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందడమే కాకుండా.. క్రయ విక్రయాలు కూడా చేసుకునే అవకాశం ఏర్పడనుంది. గ్రామాల్లో ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆస్తులను కూడా గుర్తించి ఆయా శాఖలకు వాటిని మ్యాపింగ్ చేస్తారు. స్వామిత్వ పథకానికి కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ నోడల్ మంత్రిత్వ శాఖగా వ్యవహరిస్తోంది. సర్వే ఆఫ్ ఇండియా సాంకేతిక సహకారం అందిస్తోంది.

వివాదాలకు దూరంగా

5,847 గ్రామాల్లో డ్రోన్లు, యజమానులు, ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఆస్తుల వివరాలను సేకరించారు. ఏదైనా కుటుంబానికి డాక్యుమెంట్లు లేకపోయినా.. వారి ఆస్తి గ్రామకంఠంలో 12 ఏళ్ల పాటు వారి ఆధీనంలో ఉన్నట్టు గుర్తిస్తే.. వారికి కూడా యాజమాన్య పత్రాలు అందిస్తారు. వివాదస్పద స్థలాలుంటే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తారు. కోర్టుల్లో వివాదాలుంటే వాటి పరిష్కారం తర్వాతే ప్రాపర్టీ కార్డులు అందజేస్తారు. గ్రామ కంఠం సహా జగనన్న ఇళ్ల కాలనీలకు విస్తరించిన గ్రామ కంఠాలను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. వివాదాలకు దూరంగా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆస్తులతో పాటు పంచాయతీలు, ఉమ్మడి ఆస్తులైన గ్రామీణ రోడ్లు, కుంటలు, కాలువలు, ఖాళీ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉప కేంద్రాలను కూడా సర్వే చేసి జీఐఎస్ మ్యాపులను రూపొందిస్తారు. ఈ మ్యాపులు రాష్ట్ర రికార్డులలో పొందుపరుస్తారు. తర్వాత తుది డిజిటల్ మ్యాప్‌లను కేంద్ర పంచాయతీరాజ్‌శాఖకు కూడా అందిస్తారు.

ఆ చిన్నారిది ఆత్మహత్య కాదు.. హత్య!

- పరిచయస్తుడైన ఎలక్ట్రీషియనే చంపేశాడు



సిర్రా రంజిత

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురంలో బాలిక అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా విలేకరులకు ఈ కేసు వివరాలు వెల్లడించారు. రామచంద్రపురం త్యాగరాజునగర్‌లో బాలిక రంజిత(10) కుటుంబం నివాసం ఉంటోంది. ఆ చిన్నారి స్థానికంగా ఐదో తరగతి చదువుతోంది. తండ్రి సిర్రా రాజు ముంబయిలోని షిప్‌యార్డులో పనిచేస్తుండగా, తల్లి సునీత స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రామచంద్రాపురం మండలం అంబికపల్లి అగ్రహారానికి చెందిన పెయ్యల శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్‌గా వీరి కుటుంబానికి పరిచయమయ్యాడు. బాలిక తల్లిని అక్కా అని పిలిచేవాడు. ఇంటికి వచ్చివెళ్లే క్రమంలో బంగారు ఆభరణాలు, నగదు ఉండడం గమనించాడు. తనకున్న ఆర్థిక బాధలనుంచి గట్టెక్కడానికి వాటిని అపహరించాలని ప్లాన్ వేశాడు. ఈనెల 4న సాయంత్రం 5.20 సమయంలో బాలిక ఇంటికి వెళ్లాడు. అప్పటికే స్కూల్ నుంచి వచ్చిన బాలిక.. ఎందుకొచ్చావని ప్రశ్నించగా, ఫ్యాన్ బాగుచేయడానికని చెప్పాడు. ఫ్యాన్ బాగానే ఉందనికదాని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. దీంతో తాను వచ్చిన విషయం తల్లికి చెప్తుందని భయపడ్డాడు. బాలికను చంపేయాలని నిర్ణయానికొచ్చాడు. అంతే.. ఆ వెంటనే ఓ నల్లని చున్నీని బాలిక మెడకు చుట్టి హత్యచేశాడు. అనుమానం రాకుండా మృతదేహాన్ని ఫ్యాన్‌కు వ్రేలాడదీసి, బయటికి వచ్చి కిటికీలోంచి చేయిపెట్టి లోపల తలుపు లాక్ చేసి వెళ్లిపోయాడు. ఆ రోజు కాకినాడ వెళ్లిన తల్లి.. ఇంటికి వచ్చి ఎంతసేపు తలుపు కొట్టినా స్పందన లేదు. కిటికీలో నుంచి చూడగా లోపల బాలిక ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్టుగా వేలాడుతూ ఉంది. రోదిస్తూ ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి అన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హత్య తర్వాత వెంటే ఉండి..

హత్య జరిగిన రోజు రాత్రి శ్రీనివాస్ బాలిక పాఠశాలకు వెళ్లి సీసీ ఫుటేజీ సేకరించాడు. దీన్ని ఒక వాట్సాప్ గ్రూపులో పెట్టాడు. బాలిక మృతిపై ఒక చానల్‌లో ప్రసారమవుతున్న కథనాన్ని ఖండిస్తూ సోషల్ మిడియాలో ఓ పోస్టింగ్ కూడా పెట్టాడు. సంఘటన జరిగిన తర్వాత రోజు బాలిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ రంజిత తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతుండగా నిందితుడు శ్రీనివాస్ వారి పక్కనే ఉన్నాడు. అయితే, సంఘటన స్థలంలో క్లూస్‌టీం బృందం ఆధారాలు సేకరిస్తుండగా శ్రీనివాస్ అతిగా ప్రవర్తించాడు. అనుమానం వచ్చి అతడి వేలిముద్రలు తీసుకుని పరిశీలించి అతడే హంతకుడని నిర్ధారణకు వచ్చారు. దీంతో ఈనెల 8న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. కాగా, ఈ కేసును ఐదురోజుల్లోనే ఛేదించిన డీఎస్పీ రఘువీర్ బృందాన్ని, క్లూస్ టీమ్‌ను ఎస్పీ అభినందించారు. బాలికను హత్య చేసిన నిందితుడు శ్రీనివాస్ తమకు అప్పుడిలా నటించి.. ముక్కుపచ్చలారని తమ బిడ్డను పొట్టనబెట్టుకున్నాడని, అతడిని ఎన్‌కౌంటర్ చేయాలని బాలిక తల్లిదండ్రులు కోరుతున్నారు.

జుబ్లీహిల్స్‌లో ఓటర్లకు రూ.100 కోట్లు!

హైదరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా మారిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లకు పంపిణీ చేసేందుకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఒక పార్టీ అభ్యర్థి నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓటర్లలో 70 శాతం మందికి నగదు పంపించగా, మరో పార్టీ అభ్యర్థి 50 శాతం మందికే సరిచూసుకుని పంపించినట్లు తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం నుంచే పంపకాలు ప్రారంభించగా.. మరికొన్ని చోట్ల శనివారం నుంచి ముమ్మరం చేశారు. ఒక పార్టీ మొదట్లో ఓటుకు రూ.3 వేలు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరిగినా.. ఓటుకు రూ.2500 చొప్పున ఇచ్చారు. మరో పార్టీ మాత్రం ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేస్తోంది. అదే సమయంలో ఓటుకు రూ.2500 చొప్పున పంపిణీ చేస్తున్న పార్టీ.. తాము బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో రూ.5 వేలు ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. ఓటుకు రూ.1500 చొప్పున పంపిణీ చేస్తున్న పార్టీ తాను బలంగా ఉన్న చోట రూ.వెయ్యి మాత్రమే పంపిణీ చేయటం గమనార్హం. నోట్లతోపాటు ఆడబిడ్డలకు వారి మనసుల్ని దోచుకునే బహుమతుల్ని పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం ఓ పార్టీ లక్ష పట్టుచీరలు తెప్పించినట్లు తెలిసింది. ఇప్పటివరకు 50 వేల చీరలు పంచినట్లు సమాచారం.

ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

వైద్యసాయం అందిస్తామన్నారు. ఆదివారం గుంటూరుకు సమీపాన పెదకాకానిలోని శంకర నేత్రాలయంలో నూతనంగా నిర్మించిన ఐ కేర్ సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. ఆరోగ్య రంగాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో లింకప్ చేసి అవసరమైన అన్నిరకాల వైద్యసేవలు ప్రజలకు ఇంటి వద్దనే అందించే ఆలోచన కూడా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తమ ప్రభుత్వం టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలనే మంచి ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపట్టామని, ఏఎన్ఎం మొదలుకొని స్పెషలిస్టు వైద్యుల వరకు అందరినీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించి ప్రపంచంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని నమ్మకం వ్యక్తంచేశారు.

కంచి కామకోటి పీఠం ఆదర్శవంతం

శంకర నేత్రాలయాల నిర్వహణలో కంచి కామకోటి పీఠం పాత్ర అనిర్వచనీయమని సీఎం అన్నారు. 'సామాన్యులకు నేత్ర వైద్య చికిత్సలు అందించే కార్యక్రమానికి కంచి పీఠం 1975లోనే శ్రీకారం చుట్టింది. వచ్చే సంవత్సరం స్వర్ణోత్సవం జరుపుకోబోతోంది. ఆ కార్యక్రమానికి తప్పక హాజరవతాను. ఈ పీఠం 10 రాష్ట్రాల్లో 14 ఆస్పత్రులు స్థాపించి 30 లక్షల మందికి శస్త్రచికిత్సలు చేయించింది. 70 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించింది. సగటున రోజుకు 50 మందికి ఉచితంగా నేత్రవైద్య శస్త్రచికిత్సలు చేస్తోంది. శంకర నేత్రాలయలో 1986లో కేవలం 14 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. నేడు 2,264కి చేరుకోవడం అభినందనీయం. భారతదేశంతో పాటు నేపాల్, నైజీరియా, కంబోడియాలోనూ ఆస్పత్రులు ఏర్పాటు చేసి అన్ని పీఠాలకు కంచి పీఠం ఆదర్శంగా నిలుస్తోంది. పెదకాకాని నేత్రాలయంలో రోజుకు 2,500 నుంచి 3వేల మంది వైద్యసేవలు పొందుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ సేవలు రెట్టింపవుతాయి. రెయిన్‌బో ప్రోగ్రాం, గిఫ్ట్ ఆఫ్ విజన్ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం. పేదలను ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకురావడం.. వారికి అన్ని రకాల కంటి పరీక్షలు, వైద్యసాయం, శస్త్ర చికిత్సలు చేసి తిరిగి ఇంటికి చేర్చడం అనే కార్యక్రమం మరెక్కడా లేదు' అని కొనియాడారు. కంచి పీఠం చేపట్టబోయే కార్యక్రమాల్లో ఏపీ ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని తెలిపారు.

అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలు

గతంలో తిరుమలలో ఎన్‌టీఆర్ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారని.. అది ఇప్పటికీ కొనసాగుతోందని చంద్రబాబు చెప్పారు. 'నేను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించాను. నాడు శ్రీ వేంకటేశ్వరస్వామి సేవలో పాల్గొనేందుకు వెళ్తుంటే 23 క్లైమోర్ మైన్స్‌ను నక్సలైట్లు పేల్చారు. స్వామి వారే నన్ను కాపాడారు. శ్రీవారి సేవకుల కార్యక్రమాన్ని టీటీడీలో నేను ప్రారంభిస్తే నేడు స్వచ్ఛందంగా వేల మంది తిరుమలకు వచ్చి సేవలందిస్తున్నారు. శ్రీవారి దేవాలయాలను అన్ని రాష్ట్రాల్లో నిర్మిస్తాం. ప్రపంచంలో హిందువులున్న చోట్ల కూడా ఏర్పాటు చేస్తాం. 700 మంది వేద పండితులకు శిక్షణ ఇచ్చి గౌరవవేతనం ఇవ్వబోతున్నాం. కంచి పీఠం చేసే అన్ని కార్యక్రమాలకు అండగా ఉంటా' అని హామీ ఇచ్చారు.



పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించి అందులోని అధునాతన యంత్రాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రతో అనుబంధం: కంచి స్వామి

విద్యార్థులకు మంచి చదువు, రోగులకు నాణ్యమైన వైద్యసాయం, మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సాయం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి తెలిపారు. 'చదువు, బలం, మంచిపేరు, కీర్తి, పుణ్యం అనే సేవలు నిత్యం మేం చేస్తుంటాం. విద్య, సంస్కృతి కలిపి శంకర పాఠశాలలు త్వరలో ప్రారంభించబోతున్నాం' అని ప్రకటించారు. వైద్యం కోసం హిందూ మిషన్ హాస్పిటల్స్ ద్వారా ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామన్నారు. సీఎం సలహా మేరకు ఏఐ టెక్నాలజీ ద్వారా త్వరలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని శంకర 'ఐ' ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ రామనాథన్ వీ రమణి చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు.



ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

2,500 కోట్లతో రోడ్ల టెండర్లు

- త్వరలో మరో వెయ్యి కోట్లతో కూడా..: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఆర్‌డీసీ బోర్డు కొత్త డైరెక్టర్ల ప్రమాణస్వీకారం

అమరావతి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే రూ.2,500 కోట్లతో రహదారి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామన్నారు. త్వరలో మరో రూ.వెయ్యి కోట్లతో రహదారి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ)లో కొత్తగా నియమితులైన 16 మంది డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం ఆర్అండ్‌బీ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆర్‌డీసీ చైర్మన్, సభ్యులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కనీసం రెన్యూవల్ వర్క్‌లు కూడా చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే రూ.1,081 కోట్లతో రహదారులపై గుంతలను పూడ్చేసి, ప్రయాణాలకు అనువుగా మార్చామన్నారు. సమావేశంలో ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఆ సంస్థ ఎండీ, చీఫ్ ఇంజనీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఢిల్లీలో ఒక్కరోజు గాలి పీలిస్తే సగటున 20 సిగరెట్లు తాగిన దానితో సమానం!. అనేక ప్రాంతాలను ఇప్పటికే రెడ్‌జోన్‌లుగా ప్రకటించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వాయు నాణ్యత ప్రమాణాల ప్రకారం 300-400 మధ్య గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ఉంటేనే అత్యంత ప్రమాదకరం. 400-500 మధ్య ఉంటే హానికరమని సంకేతం. ఢిల్లీలో ప్రస్తుతం పది ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటింది. ప్రస్తుత పరిస్థితిని బట్టి ఢిల్లీని గ్యాస్ ఛాంబర్‌గా వ్యాఖ్యానిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు ఇంటి నుంచి బయటికి రావాలని వైద్యులు చెబుతున్నారు. ఢిల్లీలో వాయు కాలుష్యానికి దాని పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను దహనం చేయడమే ప్రధాన కారణం. ఢిల్లీలో వాయు కాలుష్యంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

'ఒక్క చాన్స్' తప్పు మీరు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రెండో విడత ఎన్నికల్లో లోకేశ్ శని, ఆదివారాల్లో ప్రచారం నిర్వహించారు. శనివారం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో, బిహార్ చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాను ఏపీ మంత్రిగా ఇక్కడకు రాలేదని, బాధ్యతాయుతమైన భారతీయుడిగా వచ్చానని చెప్పారు. 'బిహార్లో జరగబోయే ఈ ఎన్నికలు భారత రాజకీయాల్లో ఎంతో కీలకమైనవని తెలిపారు. 'లీడర్‌షిప్ ట్రాక్ రికార్డు.. స్వచ్ఛమైన అవినీతిరహిత పాలన కోసం ఎన్‌డీఏని గెలిపించాలని కోరారు. 'బిహార్, ఏపీలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఉండడం వల్ల కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు లభిస్తున్నాయి. ప్రభుత్వాల కొనసాగింపు చాలా ముఖ్యం.. గుజరాత్, ఒడిసాల్లో ప్రభుత్వాల కొనసాగింపు వల్లే పెద్దఎత్తున అభివృద్ధి సాధించాయి. 'ఏపీలో మా సీఎం ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త నినాదం ప్రకటించారు. అందుకు తగినట్లుగానే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. బిహార్‌లో ఒక పార్టీ ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తామని చెబుతోంది. ఆచరణ సాధ్యం కాని ఈ హామీని నమ్మవద్దు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే భారతజాతి బలోపేతమవుతుంది' అని లోకేశ్ స్పష్టం చేశారు. కేంద్ర విద్యా మంత్రి, బిహార్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేశ్ పట్నాలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గతేడాది హరియాణా, ఒడిసాల్లో బీజేపీ విజయంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు బిహార్‌లో ఎన్‌డీఏ గెలుపు కోసం ఆయన చేస్తున్న నిర్మాణాత్మక కృషిని లోకేశ్ అభినందించారు.

హిందీ ప్రసంగాలతో ఆకట్టుకుని..

ఎన్‌డీఏలో చేరిన తర్వాత రాష్ట్రం వెలుపల లోకేశ్ చేసిన తొలి ఎన్నికల ప్రచారమిది. తన ప్రచారంలో హిందీ, ఇంగ్లిషులో ప్రసంగించి వ్యాపారులను, ఎన్‌డీఏ నేతలు, శ్రేణులను ఆకట్టుకున్నారు. ప్రధానంగా ఏపీలో ఒక్క చాన్స్ పేరుతో 2019-24 నడుమ చేసిన తప్పిదాన్ని ప్రస్తావించారు. ఏపీ, బిహార్‌లో డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్లు ఉండడం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను విశదీకరించారు. ఉచితాలు.. ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం వంటి హామీల్లోని డొల్లతనాన్ని చూపుతూ.. ఏపీలో తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని ఏ విధంగా బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తుందో వివరించారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కారు నినాదం కూటమి ఐక్యతకు బలం చేకూర్చిందని స్థానిక నాయకులు ప్రశంసిస్తున్నారు. దక్షిణ దేశానికి చెందిన బలమైన యువనేతగా ఆయన బిహార్లో ప్రచారం చేయడం, ఎన్‌డీఏ పాన్ ఇండియా నినాదాన్ని నొక్కిచెప్పడం ఓటర్లను బాగా ఆకట్టుకుందని పరిశీలకులు భావిస్తున్నారు. అక్కడి విపక్ష మహాగర్‌బంధన్ ఇస్తున్న హామీలకు భిన్నంగా లోకేశ్ చేసిన అభివృద్ధి ప్రచారం వ్యాపార వర్గాలతోపాటు అభివృద్ధిని కోరుకునే ఓటర్లలో కొంత మార్పు తీసుకొస్తుందని ఎన్‌డీఏ నేతలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

కాగా, లోకేశ్ బిహార్ ప్రచారానికి జాతీయ మీడియాలోనూ విస్తృత కవరేజీ లభించింది. జాతీయ రాజకీయాల్లో టీడీపీ మరింత చురుగ్గా, ఎన్‌డీఏలో కీలక భాగస్వామిగా తన ప్రాధాన్యాన్ని నిరూపించుకునే వ్యూహంలో భాగంగా ఆయన ప్రచారం ఉందని జాతీయ మీడియా అభివర్ణించింది. రెండో విడతలో బిహార్లోని 122 అసెంబ్లీ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. మొదటి విడతలో 121 సీట్లకు ఈ నెల 6న ఎన్నికలు జరిగాయి. 14వ తేదీన ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

మంత్రిగారి కూలి పని...!



▸▸ **కార్మికులతో కలిసి మంత్రి నిమ్మల శ్రమదానం**

పాలకొల్లు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలతో నిత్యం మమేకమై.. శ్రమదాన కార్యక్రమాల్లో ముందుండే జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి తనదైన శైలిలో శ్రమదానం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో గౌడ, శెట్టిబలిజ (బీసీ) కల్యాణ మండపం నిర్మాణంలో భాగంగా ఆదివారం చేపట్టిన శ్లాబ్ నిర్మాణ పనుల్లో ఆయన పాల్గొన్నారు. ఎండ తీవ్రతగా ఉన్నప్పటికీ కార్మికులతో కలిసి ఇసుక, కంకర గమేళాను నెత్తిన పెట్టుకుని కాంక్రీట్ మిల్లర్‌లో వేశారు. భవన నిర్మాణానికి గత టీడీపీ హయాంలో రూ.1.50కోట్లు మంజూరు కావడంతో మొదటి అంతస్థుకు శ్లాబ్ వేశామని, అనంతరం వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి తెలిపారు. మళ్లీ ఇప్పుడు కూటమి నిధులు మంజూరు చేయడంతో కల్యాణ మండప నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామన్నారు.

ఈ రోడ్డు వినూత్నం గురూ...!



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ రామచంద్ర, డెన్మార్క్ ప్రతినిధులు సెబాస్టియర్, గ్లోవర్

▸▸ **శ్రీసత్యసాయి జిల్లాలో వినూత్న ప్రయోగం**

పుట్టపర్తి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో తొలిసారిగా ఫైబర్ టెక్నాలజీతో రహదారి నిర్మాణం చేపట్టారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి నుంచి కోడూరు వరకు 342వ నంబరు జాతీయ రహదారి (నాలుగు వరుసలు) నిర్మాణం సాగుతోంది. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద జరుగుతున్న పనులను డెన్మార్క్ ప్రతినిధులు జోష్ సెబాస్టియన్, మైక్ గ్లోవర్‌తో కలిసి జాతీయ రహదారుల ఈఎన్‌సీ రామచంద్ర ఆదివారం పరిశీలించారు. 'డెన్మార్క్‌కు చెందిన ఈ ఆధునాతన ఫైబర్ టెక్నాలజీ ఇప్పటికే హీత్రో ఎయిర్‌పోర్టు (యూకే), దుబాయి మెట్రో, జర్మనీ ఏ7 మోటార్‌వే వంటి ప్రపంచ ప్రఖ్యాత ప్రాజెక్టుల్లో విజయవంతమైంది. తారు మిశ్రమంలో ఆరమిడ్, పాలియోలెఫిన్ ఫైబర్లను కలపడం ద్వారా రహదారులపై గుంతలు, పగుళ్ల సమస్యలకు చెక్ పడుతుంది. ఈ టెక్నాలజీ ద్వారా రహదారుల జీవితకాలం 50శాతం పెరగడంతోపాటు మరమ్మతుల అవసరం గణనీయంగా తగ్గుతుంది. పర్యావరణానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ఫైబర్‌ను మళ్లీ వినియోగించుకోవచ్చు' అని తెలిపారు.

ఒక్క తల... 100 ట్యూబ్‌లైట్లు...!



▸▸ **తలపై పగలగొట్టించుకుని తొమ్మిదేళ్ల బాలిక సాహసం**

తాడిపత్రి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక యశస్విభారతి 6.9 నిమిషాల్లో తలపై 100 ట్యూబ్‌లైట్లను పగులగొట్టించుకుని ఔరా అనిపించింది. యశస్వి స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకునే లక్ష్యంతో తాడిపత్రిలోని కృష్ణాపురం జీరో రోడ్డులో ఆదివారం ఈ ఫీట్ చేసింది. యశస్విభారతి తల్లిదండ్రులు రంగనాథ, పద్మజ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వీడియోలు, ఫొటోలను నోబుల్‌బుక్ ఆఫ్ వరల్డ్స్ రికార్డ్స్ కమిటీకి పంపనున్నట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు.

పెరుగు రామకృష్ణకు సార్క్ పురస్కారం



న్యూఢిల్లీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు కవి పెరుగు రామకృష్ణకు సార్క్ సాహిత్య పురస్కారం లభించింది. 66వ సార్క్ సాహిత్య సదస్సు ఆదివారం ఢిల్లీలో ప్రారంభమైంది. 3రోజుల సదస్సులో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సార్క్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రొఫెసర్ ఆశిస్ నంది, అకాడమీ అధ్యక్షులు మాధవ్ కౌశిక్ అందుకున్నారు. అలాగే రామకృష్ణకు సార్క్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన తాజాగా రచించిన ఆంగ్ల కవిత్వం "ఈచెస్ ఆఫ్ నెల్లూర్" పుస్తకాన్ని మాధవ్ కౌశిక్ సభకు పరిచయం చేశారు.

పట్టిసీమ నుంచి తరలిన గోదారమ్మ!



పోలవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలను ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేశారు. గోదావరి నీటిమట్టం 15.60 మీటర్లకు పైగా ఉండడంతో రెండు మోటార్లు, రెండు పంపుల ద్వారా 708 క్యూసెక్కుల జలాలను విడుదల చేశామని ఈఈ యేసుబాబు తెలిపారు. రానున్న రోజుల్లో మిగిలిన మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు 11.10 టీఎంసీల నీటిని విడుదల చేశారు. 2015 అక్టోబరు నుంచి 418 టీఎంసీలు పంపిణీ చేయగా, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020-24 వరకు 101టీఎంసీలను మాత్రమే విడుదల చేసింది.

ఆ ఊర్లకు కిడ్నీ జబ్బు!

▸▸ **కొమ్మరపూడి, కొత్తవెల్లంటిలో మహమ్మారి**

నెల్లూరు రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు 15కి.మీ దూరంలోని కొమ్మరపూడి, కొత్తవెల్లంటి గ్రామాలను కిడ్నీవ్యాధి కలవరపెడుతోంది. నెల్లూరు రూరల్ మండల పరిధిలోకి వచ్చే ఈ రెండు గ్రామాల్లో ఇప్పటి వరకు అనేకమంది ఈ వ్యాధికారణంగానే చనిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. నిండా 300 గడపలు కూడా లేని కొమ్మరపూడిలో గత నాలుగేళ్లలో కిడ్నీ వ్యాధికారణంగానే ఏడుగురు చనిపోయారు. ప్రస్తుతం పది మందికిపైగానే బాధితులు ఉన్నారు. ఈ గ్రామంలోని వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలవారే. వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులు, రైతుకూలీలే. అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్తున్నవారు కిడ్నీ వ్యాధి సోకిందని చెబుతుండడంతో ఏంచేయాలో తెలీక ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్తే కిడ్నీ వ్యాధి వచ్చిందని మందులిస్తున్నారు. జబ్బు నిర్ధారణ అయ్యే సరికి డయాలిసిస్ దశకు వస్తున్నట్లు వారు వాపోతున్నారు. కొత్తవెల్లంటిని 20 ఏళ్లుగా ఈ వ్యాధి పీడిస్తోంది. 2వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఇప్పటివరకు 20 మంది వరకు కిడ్నీ వ్యాధితో మరణించారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామానికి బోర్ల నీరే దిక్కు. అధికార యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించి, వ్యాధి మూలాలను గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొమ్మరపూడి గ్రామం

ఎందుకు వస్తోందో తెలియడం లేదు



మా ఊర్లో కిడ్నీ వ్యాధులు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. అసలు వాటి మూలాలు ఎక్కడున్నాయో అయోమయంగా ఉంది. వృద్ధులతోపాటు, యువకులు కూడా వ్యాధి బారిన పడుతున్నారు. అధికారులు సర్వే చేసి వాస్తవాలు నిగ్గుతేల్చాలి.

- ఉప్పునూతల జనార్దన్, కొమ్మరపూడి



కిడ్నీ వ్యాధితో మంచంపట్టిన కాకి రమణయ్య, తోకంచి నాగయ్య

పరిశీలిస్తున్నాం...

ఈ రెండు గ్రామాల్లోనే కిడ్నీ వ్యాధులు ఎందుకు వస్తున్నాయో పరిశీలిస్తున్నాం. ఈ గ్రామాల్లో డయాబెటిక్ రోగులు ఎక్కువగా ఉన్నారు. వీరు దీర్ఘకాలికంగా వాడే మందుల వల్ల కూడా కిడ్నీ వ్యాధి రావచ్చు. ఆహారపు అలవాట్లూ కొంత కారణం కావచ్చు. పీహెచ్‌సీకి వచ్చే రోగులను పరిశీలిస్తున్నాం. - డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, సౌత్ మోపూరు పీహెచ్‌సీ వైద్యుడు

ఆంధ్రాలో దోపిడీలు..

అసోంలో ఆస్తులు!



చోరీ సొత్తుతో అసోంలో నిర్మిస్తున్న భవనం

విమానంలో బెజవాడకు.. రైళ్లలో చోరీలు

▸▸ వ్యాపారవేత్త తరహాలో ఆహార్యం, నడత

▸▸ ప్రయాణికుల మెడలో చైన్లు లాక్కొని పరారీ

▸▸ రాష్ట్రంలో 12.. దేశవ్యాప్తంగా 40 దొంగతనాలు

▸▸ ప్రభుత్వ రైల్వే పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర ఘరానా దొంగ సంజయ్ రాయ్

అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆ వ్యక్తిని చూడగానే ఎవరైనా వ్యాపారవేత్త అనుకుంటారు. కానీ అతడో అంతర్రాష్ట్ర ఘరానా దొంగ! అతడే అసోంకు చెందిన సంజయ్ రాయ్. ఎంచక్కా విమానం ఎక్కి విజయవాడకు వస్తాడు. ఇక్కడ రైలెక్కి తెనాలివెళ్లే లోపు దొంగతనం.. తిరిగి అక్కడ రైలెక్కి ఇటు రాజమండికి వెళ్లేలోపు మరో చోరీ చేస్తాడు. పని పూర్తికాగానే గన్నవరంలో మళ్లీ విమానం ఎక్కి 'బిజినెస్ ట్రిప్'(వ్యాపార పని) ముగించుకుని వెళ్లినట్టు మళ్లీ అసోం చేరుకుంటాడు. లోతుగా కూపీ లాగిన రైల్వే పోలీసులు సొత్తు రికవరీ కోసం అసోం వెళ్లగా అక్కడ సంజయ్ ఖరీదైన స్థలం కొనుగోలు చేసి భారీ భవంతి నిర్మిస్తున్నట్టు తెలిసి ఆశ్చర్యపోయారు.

చైన్ స్నాచింగ్‌పై దృష్టిపెట్టగా..

రాష్ట్రంలో ఇటీవల రైళ్లలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా మహిళల మెడలో చైన్లు తెంచుకుని దొంగలు పారిపోతున్నారు. వరుస ఫిర్యాదులతో రైల్వే డీఐజీ బి. సత్య యేసు బాబు ఈ వ్యవహారంపై సమీక్షించారు. ఇటీవల విజయవాడ నుంచి తెనాలి వెళుతున్న ఒక రైలు కృష్ణా కెనాల్ జంక్షన్ వద్ద నెమ్మదించింది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన దొంగ(సంజయ్ రాయ్) మహిళల మెడలో నుంచి టక్కున చైను లాక్కొని వేగంగా కిందికి దిగేశాడు. ప్రయాణికులు తేరుకునేలోపే కనిపించకుండా పారిపోయాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న గుంటూరు-విజయవాడ రైల్వే పోలీసులు సీసీ ఫుటేజీలు బయటికి తీసి ఆ మహిళకు చూపించడంతో దొంగను ఆమె గుర్తించారు. వెంటనే పోలీసులు అన్ని రాష్ట్రాల్లోని క్రైమ్ గ్రూపుల్లో ఈ వీడియోలు పోస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన ఒక పోలీసు ఇచ్చిన సమాచారంతో ఆ దొంగ అసోంకు చెందిన సంజయ్ రాయ్‌గా నిర్ధారించుకున్నారు. గతంలో అక్కడ అరెస్టయినప్పటి వివరాలతోపాటు ఆధార్ కార్డు సేకరించి నిఘా పెట్టారు. అలవాటులో భాగంగా సంజయ్ విమానం టిక్కెట్ బుక్ చేసుకోగానే రైల్వే పోలీసులకు సమాచారం వచ్చింది. గన్నవరంలో దిగి విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకుని మరో చోరీకి ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో ఏలూరు-రాజమహేంద్రవరం మధ్యలో పట్టుకున్నారు.



రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న సంజయ్(సీసీ టీవీ ఫుటేజ్)

కూలీ నుంచి చోరీగా!

అసోంలోని నాగావ్ జిల్లా చంగ్మాజీ రోడ్‌కు చెందిన సంజయ్ రాయ్(34) బాల్యంలో పేదరికం వల్ల కూలీ పనులు చేసుకునేవాడు. తర్వాత చిన్ననాటి స్నేహితులు నయన్ జ్యోతి, దీప్ జ్యోతితో కలిసి రైల్వే స్టేషన్ల వద్ద దొంగతనాలు మొదలు పెట్టాడు. మొదట్లో గౌహతిలోని చాపర్ముఖ్ రైల్వే స్టేషన్లో ఇనుప ముక్కలు దొంగతనం చేసి, దొరికిపోయి అక్కడి సెంట్రల్ జైలుకు వెళ్లాడు. బెయిలుపై వచ్చిన తర్వాత బెంగళూరుకు వెళ్లి కూలీ పనులు చేసుకుందామనుకున్నాడు. అయితే, రైల్లో ప్రయాణిస్తుండగా బెంగళూరులో ఒక మహిళ టాయిలెట్ వచ్చినప్పుడు అక్కడే ఉన్న సంజయ్ ఆమె మెడలోని బంగారు నగలను గమనించాడు. ఆమె టాయిలెట్‌కు వెళ్లి బయటకు వచ్చేదాకా డోర్ వద్ద కాపు కాచి రెప్పపాటులో మెడలో బంగారు చైను, నెక్లెస్ లాక్కొని రైలు నెమ్మదించగా కిందికి దూకేశాడు. ఆటోలో బస్టాండు చేరుకుని బెంగళూరు నుంచి బస్సులో హైదరాబాద్ చేరుకుని నగలు విక్రయించడంతో గతంలో ఇనుప ముక్కల విక్రయాల్లో ఎన్నడూ చూడనంత డబ్బులు వచ్చాయి. ఆ డబ్బుతో హైదరాబాద్‌లో విమానం ఎక్కి గౌహతి చేరుకున్నాడు. అలా మొదలైన సంజయ్ రాయ్ దొంగతనాలు దక్షిణాది రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలో 40 వరకు తేలాయి.

అత్యధికం తమిళనాడులో..
రెండో స్థానంలో ఏపీ

అసోం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వచ్చి బంగారం దోపిడీ చేస్తున్న సంజయ్ రాయ్ అత్యధికంగా తమిళనాడులో 16, ఏపీలో 12, తెలంగాణలో 9, కర్ణాటకలో 3 దొంగతనాలు చేసినట్లు తేలింది. ఇప్పటి వరకు ఏపీలో చేసిన దొంగతనాల్లో 290 గ్రాముల బంగారం తస్కరించిన సంజయ్ నుంచి పోలీసులు 34 గ్రాములే రికవరీ చేశారు. మిగతా బంగారం గురించి ప్రశ్నించగా అభిజిత్ సేన్(190 గ్రాములు), మిథున్ సేన్(66 గ్రాములు) వద్ద ఉన్నట్లు వెల్లడించాడు. ఆ ఇద్దరి కోసం అసోం వెళ్లిన పోలీసులకు మరో ఆశ్చర్యకర విషయం తెలిసింది. రాయ్ సొంతూరులో ఒక భవనం నిర్మిస్తున్నాడు. ఒకప్పుడు కూలీగా ఉన్న అతడు అనతి కాలంలోనే విమానాల్లో ప్రయాణిస్తూ భవనాలు నిర్మించే స్థాయికి ఎదగడంతో పరిచయాలు, గౌరవం కూడా పెరిగాయి. దొంగతనాలకు వెళ్లేందుకు సంజయ్‌కి అభిజిత్ సేన్, మిథున్ సేన్ విమాన టికెట్లు బుక్ చేసి పంపుతారు. సంజయ్ దక్షిణాదిలోనూ ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. దీప్ జ్యోతి, సతేందర్ కుమార్, సతీశ్ గుజ్జర్, రవికుమార్, లోకేందర్ పర్మార్, వికాస్ కుమార్, పల్సర్ లక్కీ, అమృత్ ఐనే, నయన్ జ్యోతి, అబ్దుల్ హసీబ్‌లతో దొంగతనాలు చేయిస్తూ అంతర్రాష్ట్ర పోలీసులకు సవాలు విసురుతున్నాడు. ఏపీ రైల్వే పోలీసులు.. సతేందర్, సతీశ్, రవికుమార్‌లను అరెస్టు చేసి గుంటూరు జైలుకు తరలించారు.

ప్రయాణాల్లో పసిడి ధరించొద్దు

రైళ్లలో వెళ్లే మహిళలు సాధ్యమైనంత వరకు బంగారు ఆభరణాలు ధరించవద్దని జీఆర్‌పీ డీఐజీ సత్యయేసుబాబు సూచించారు. ఒకవేళ ధరించాల్సి వస్తే అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రైళ్లలో టాయిలెట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వెళ్లరాదని హెచ్చరించారు. డోరు వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే.. మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్లిక్ నుంచి క్రిప్టో దాకా

(మొదటి పేజీ తరువాయి)

అయిపోతోందని పోలీసులు అంటున్నారు. మన దేశంలోని స్కామర్లను అరెస్టు చేసి జైలుకు పంపి ఎంతో కొంత సంతృప్తి చెందుతున్నారు. మన రాష్ట్రంలో ప్రతి రోజూ రెండున్నర కోట్ల రూపాయలకుపైగా సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని సైబర్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ చెబుతున్నారు. ఐఐటీ పట్టభద్రుడైన ఏలూరు ఎస్పీ ప్రతాప్ కిశోర్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న తన ఐఐటీ స్నేహితులతో కలిసి తాజా సైబర్ నేరాలపై లోతుగా విశ్లేషణ చేశారు. ప్రజల డబ్బులు కొల్లగొట్టడమేగాక దేశ భద్రతకు ఎలాంటి సవాలు విసురుతున్నారో వివరిస్తూ కేంద్ర హోంశాఖ, ఆర్‌బీఐకి నివేదిక పంపారు. నేరాల కట్టడి, సొమ్ము రికవరీకి పలు సిఫారసులు చేశారు. సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత ఖాతాల కంటే ఎక్కువగా కరెంట్, కార్పొరేట్ ఖాతాలు సేకరించి కోట్లాది రూపాయలు దోచేస్తున్నారు. ఒక కార్పొరేట్ ఖాతాలోకి ఎంత డబ్బు వచ్చినా బ్యాంకర్లు అనుమానించరు. అంతేగాక కార్పొరేట్ ఖాతాలైతే అక్కడి నుంచి ఎంతమంది బ్యాంకు అకౌంట్లకైనా చిటికెలో బదిలీ చేయవచ్చు. అలాంటి వాటిని సేకరించి మోసాలకు పాల్పడుతున్నారు. ఆ ఖాతాల్లోకి జమ చేయించుకున్న సొమ్మును క్షణాల్లో క్రిప్టో కరెన్సీకి మళ్లించేస్తున్నారు. మళ్లీ ఇతర అకౌంట్లకు మళ్లించి డ్రా చేసుకుంటున్నారు.

బ్యాంకర్లు, పోలీసుల సహకారం: సైబర్ నేరగాళ్లు తాము చేసే నేరాలకు అక్కడక్కడా కొందరు బ్యాంకర్లు, పోలీసులను వాడుకుంటున్నారు. ఏలూరులో ఒక పెద్దావిడను డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.52 లక్షలు కాజేసిన సైబర్ ముఠా బెంగళూరుకు చెందిన మహమ్మద్ హసన్ పేరుతో ఉన్న కార్పొరేట్ ఖాతా(ఎస్ బ్యాంకు)లోకి బదిలీ చేయించినట్లు తేలింది. మహారాష్ట్రకు చెందిన ఓ బ్యాంకర్ ఇచ్చిన సమాచారంతో ఆ ఖాతాను అద్దెకు తీసుకున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. రాజకీయపరమైన ఫండ్ ఉందని, కోట్లలో డిపాజిట్ చేయించి విత్ డ్రా చేసుకున్నాక కమీషన్ ఇస్తామని నేరగాళ్లు ఆశ చూపి హసన్‌ను ఢిల్లీకి తీసుకెళ్లారు. అసలు విషయం తెలియడంతో తాను అంగీకరించలేనని హసన్ అడ్డు చెప్పడంతో తుపాకీ తలకు గురిపెట్టి నేరగాళ్లు బెదిరించారు. హసన్ ఇచ్చిన సమాచారంతో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఇతర సైబర్ నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. దేశంలో 1.80 కోట్ల మంది వ్యక్తిగత డేటా చోరీ జరిగినట్లు ఒక సర్వేలో తేలింది. డేటా చోరీ టాప్-5 దేశాల్లో మన దేశం రెండో స్థానంలో ఉంది. సైబర్ మోసగాళ్లు మాయ చేసి కరెంట్, కార్పొరేట్ ఖాతాల్లోకి డబ్బులు వేయించుకున్న వెంటనే వందల ఖాతాల్లోకి బదిలీ చేసి క్రిప్టో కొనుగోలు చేస్తుండటంతో రికవరీ అసాధ్యమవుతోంది. ఆ సొమ్ము ఎలా రికవరీ చేయవచ్చనే విషయంపై 'భారత్ పోల్' ద్వారా పోలీసులు చైనీస్ గేట్ వేస్‌కు లేఖలు రాశారు. దొంగ సొమ్ముతో కొనుగోలు చేసిన క్రిప్టో కరెన్సీని సీజ్ చేయమని కోరారు.

టెలిగ్రామ్ నుంచి డార్క్‌నెట్ దాకా..

డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాల ద్వారా కొట్టేసిన డబ్బును బదిలీ చేయించుకోవడానికి సైబర్ నేరగాళ్లు మ్యూల్ ఖాతాల కోసం టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా సంప్రదిస్తున్నారు. నిరుద్యోగులకు గేలం వేసి రోజుకు 2వేల నుంచి పది వేల వరకూ ఇస్తామంటూ వారితో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి అద్దెకు తీసుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు పసిగట్టినప్పుడో, 1930 ద్వారా ఖాతా ఫ్రీజ్ అయినప్పుడో ఆపేస్తున్నారు. ఈ ఖాతాల్లోకి కొట్టేసిన డబ్బులు వచ్చేందుకు 3కీలక మార్గాలు ఎంచుకుంటున్నారు. ప్రతి నెలా పెన్షన్ తీసుకునే రిటైర్డ్ ఉద్యోగులు, బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్లు చేసి ప్రతి నెలా వడ్డీతో బతుకుతున్న డబ్బున్న పెద్దలు.. పెట్టుబడి పెట్టేందుకు డీ మ్యాట్ ఖాతాలు తెరిచి అధిక లాభాల గురించి నెట్‌లో వెతికేవారు.. ఆన్‌లైన్లో ఫుడ్ నుంచి వస్తువుల వరకూ ఆర్డర్లు పెట్టే వ్యక్తులను పసిగడుతున్నారు. సమాచారం సేకరించి పెట్టుకునే వ్యక్తుల్ని డార్క్ నెట్ ద్వారా సంప్రదించి కొనుగోలు చేశాక ఫిషింగ్‌కు పాల్పడుతున్నారు. పీఎం కిసాన్, ఆరోగ్య శ్రీ, ఈ-చలాన్ ఇలా ఎంచుకున్న కస్టమర్ నెట్‌లో ఏది ఎక్కువగా సెర్చ్ చేస్తారో దానికి సంబంధించిన పేరుతో ఏపీకే ఫైల్స్ పంపి ఓపెన్ చేసేలా కవ్విస్తున్నారు. వాట్సాప్ గ్రూపులోకి పంపిన ఏపీకే ఫైల్స్ తెరవగానే ఆండ్రాయిడ్ ఫోన్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. ఏదైనా ఆర్డర్ పెట్టినప్పుడు పాస్‌వర్డ్ పసిగట్టి మొత్తం ఖాతాలో ఉన్న డబ్బు కొల్లగొడుతున్నారు. ఇక పెన్షనర్లు, డిపాజిటర్లను నేరాలకు పాల్పడ్డారంటూ బెదిరిస్తున్నారు. యూనిఫామ్ వేసుకుని వీడియో కాల్ చేసి సీబీఐ, ఈడీ పేరు చెప్పి డిజిటల్ అరెస్టు అంటూ భయాందోళనకు గురి చేస్తున్నారు. ఖాతా వివరాలు చెప్పాలంటూ వీడియో కాల్స్‌లో బెదిరిస్తూ అందినకాడికి డబ్బు కొల్లగొడుతున్నారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- సైబర్ నేరగాళ్లు కొట్టేసిన సొమ్ము రికవరీ దాదాపు అసాధ్యంగా మారుతోందని, కంటికి కనిపించకుండా జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తతే శ్రీరామ రక్ష అని సైబర్ పోలీసులు అంటున్నారు.
- వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు.
- డిజిటల్ అరెస్టు బెదిరింపులకు భయపడొద్దు.
- పెట్టుబడి అనేది డీ మ్యాట్ అకౌంట్ లేకుండా ఆన్‌లైన్ ద్వారా స్క్రీన్‌పై చూపించే వాటిని నమ్మొద్దు.
- సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ రాగానే భయపడటం, ఏదో ఆశ చూపగానే దురాశకు పోవడం, మోసపోయిన వెంటనే పోలీసులకు(డయల్ 112) లేదా సైబర్ పోలీసులు(డయల్ 1930)కు సమాచారం ఇవ్వకపోవడం అంటే.. పెద్ద పొరపాటు చేసినట్లే.

డేటా సేకరించి డార్క్‌నెట్‌లో విక్రయం

ఆండ్రాయిడ్ ఫోన్‌ను సాధనంగా వాడుకుంటున్నారు. హ్యాకింగ్, ట్రాకింగ్, ట్యాపింగ్‌తో డేటా చౌర్యం చేస్తున్నారు. అంతిమంగా పర్సనల్ డేటా లాగేసి డార్క్ నెట్‌లో విక్రయించే ముఠాలను సైబర్ నేరగాళ్లు సంప్రదిస్తున్నారు. ఇటీవల మా పోలీసు బృందాలు ఒక కీలక కేసులో ఆరు రాష్ట్రాల్లో నెల రోజులు తిరిగి 400కు పైగా సైబర్ మోసాలకు పాల్పడిన మాయ అనే మహిళ, ఓ బ్యాంకు ఉద్యోగి, పోలీసు కానిస్టేబుల్ సహా 11 మంది ముఠాను అరెస్టు చేశారు. 150 మ్యూల్ ఖాతాలు, 112 చైనీస్ పేమెంట్ గేట్ వేస్, వందల కొద్దీ టెలిగ్రామ్ గ్రూపులతో కాంబోడియా కేంద్రంగా సాగిస్తున్న వ్యవస్థీకృత నేర దందాను వెలుగులోకి తెచ్చాం.

- ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్

కదిలొచ్చే.. వైద్య విద్యాలయం!

▸▸ **యువ వైద్యులు, విద్యార్థులకు వరం**

▸▸ **ల్యాప్రోస్కోపిక్ చికిత్సలపై ఉచిత శిక్షణ**



అమరావతి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వైద్య విధానంలో కీలకమైన ల్యాప్రోస్కోపిక్‌లో మరింత అధునాత శిక్షణను యువ వైద్యులు, వైద్య విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా 'కదిలొచ్చే వైద్య విద్యాలయం' సోమవారం నుంచి 32 రోజుల పాటు రాష్ట్రంలో అందుబాటులో ఉండనుంది. ఇప్పటికే ఎందరో వైద్యులకు శిక్షణ ఇచ్చిన ఈ వాహనాన్ని ప్రముఖ వ్యాపార సంస్థ 'జాన్సన్ అండ్ జాన్సన్' కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్) కింద నిర్వహిస్తోంది. 'ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్'గా పేర్కొనే ఈ వైద్య విద్యాలయం బస్సు.. గత ఆరేళ్లుగా కొన్ని వేల మంది వైద్యులకు, వైద్య విద్యార్థులకు శస్త్ర చికిత్సల్లో మెలకువలు నేర్పించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు చేరువైంది. వైద్యులు, వైద్య విద్యార్థులకు 'స్కిల్ ల్యాబ్' శిక్షణను ఉచితంగా అందిస్తుంది. సోమవారం నుంచి డిసెంబరు 11 వరకు ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మొత్తంగా 1300 మందికి శిక్షణ ఇవ్వనుంది. ఎందరో ప్రముఖ వైద్యులు ఈ బస్సులో శిక్షణ పొందడం విశేషం. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కేవలం పాఠ్య, ప్రయోగ విజ్ఞానం అందుబాటులో ఉంది. అయితే, యువ వైద్యులు, విద్యార్థులు ఆశించిన స్థాయిలో అనుభవం గడించలేక పోతున్నారు. దీంతో వారు శస్త్ర చికిత్సల సమయంలో తడబడుతున్నారు. మరికొందరు సీనియర్ వైద్యుల పక్కన నిలబడి ఏళ్లతరబడి పరిశీలించాల్సి వస్తోంది. ఇలాంటి వారికి 'ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్' ఎంతగానో ఉపయోగపడుతోంది. సోమవారం విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో తొలి రోజు శిక్షణ ప్రారంభం కానుంది. తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోకు ఈ వాహనం వెళ్లనుంది.

ల్యాప్రోస్కోప్ సర్జరీలపై శిక్షణ..

వాహనంలో ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స పద్ధతులు.. లైవ్ టిష్యూ (పిగ్ పేగులు), స్టిమ్యులేటర్స్(సర్జరీ లైవ్) వంటి పరికరాలను బస్సులో ఏర్పాటు చేశారు. వర్క్‌షాప్‌లో ల్యాప్ ఫండోప్లికేషన్(కడుపులో నుంచి అన్నవాహికలోకి యాసిడ్ ప్రవేశించకుండా నిలువరించే చికిత్స), ల్యాప్ బౌల్ అనాస్టమోసిస్(పేగు సర్జరీ), ల్యాప్ స్ప్లీనెక్టమీ(ప్లీహం తొలగించడం), ల్యాప్ హిస్టరెక్టమీ(గర్భసంచీ తొలగించడం), ల్యాప్ కొలెక్టమీ(పెద్దపేగు తొలగింపు)లలో మరింత శిక్షణ ఇవ్వనున్నారు. యువ వైద్యులు, విద్యార్థులకు 'ఇన్‌స్టిట్యూట్ ఆన్ వీల్స్' అద్భుత అవకాశమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రఘునందనరావు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.